సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 86

సోమవారం 11-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్

శాసనసభాపక్ష నాయకుడిగా ఎన్నుకున్న బీజేపీ ఎమ్మెల్యేలు - 6లో



బీమా భారం తగ్గేదెలా?

హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు - 13లో



బంధం మరింత బలోపేతం

గౌరవం, విలువల ఆధారంగా భారత్, దక్షిణకొరియాల సంబంధం బలపడుతోందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



వారసుడిగా మేనల్లుడు

బీఎస్పీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారు.

వివరాలు 6లో ▸



సాగరతీరంలో విన్యాసాలు

పాక్‌పై విజయానికి ప్రతీకగా తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో విశాఖలో నేవీడే విన్యాసాలు నిర్వహించారు.

వివరాలు 14లో ▸



ద.అమెరికాలోనూ యుద్ధమే!

రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–పాలస్తీనా తరహాలో గయానా–వెనిజులా మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

బాబు పాపాలే ఇప్పుడు శాపాలు..

- తన ఆత్మ చంద్రబాబు నిర్వాకాలను కప్పెట్టి, వాటిని సీఎం జగన్‌పై రుద్దుతూ 'ఈనాడు' విషప్రచారం
- 14 ఏళ్ల అధికారంలో ఉన్న బాబు ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టునూ నిర్మించలేదు
- జలయజ్ఞం కింద రూ.లక్ష కోట్లతో ఒకేసారి 83 ప్రాజెక్టులు చేపట్టిన మహానేత వైఎస్సార్
- అప్పట్లో పూర్తయిన గుండ్ల కమ్మ ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసిన బాబు
- సముద్రతీరానికి దగ్గర ఉండటంవల్ల నీటి స్వభావం మారి ప్రాజెక్టు గడ్డర్లు, గేట్లు దెబ్బతిన్నాయని 2015లోనే హెచ్చరించిన నిపుణుల కమిటీ
- కానీ, పనులు చేయకుండానే రూ.5.15 కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన చంద్రబాబు

3లో

గాయం మానేలా సాయం

విపత్తుల వేళ సర్కారు 'ప్రత్యేక ఆర్థిక సాయం' ఇదే తొలిసారి

- పునరావాస కేంద్రాలకు రాని కుటుంబాలకూ రూ.2,500
- ఈ విధానాన్ని మొట్టమొదటిగా తెచ్చిన సీఎం వైఎస్ జగన్
- గతం కంటే మిన్నగా, వేగంగా, మెరుగ్గా బాధితులకు సాయం
- అధికారులకు ముందుగానే నిధులు.. సహాయ చర్యలకు తగినంత సమయం
- ఆ తర్వాత స్వయంగా బాధితులను కలసి ప్రభుత్వ సాయాన్ని నిర్ధారించుకుంటూ ముఖ్యమంత్రి పరామర్శ
- అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తూ యంత్రాంగానికి సీఎం ఆదేశాలు..
- విపత్తులను ఎదుర్కొనేందుకు పటిష్ట వ్యవస్థ నిర్మాణం
- సచివాలయాలు, వలంటీర్ల ద్వారా వేగంగా పునరావాస చర్యలు
- రెడ్ కార్పెట్ పరామర్శలంటూ పెత్తందార్ల ఆక్రోశం

2లో



బాపట్ల పర్యటనలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విపత్తుల సమయంలో బాధితులు కోరుకునేది తక్షణం ఆదుకునే ఆపన్న హస్తాన్ని! ఆర్భాటాలు.. హడావుడి.. డొల్ల ప్రచారంతో ఏం ఒరుగుతుంది? సహాయ చర్యల్లో నిమగ్నం కావాల్సిన అధికార యంత్రాంగాన్ని సొంత ప్రచారం కోసం తన చుట్టూ తిప్పుకున్న పెద్ద మనుషులు నీతి సూక్తులు బోధించడం దయ్యాలు వేదాలు వల్లించడం కాదా? పెత్తందారులు అందుకు వంత పాడటంలో ఏమైనా ఔచిత్యం ఉందా? అధికార యంత్రాంగానికి ముందుగానే నిధులిచ్చి దిశా నిర్దేశం చేస్తూ సీఎం జగన్ ఎప్పటికప్పుడు సహాయ చర్యలను పర్యవేక్షించడంతో పెత్తందారుల బృందానికి దిక్కుతోచడం లేదు.

కమలాపురం.. జనసంద్రం..

- చెన్నూరు సభకు పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- డప్పుల చప్పుళ్లతో, ఆట పాటలతో ప్రాంగణానికి చేరిక
- నేతలు సీఎం జగన్ పేరు ప్రస్తావించగానే.. సభికుల చప్పట్లు, కేరింతలు
- అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగనేనని నేతల ప్రశంసలు

2లో



భూగర్భజల పరిరక్షణలో

ఏపీ టాప్

వర్షం, జలసంరక్షణ చర్యల వల్ల 983.3 టీఎంసీలు భూగర్భజలాలుగా రూపాంతరం

జాతీయ ప్రమాణాల మేరకు 934.21 టీఎంసీలు వాడుకునే అవకాశం

అందులో 264.18 టీఎంసీలు మాత్రమే వినియోగించుకున్న రాష్ట్రం

భూగర్భజలాల పరిరక్షణలో రెండో ఏడాదీ దేశంలో ముందు నిలిచిన ఏపీ

కేంద్ర భూగర్భజలవనరుల మండలి అధ్యయనంలో వెల్లడి

- వివరాలు 10లో

విమానయానంలో

విప్లవం

- 2014కు ముందు, తర్వాత గమనిస్తే గణనీయ పురోగతి
- మధురపూడి ఎయిర్ పోర్టులో అంతర్జాతీయ స్థాయి వసతులు
- కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా
- రూ.347 కోట్లతో టెర్మినల్ బిల్డింగ్‌కు శంకుస్థాపన



5లో

గుండ్లకమ్మ రెండో గేటు స్థానంలో

స్టాప్‌లాగ్ గేటు

సీఎం జగన్ ఆదేశాలతో హుటాహుటిన ఏర్పాటుచేసిన అధికారులు

0.75 టీఎంసీల నీరు కడలిపాలు కాకుండా అడ్డుకట్ట

ప్రాజెక్టులో 1.1 టీఎంసీల నిల్వకు మార్గం సుగమం

3లో

కంటికి రక్ష..



చూపు సమస్యల బాధితులకు వరంగా జగనన్న ఆరోగ్య సురక్ష

వైద్యశిబిరాల్లో ఉచిత కంటి స్క్రీనింగ్

5.73 లక్షల మందికి అద్దాలు

78 వేల మందికి క్యాటరాక్ట్ సర్జరీలు

3లో





మీకు దండం పెడతా! మొత్తం డబ్బు ఎంతో చెప్పి పుణ్యం కట్టుకోండి!!

ప్లాస్టిక్ పెనుభూతం

- ఆహారం ద్వారా మానవ శరీరంలోకి..
- నిత్యం ఒక వ్యక్తిలోకి 10 గ్రాముల మైక్రోప్లాస్టిక్
- ఏటా మానవుల శరీరాల్లోకి 18 లక్షల మైక్రోప్లాస్టిక్ కణాలు.. ఇది గతంతో పోలిస్తే 100 రెట్లు ఎక్కువ
- ప్లాస్టిక్ కంటైనర్‌లలో నిల్వ చేసిన ఆహారం తీసుకోవడం గర్భిణులకు ప్రమాదం
- మగ శిశువుల సంతానోత్పత్తి వ్యవస్థపై ప్రతికూల ప్రభావం
- బ్రిటన్‌లోని పోర్ట్స్ మౌత్ విశ్వవిద్యాలయం పరిశోధకుల వెల్లడి



వీటిలోనే మైక్రోప్లాస్టిక్‌లు ఎక్కువ..

చాలా సూక్ష్మమైన ప్లాస్టిక్ కణాలను మైక్రోప్లాస్టిక్ అంటారు. వీటి పరిమాణం 0.1 నుంచి 5 గ్రాముల వరకు ఉంటుంది. సగటున ఒక వ్యక్తి శరీరంలోకి ఏటా 11,845 నుంచి 1,93,200 మైక్రోప్లాస్టిక్ కణాలు చేరుతున్నాయి. ముఖ్యంగా వేడి ఉష్ణోగ్రతల్లో, మైక్రోవేవ్‌ల్లో ఎక్కువసేపు నిల్వ ఉంచడం వల్ల బీపీఏ రసాయనాలు ప్లాస్టిక్ నుంచి కరిగి ఆహారంలోకి వెళ్తున్నాయి. మైక్రోప్లాస్టిక్‌లు సాధారణంగా కుళాయి నీటిలో, ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ చేసిన నీటిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

సాక్షి, అమరావతి: పర్యావరణానికే కాకుండా మానవాళి ఆరోగ్యానికి కూడా ప్లాస్టిక్ పెనుభూతంగా మారింది. ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్లి ప్రాణాలు హరిస్తోంది. నిత్యం ఒక వ్యక్తి శరీరంలోకి ఆహారం ద్వారా 10 గ్రాముల మైక్రోప్లాస్టిక్ ప్రవేశిస్తోంది. ఇది గతంలో అనుకున్నదాని కంటే 100 రెట్లు ఎక్కువ. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఏటా మానవ శరీరాల్లోకి 18 లక్షల మైక్రోప్లాస్టిక్ కణాలు చేరుతున్నాయి. ఈ మేరకు బ్రిటన్‌లోని పోర్ట్స్ మౌత్ విశ్వవిద్యాలయం పరిశోధకులు సంచలన విషయాలు వెల్లడించారు. తమ తాజా అధ్యయనంలో భాగంగా వారు ఆహారంలో ఉండే మైక్రోప్లాస్టిక్‌లను గుర్తించడానికి రెండు రకాల ఆహార పదార్థాలను సేకరించారు. ఇందులో ప్లాస్టిక్ ప్యాకింగ్ వస్తువుల్లో దాదాపు 2.30 లక్షల మైక్రోప్లాస్టిక్‌లు ఉన్నట్టు కనుగొన్నారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ లేని వస్తువుల్లో 50 వేల మైక్రోప్లాస్టిక్ కణాలు గుర్తించారు. ముఖ్యంగా బొమ్మలు, దుస్తుల నుంచి రోజూ 2వేల నుంచి 7వేల మైక్రోప్లాస్టిక్ కణాలు గాలి, ఆహారం ద్వారా చేరుతున్నాయి. కాగా మన దేశం ఏటా 3.5 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేస్తోంది. అయితే రీసైకిల్ చేసే సామర్థ్యం అందులో సగం మాత్రమే ఉంది.

పుట్టబోయే బిడ్డకూ..

ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) పరిశోధనల ప్రకారం.. గర్భిణులు ప్లాస్టిక్ కంటైనర్‌లలో నిల్వ చేసిన ఆహారాన్ని తీసుకోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ మైక్రోప్లాస్టిక్ కణాలు పుట్టబోయే బిడ్డ సంతానోత్పత్తిని కూడా దెబ్బతీస్తున్నాయి. ఆహారాన్ని ఘన, ద్రవ రూపంలో నిల్వ చేయడం కోసం ఉపయోగించే ప్లాస్టిక్ కంటైనర్లను సాధారణంగా పాలికార్బోనేట్ ప్లాస్టిక్ నుంచి తయారు చేస్తారు. ఈ ప్లాస్టిక్‌ను అనువైందిగా చేయడానికి బిస్ఫినాల్ ఏ రసాయనం కలుపుతారు. ఇది మహిళలు గర్భధారణ సమయంలో మగ శిశువు సంతానోత్పత్తి వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ నేపథ్యంలో గర్భిణులు ప్లాస్టిక్ కంటైనర్లలోని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. సాధారణంగా బీపీఏ రసాయనం హార్మోన్లను ప్రభావితం చేయడంతో పాటు క్యాన్సర్, వంధ్యత్వానికి దారితీస్తుంది.



గుండెలోనూ ప్లాస్టిక్ కణాలు..

అమెరికన్ కెమికల్ సొసైటీ అధ్యయనం ప్రకారం.. చైనాలోని బీజింగ్ అంజెన్ హాస్పిటల్‌లోని శాస్త్రవేత్తల బృందం మొదటిసారిగా మానవ గుండెలో మైక్రోప్లాస్టిక్‌లను గుర్తించింది. గుండె శస్త్రచికిత్స సమయంలో 15 మంది వ్యక్తుల నుంచి ఆపరేషన్‌కు ముందు, ఆ తర్వాత గుండె కణజాల నమూనాలు సేకరించారు. సేకరించిన రక్త నమూనాలన్నీ ప్లాస్టిక్ కణాలను కలిగి ఉండగా, శస్త్రచికిత్స తర్వాత వాటి సగటు పరిమాణం తగ్గింది.

శాస్త్రవేత్తలు ఏం చెబుతున్నారంటే..

ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహారాన్ని నిల్వ ఉంచొద్దు. మైక్రోవేవ్ ప్లాస్టిక్‌ను తగ్గించాలి. ప్లాస్టిక్ బాటిళ్లలో నీటికి బదులుగా గాజు, స్టీల్, రాగిని ఉపయోగించాలి. ఇంటి చెత్తలో ప్లాస్టిక్‌ని వేయొద్దు.. అలా చేస్తే రీసైకిల్ చేయడం కష్టమవుతుంది.

కాఫీ.. రైతులు హ్యాపీ

- లాభాల పంట పండిస్తున్న చింతపల్లి కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్.. రైతులకు బోనస్‌ల రుచి అందిస్తూ ప్రగతి బాటలో పయనం
- 2020లో రూ.4.68 కోట్లతో ప్రారంభించిన ప్రభుత్వం..
- 1,500 మంది కాఫీ రైతులతో సహకార సంఘం
- రైతులకు మద్దతు ధరతోపాటు గిరిజనులకు ఉపాధి.. జి.మాడుగుల, జీకే వీధిలో మరో రూ.7.70 కోట్లతో రెండు యూనిట్ల నిర్మాణం
- వచ్చే సీజన్‌లో ప్రారంభించేలా పనులు

14లో





వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గం చెన్నూరులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కమలాపురం.. జనసంద్రం



వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చెన్నూరు సభకు పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

- డప్పుల చప్పుళ్లతో, ఆటపాటలతో ప్రాంగణానికి చేరిక
- నేతలు సీఎం జగన్ పేరు ప్రస్తావించగానే.. సభికుల చప్పట్లు
- అణగారిన వర్గాల ఆశా జ్యోతి జగనేనని నేతల ప్రశంసలు

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పోటెత్తారు. చెన్నూరులో నిర్వహించిన బహిరంగ సభకు జనం వెల్లువలా తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి డప్పుల దరువులు, ఆటపాటలతో ప్రజానీకం ర్యాలీగా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ఇలా వేలాది మంది తరలి రావడంతో సభాస్థలిలో అందరూ కూర్చునే పరిస్థితి లేకుండా పోయింది. వెరసి చెన్నూరులో ఎటు చూసినా, ఏ వీధిలో చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ జెండాలను రెపరెపలాడిస్తూ కనిపించారు. కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు తమ ప్రసంగాల్లో సీఎం జగన్ పేరును ఉచ్చరించగా.. సభికులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలు అమలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే, కొమురం బీమ్ వంటి మహనీయుల ఆలోచనలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. అణగారిన వర్గాలకు అండగా, భావి తరాల ఉన్నతికి దూరదృష్టితో పెద్దపీట వేస్తున్న వైఎస్ జగన్‌ను మరోమారు మన కోసం ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కామెడీ యాక్టర్ పవన్, నయవంచకుడు చంద్రబాబు కలిసికట్టుగా వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని సూచించారు.

సామాజిక సాధికారత మా విధానం : డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

స్వతంత్ర భారతదేశంలో సామాజిక సాధికారత అనేది ఒక నినాదంగానే మిగిలిపోయిందని, అయితే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారతను తన విధానంగా మార్చుకుందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా చెప్పారు. 2014–19 వరకు సాగిన టీడీపీ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కూడా మంత్రివర్గంలో స్థానం లభించలేదని, వైఎస్సార్‌సీపీ.. నలుగురు మైనార్టీలను ఎమ్మెల్యేలుగా చేసిందని, మరో నలుగురికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిందన్నారు. తనకు ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టారని చెప్పారు.

ఏపీలోనే సామాజిక విప్లవం: మంత్రి మేరుగు

సామాజిక న్యాయం అనేది ఏపీలోనే, వైఎస్ జగన్ నాయకత్వంలోనే సాకారమైందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. రాజ్యాంగ బద్ధంగా బడుగులకు రావాల్సిన హక్కులు సంక్రమిస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు హయాంలో దళితులపై, బీసీలపై దాడులు చూశామని, దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అన్న నాడే చంద్రబాబు దళితద్రోహి అని తేలిపోయిందని, బీసీల తోకలు కత్తిరిస్తానన్న నాడే బీసీ వ్యతిరేకి అని వారు పసిగట్టారని చెప్పారు.

సన్నిధి గొల్ల కొనసాగింపు: మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తిరుమల సన్నిధి గొల్లను తిరిగి కొనసాగించి రాష్ట్రంలోని యాదవుల ఆత్మగౌరవాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిపారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. రాయలసీమలో తొలిసారి యాదవులకు ఎమ్మెల్సీ దక్కిందని, మేయర్ పదవులను యాదవులకు అప్పగించి గౌరవించిన చరిత్ర సీఎం జగన్‌దేనన్నారు.

ఆచరణలో చూపిన సీఎం: ఎంపీ అవినాష్‌రెడ్డి

సామాజిక సాధికారిత కాగితాలకే పరిమితమయ్యేదని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దానిని ఆచరణలో చూపారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చెప్పారు. కేబినెట్ కూర్పు నుంచి నామినేటెడ్ పదవులు.. చివరకు ఆలయాల పాలక మండళ్లలో సైతం చిత్తశుద్ధి ప్రదర్శించారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు సమన్యాయం పాటించిన చరిత్ర జగనన్నదేనని మాజీ ఎంపీ బుట్టా రేణుకా అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, రామచంద్రారెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తుపాను నష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్. చిత్రంలో మంత్రులు తానేటి వనిత, కాకాణి తదితరులు



గాయం మానేలా సాయం

విపత్తుల వేళ సర్కారు 'ప్రత్యేక ఆర్థిక సాయం' ఇదే తొలిసారి



మహిళలతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్



తన కష్టాలు చెప్పుకునేందుకు వచ్చిన ఓ అవ్వ చేతి నుంచి సంచి పడిపోగా.. ఆ సంచిని తీసి ఇస్తున్న సీఎం జగన్



బాధితుడి సమస్యను వింటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: విపత్తుల సమయంలో బాధితులు కోరుకునేది తక్షణం ఆదుకునే ఆపన్న హస్తాన్ని! మానవత్వంతో ఉదారంగా సాయం అందించే ఔదార్యాన్నే! కల్లబొల్లి కబుర్లు.. కెమెరాల ముందు డ్రామాను కానేకాదు! ఆర్భాటాలు.. హడావుడి.. డొల్ల ప్రచారంతో ఏం ఒరుగుతుంది? సహాయ చర్యల్లో నిమగ్నం కావాల్సిన అధికార యంత్రాంగాన్ని సొంత ప్రచారం కోసం తన చుట్టూ తిప్పుకున్న పెద్ద మనుషులు నీతి సూక్తులు బోధించడం దయ్యాలు వేదాలు వల్లించడం కాదా? పెత్తందారులు అందుకు వంత పాడటంలో ఏమైనా ఔచిత్యం ఉందా? అధికార యంత్రాంగానికి ముందుగానే నిధులిచ్చి దిశా నిర్దేశం చేస్తూ సీఎం జగన్ ఎప్పటికప్పుడు సహాయ చర్యలను పర్యవేక్షించడంతో పెత్తందారుల బృందానికి దిక్కు తోచడం లేదు. తుపాన్ బాధిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలకు రానివారికి సైతం రూ.2,500 చొప్పున ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందచేయాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించడం గమనార్హం. ఈ విధానాన్ని తొలిసారిగా తీసుకొచ్చారు. తన పర్యటనలతో సహాయ చర్యలకు అడ్డు పడకుండా యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో మోహరించి తగినంత సమయం ఇచ్చాక నేరుగా బాధితుల వద్దకు వెళ్లి వారి కష్ట నష్టాలను సీఎం తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ సాయం అందిందో లేదో వారినే ఆరా తీసుకున్నారు. గతం కంటే మిన్నగా, వేగంగా, ఎంతో మెరుగ్గా సహాయ చర్యలను అమలు చేస్తూ సాయం అందచేస్తున్నారు.

నాడు ఈవెంట్‌లా.. నేడు భరోసానిస్తూ

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితుల సమస్యలు సావధానంగా ఆలకిస్తూ అక్కడిక్కడే వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తే రెడ్ కార్పెట్ పరామర్శ అంటూ 'ఈనాడు' తన అక్కసు మరోసారి చాటుకుంది. రైతులు, బాధితులను ఓదార్చుతూ.. ధైర్యం చెబుతూ సాగిన సీఎం పర్యటన ఎల్లో మీడియాకు రుచించలేదు. తుపాను పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడంతోపాటు శరవేగంగా సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించే విషయంలో మీనమేషాలు లేకుండా తక్షణమే ప్రభుత్వం స్పందించడం ఓ వర్గం మీడియాకు మింగుడు పడలేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు విపత్తులు వస్తే చురుగ్గా కదిలేవారంటూ తన అసలు రంగును బయట పెట్టుకున్న ఎల్లో మీడియా తుపానులు, వరదలు, చివరకు పుష్కరాలను కూడా పబ్లిసిటీ కోసం టీడీపీ అధినేత వినియోగించుకున్న విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించింది. ఓపక్క ప్రజలు అవస్థ పడుతుంటే అధికార యంత్రాంగాన్నంతా తన వెంట తిప్పుకుని, ఫొటో షూట్‌లు నిర్వహిస్తూ, డ్రోన్లతో చిత్రీకరిస్తూ సహాయ చర్యలను పక్కనపెట్టిన సంగతి ఎవరికి తెలియదు? విపత్తుల వేళ కనీసం నిధులు కూడా ఇవ్వకుండా, పరిహారం సరిగా అందించకుండా వైపరీత్యాలను సైతం ఓ ఈవెంట్‌లా మార్చి హంగామా చేసిన చంద్రబాబును గొప్ప వ్యక్తిగా చూపించేందుకు ఈనాడు తన పైత్యాన్నంతా రంగరించి కథనాలు అల్లింది.

పటిష్ట వ్యవస్థ.. తొలిసారి 'టీఆర్ 27'

గతానికి భిన్నంగా విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి జగన్ పటిష్ట వ్యవస్థను నిర్మించడంతో తక్షణమే ఫలితాలు అందుతున్నాయి. కరోనా సమయంలో అత్యంత వేగంగా వ్యాక్సిన్లు పంపిణీ చేయడమే దీనికి నిదర్శనం. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అన్ని శాఖలకు అనుసంధానించి తుపాన్లు లాంటి వైపరీత్యాల్యపై ముందే అప్రమత్తం చేస్తున్నారు. తాజాగా మిచాంగ్ తుపాను తీవ్రత పెరిగిన వెంటనే 420కిపైగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల్లో ప్రజలను తరలించారు. భోజనం, మంచినీటితోపాటు ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఇబ్బంది లేకుండా పెద్ద ఎత్తున వైద్య శిబిరాలను నెలకొల్పారు. శిబిరాలకు రాని వారికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా నిత్యావసరాలు సమకూర్చారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, లీటర్ వంట నూనె అందించారు. సీఎం జగన్ ముందుగానే రెండు దఫాలు కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకుండా ఉదారంగా సాయం అందించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం 'టీఆర్ 27' కింద అప్పటికప్పుడు ప్రభావిత జిల్లాలకు రూ.28 కోట్లు విడుదల చేశారు. తుపానుకు నాలుగు రోజుల ముందు నుంచే జరుగుతున్న ఈ సన్నద్ధత అందరికీ తెలిసినా ఈనాడు, చంద్రబాబుకు మాత్రం కనపడకపోవడాన్ని ఏమనాలి?

నిధులిచ్చి.. సర్వం సిద్ధం చేసి

విపత్తు వేళ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ముందుగానే నిధులిచ్చి సర్వం సిద్ధం చేసిన సీఎం జగన్ సహాయ చర్యలు నిరాటంకంగా కొనసాగేందుకు తగినంత సమయం ఇచ్చారు. పరిస్థితి కొంత కుదుట పడ్డాక క్షేత్రస్థాయిలో పర్యటించి స్వయంగా బాధితుల వద్దకు వెళ్లారు. తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించారు. ఆర్థిక సాయం విషయంలో మరింత ఉదారంగా వ్యవహరించారు. అప్పటివరకు పునరావాస కేంద్రాలకు వచ్చిన కుటుంబాలకు మాత్రమే రూ.2,500 చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందిస్తుండగా అక్కడకు రాని వారికి సైతం ఇళ్లకు వెళ్లి మరీ పరిహారం ఇవ్వాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. సహాయ చర్యల కోసం అప్పటికే రూ.28 కోట్లు విడుదల చేయగా అదనపు సాయం వల్ల రెట్టింపు మొత్తం విడుదల చేయాల్సి వచ్చినా భరించేందుకు సిద్ధమయ్యారు. ప్రతి బాధిత కుటుంబానికి సాయం అందాల్సిందేనని నిర్దేశించి వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. ఈనాడు చెబుతున్నట్లుగా ఓ ప్రభుత్వాధినేత తూతూమంత్రంగా పర్యటిస్తే ఇలా స్పందించడం సాధ్యమవుతుందా? ప్రజల ఇబ్బందులను స్వయంగా చూశాక ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రతి కుటుంబానికి ఇవ్వాలని సీఎం అప్పటికప్పుడే నిర్ణయించారు. చంద్రబాబు హయాంలో అసలు ఈ ప్రత్యేక సాయం అనేదే లేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నుంచే విపత్తుల సమయంలో ప్రత్యేక సాయాన్ని అందించే విధానాన్ని ప్రారంభించారు.

ఓదార్చి.. ఊరడిస్తూ

బాధిత ప్రాంతాల పర్యటనలో సీఎం జగన్ ప్రజలకు దూరంగా ఉన్నారంటూ ఈనాడు తప్పుడు కథనాలను ప్రచురించింది. తిరుపతి, బాపట్ల జిల్లాల పర్యటనల్లో సీఎం జగన్ స్వయంగా బాధితులను ఓదార్చారు. రైతన్నలతో మాట కలిపి వారి పరిస్థితి అడిగి తెలుసుకుని ఊరడించారు. ఎవరికీ అన్యాయం జరగనివ్వబోనని, ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటానని ధైర్యం చెప్పారు. ఖరీఫ్ సీజన్ ముగిసే లోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, 80 శాతం రాయితీతో శనగ విత్తనాలు అందచేస్తామని హామీ ఇచ్చారు. కొందరు ఇచ్చిన అర్జీలపై అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలిచ్చారు.

ప్రతి అడుగులో అన్నదాత సంక్షేమమే

సీజన్ చివరిలో పంట నష్టపరిహారం

వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతన్నలకు అదే సీజన్ చివరిలో పెట్టుబడి రాయితీని (ఇన్‌పుట్ సబ్సిడీ) సీఎం జగన్ అందచేస్తున్నారు. నాలుగున్నరేళ్లలో 22.85 లక్షల మందికి రూ.1,976.45 కోట్ల పరిహారాన్ని అందించారు. విపత్తులతో పంటలు నష్టపోతే 80 శాతం సబ్సిడీతో సర్టిఫై చేసిన విత్తనాలిస్తున్నారు. రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. టీడీపీ ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల పరిహారం ఇవ్వగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు 54.48 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల బీమా పరిహారం అందచేసింది. అంతేకాకుండా చంద్రబాబు 6.19 లక్షల మందికి ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల పంటల బీమా పరిహారాన్ని సైతం సీఎం జగన్ చెల్లించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద రూ.లక్ష లోపు పంట రుణం తీసుకొని ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు పూర్తి వడ్డీ రాయితీని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. టీడీపీ హయాంలో 40.60 లక్షల మంది రైతులకు రూ.685 కోట్ల వడ్డీ రాయితీనిస్తే సీఎం జగన్ 73.88 లక్షల మంది రైతులకు రూ.1,834.55 కోట్లు (గత సర్కారు బకాయిలతో కలిపి) వడ్డీ రాయితీని అందించారు.

హామీకి మించి 'భరోసా'

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు అందిస్తామన్న మేనిఫెస్టో హామీకి మించి సీఎం జగన్ ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు రూ,67,500 అందచేస్తుండటం గమనార్హం. భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద కౌలురైతులతో పాటు అటవీ, దేవదాయ భూసాగుదారులకు సైతం రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2019–20 నుంచి ఏటా సగటున 52.57 లక్షల రైతు కుటుంబాలకు ఇప్పటివరకు రూ.31,005.04 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించారు. దురదృష్టవశాత్తూ ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతన్నలకు అందించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచారు. ఇప్పటి వరకు 1,270 రైతు కుటుంబాలకు రూ.88.90 కోట్ల పరిహారం చెల్లించారు. ఇందులో 485 మంది కౌలు రైతులు కూడా ఉన్నారు. టీడీపీ హయాంలో 2014–19 మధ్య జరిగిన రైతు ఆత్మహత్యలపై పునర్విచారణ జరిపి 474 మందికి రూ.23.70 కోట్ల పరిహారం చెల్లించారు. వీరిలో కూడా 212 మంది కౌలు రైతులున్నారు.

దళారీలు లేకుండా ధాన్యం సేకరణ

ధాన్యం సేకరణలో దళారీ వ్యవస్థను, మిల్లర్ల జోక్యాన్ని ప్రభుత్వం పూర్తిగా నివారించింది. నాలుగున్నరేళ్లలో వ్యవసాయ క్షేత్రాల నుంచి ఆర్బీకేల ద్వారా 33.59 లక్షల మంది రైతుల నుంచి 3.16 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.60 వేల కోట్లు చెల్లించింది. పైగా గోతాలు, కూలీలు, రవాణా ఖర్చులు (జీఎల్‌టీ) రూపంలో ఎకరాకు రూ.10 వేల వరకు ప్రభుత్వమే భరిస్తోంది. ఇలా ఎమ్మెస్పీకి అదనంగా క్వింటాకు రూ.252 వరకూ చెల్లిస్తోంది రూ.3 వేల కోట్లతో ఏర్పాటు చేసిన ధరల స్థిరీకరణ నిధితో మార్కెట్‌లో ధరలు పతనమైన ప్రతీసారి జోక్యం చేసుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది. ఇలా 21.55 లక్షల మంది నుంచి రూ.7,712.32 కోట్ల పంట ఉత్పత్తులు కొనుగోలు చేసింది.

ఆర్బీకేలతో రైతు ముంగిట్లో సేవలు

దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ స్థాయిలో ఏర్పాటైన 10,778 ఆర్బీకేల ద్వారా రూ.1,208.60 కోట్ల రాయితీపై 41.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు. రూ.1,259 కోట్ల విలువైన 11.39 లక్షల టన్నుల ఎరువులు, రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగు మందులను పంపిణీ చేశారు. నాణ్యమైన ఎరువులను రైతుల ముంగిటికే తీసుకెళ్లడం ద్వారా బస్తాకి రూ.20–రూ.30 వరకు హమాలీ, రవాణా ఖర్చులు మిగులుతున్నాయి. టీడీపీ హయాంలో సగటున 153.95 లక్షల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడులొస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాలుగేళ్లలో 165.87 లక్షల టన్నుల దిగుబడులు వచ్చాయి. దేశంలోనే తొలిసారి ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (ఈ క్రాప్) ప్రామాణికంగా వాస్తవ సాగుదారులకు సంక్షేమ ఫలాలను అందచేస్తున్నారు.

పరిహారం పెంచారిలా...

విపత్తులతో వ్యవసాయ భూముల్లో మేట వేసే మట్టి, ఇసుక తొలగించేందుకు చంద్రబాబు హయాంలో హెక్టారుకి రూ.12 వేలు ఇవ్వగా సీఎం జగన్ ప్రభుత్వం రూ.18 వేలకు పెంచింది. దెబ్బతిన్న వర్షాధార పంటలకు హెక్టారుకి గతంలో రూ.6,800 ఉన్న పరిహారాన్ని రూ.8,500కి పెంచింది. నీటిపారుదల భూములైతే ఇన్‌పుట్ సబ్సిడీ గతంలో రూ.13,500 ఇవ్వగా ఇప్పుడు రూ.17 వేలు అందిస్తున్నారు. ప్రధానంగా వరి, వేరుశనగ, పత్తి, చెరుకు తదితర పంటలకు గతంలో హెక్టార్‌కు రూ.15 వేలు ఇవ్వగా ప్రస్తుతం రూ.17 వేలకు పెంచారు. ఉద్యాన పంటలకు రూ.7,500 నుంచి రూ.17 వేలకు పెంచారు. మామిడి, నిమ్మజాతి పంటలకు రూ.20 వేల నుంచి రూ.22,500కి, మల్బరీకి రూ.4,800 నుంచి రూ.6 వేలకు పెంచి ప్రభుత్వం అందచేస్తోంది. గతంలో గేదెలు, ఆవులు మరణిస్తే పరిహారంగా రూ.30 వేలు నిర్ణయించగా ఇప్పుడు రూ.37,500 ఇస్తున్నారు. గొర్రెలు, మేకలైతే గతంలో రూ.3 వేల చొప్పున పరిహారం వర్తించగా ఇప్పుడు రూ.4 వేలు ఇస్తున్నారు. మత్స్యకారుల బోట్లు పాక్షికంగా దెబ్బతింటే బాబు హయాంలో రూ.4,100 ఇవ్వగా ఇప్పుడు సీఎం జగన్ రూ.6 వేలకి పెంచారు. వలలు పాక్షికంగా దెబ్బతింటే ఇచ్చే పరిహారాన్ని రూ.2,100 నుంచి రూ.3 వేలకి పెంచారు. బోట్లు పూర్తిగా దెబ్బతింటే కొత్త బోట్ల కోసం ఇచ్చే సాయాన్ని రూ.9,600 నుంచి రూ.15 వేలకి పెంచారు. పూర్తిగా దెబ్బతిన్న వలలకు రూ.2,600 మాత్రమే ఉన్న సాయాన్ని రూ.4 వేలకి పెంచి అందిస్తున్నారు.

రూ.5,942.05 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు

చంద్రబాబు హయాంలో కరువు వచ్చినా.. వరదలొచ్చినా.. అకాల వర్షాలు కురిసి పంటలు నష్టపోతే రెండేళ్ల దాకా పరిహారానికి దిక్కు లేని దుస్థితి. 2014–15లో కర్నూలు జిల్లాలో అక్టోబర్, డిసెంబర్‌లో వర్షాలు కురిస్తే 2016 జూలైలో పంట నష్టపరిహారం అరకొరగా విదిల్చారు. 2014లో కర్నూలు జిల్లాలో కరువు వస్తే 2017లో కరువు భృతి నిచ్చారు. 2018 ఖరీఫ్‌లో భారీగా పంట నష్టం జరిగితే పూర్తిగా ఎగ్గొట్టారు. ఐదేళ్లలో 24.80 లక్షల మందికి రూ.2,558.07 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుదే. ఇవే కాకుండా సబ్సిడీ విత్తనాల కింద రూ.282.71 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణ రాయితీ రూ.1,180.66 కోట్లు, పంటల బీమా పరిహారం రూ.715.84 కోట్లు, ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.23.70 కోట్లు, యాంత్రీకరణ కోసం రూ.221.07 కోట్లు, ధాన్యం బకాయిలు రూ.960 కోట్లు కలిపి ఏకంగా రూ.5,942.05 కోట్లు ఎగ్గొట్టిన ఘనత కూడా చంద్రబాబుదే.



తుపానుతో నష్టపోయిన మహిళకు ధైర్యం చెబుతున్న సీఎం జగన్



బాపట్ల జిల్లాలో తడిసిన వరి కంకులను పరిశీలిస్తున్న సీఎం జగన్

బాబు పాపాలే ఇప్పుడు శాపాలు..



తన ఆత్మ బాబు నిర్వాకాలను కప్పెట్టి, వాటిని సీఎం జగన్‌పై రుద్దుతూ 'ఈనాడు' విషప్రచారం

- 14 ఏళ్లు అధికారంలో ఉన్న బాబు ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టునూ నిర్మించలేదు
- జలయజ్ఞం కింద రూ.లక్ష కోట్లతో ఒకేసారి 83 ప్రాజెక్టులు చేపట్టిన మహానేత వైఎస్
- అప్పట్లో పూర్తయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసిన బాబు
- సముద్రతీరానికి దగ్గర ఉండటంవల్ల నీటి స్వభావం మారి ప్రాజెక్టు గడ్డర్లు, గేట్లు దెబ్బతిన్నాయని 2015లోనే హెచ్చరించిన నిపుణుల కమిటీ
- కొత్త గడ్డర్లు ఏర్పాటుచేసి.. గేట్లకు మరమ్మతులు చేయాలని సూచిస్తూ నివేదిక
- కానీ, పనులు చేయకుండానే రూ.5.15 కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన చంద్రబాబు
- ఆ పాపం ఫలితంగానే మొన్న ఆగస్టు 31న గుండ్లకమ్మ మూడో గేటు కొట్టుకుపోయింది
- ఈ నెల 8న కూడా రెండో గేటు కొట్టుకుపోవడానికి ఆయనే కారణం
- ఈ రెండు సందర్భాల్లోనూ యుద్ధప్రాతిపదికన స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేసి, నీటిని నిల్వచేసిన ప్రభుత్వం
- తద్వారా రైతుల ప్రయోజనాలను పరిరక్షించిన సీఎం జగన్
- పులిచింతల గేటు.. అన్నమయ్య, పింఛా ప్రాజెక్టుల మట్టికట్టలు కొట్టుకుపోవడానికి బాబే బాధ్యుడు
- చంద్రబాబు కమీషన్ల కక్కుర్తికి నిదర్శనమే దెబ్బతిన్న పోలవరం డయాఫ్రమ్ వాల్ కూడా..
- అయినా నిత్యం సీఎం జగన్‌పై రామోజీ ఏడుపుగొట్టు రాతలు

సాక్షి, అమరావతి: తన ఆత్మ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పాపాలను కప్పెట్టి.. వాటిని సీఎం వైఎస్ జగన్‌పై రుద్దుతూ విషం చిమ్మడంలో తనకు అలుపే లేదని ఈనాడు రామోజీరావు రోజూ చాటుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1995 నుంచి 2004 మధ్య.. విభజన తర్వాత 2014 నుంచి 2019 మధ్య 14 ఏళ్లు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటంటే ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా ఆయన డిజైన్ చేసి, పూర్తిచేసి, జాతికి అంకితం చేసిన దాఖలాల్లేవు. పైగా తాను నిర్మించని ప్రాజెక్టుల భద్రత, నిర్వహణను సైతం గాలికొదిలేశారు. మరోవైపు.. వాటి నిర్వహణ పేరుతో పనులు చేపట్టకుండానే చేపట్టినట్లు చూపి కాంట్రాక్టర్లకు భారీ ఎత్తున నిధులు దోచిపెట్టి, వారి నుంచి కమీషన్లు దండుకున్నారు. ఆ పాపాల ఫలితంగానే ఇప్పుడు గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు తుప్పుపట్టిపోయి ఈనెల 8న వరద ఉధృతికి దాని అడుగుభాగం కొట్టుకుపోయింది. అలాగే, పులిచింతల ప్రాజెక్టు గేటు.. అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టు మట్టికట్టలు కొట్టుకుపోవడానికి.. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి చంద్రబాబు అవినీతి, అసమర్థతేనని అధికారవర్గాలు స్పష్టంచేస్తున్నాయి. కానీ, ఈ పాపాన్ని సీఎం వైఎస్ జగన్‌పై రుద్దుతూ 'కొత్తవి కట్టరు.. ఉన్నవి కొట్టుకుపోతున్నాయ్!' అంటూ ఆదివారం తన విషపుత్రిక ఈనాడులో రామోజీ అబద్ధాలను రంగరించి చంద్రబాబుకు ఇబ్బంది కలిగించే అంశాలను ప్రస్తావించకుండా జాగ్రత్తగా అచ్చేశారు. ఇందులో వీసమెత్తు నిజం లేకపోగా.. ప్రతి అక్షరంలో జగన్‌పై తనకున్న అసూయ, విద్వేషాన్ని రామోజీ ప్రదర్శించారు.

నిపుణుల కమిటీ నివేదికలు బుట్టదాఖలు..

2004లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం కింద రూ.లక్ష కోట్ల వ్యయంతో రాష్ట్రంలో ఒకేసారి గుండ్లకమ్మ, పులిచింతల, పోలవరం సహా 83 ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును 2008 నాటికే పూర్తిచేసి జాతికి అంకితం చేశారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టులో మిగిలిన పనులను సీఎం జగన్ పూర్తిచేస్తూ జాతికి అంకితం చేస్తున్నారు. నెల్లూరు, సంగం బ్యారేజ్‌లు, గాలేరు–నగరిలో భాగమైన అవుకు రెండో టన్నెల్‌ను ఇప్పటికే జాతికి అంకితం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టీడీపీ సర్కార్ అధికారంలోకి వచ్చింది. 2015 నుంచి 2019 వరకూ ఏటా నిపుణులతో కూడిన డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ గుండ్లకమ్మ ప్రాజెక్టును తనిఖీచేసి.. ఇది సముద్రతీరానికి సమీపంలో ఉండటంవల్ల నీటి స్వభావంలో మార్పులతో గేట్లు, గడ్డర్లు తుప్పుపట్టాయని.. కొత్త గడ్డర్లను ఏర్పాటుచేసి, గేట్లకు మరమ్మతులు చేయాలని ఏటా నివేదిక ఇస్తూ వచ్చింది. బాబు వాటిని బుట్టదాఖలు చేశారు. కానీ, ఆ పనులన్నీ చేసినట్లు చూపి రూ.5.15 కోట్లను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. అప్పట్లో ఆ పనులను చేసి ఉంటే.. ఈ ప్రాజెక్టు గేట్లు ఇప్పుడు కొట్టుకుపోయేవి కాదు. చంద్రబాబు నిర్వాకంవల్లే గతేడాది ఆగస్టు 31న గుండ్లకమ్మ మూడు.. ఈనెల 8న రెండో గేటు కొట్టుకుపోయాయి. ఈ రెండు సందర్భాల్లోనూ యుద్ధప్రాతిపదికన స్టాప్‌లాగ్ గేట్లను ఏర్పాటుచేసి, ప్రాజెక్టులో నీటినిల్వ చేయడం ద్వారా రైతుల ప్రయోజనాలను జగన్ పరిరక్షించారు. అలాగే, రూ.9.14 కోట్లతో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసేందుకు టెండర్లు ఖరారు చేసి యుద్ధప్రాతిపదికన ఆ పనులు పూర్తిచేయనున్నారు.

'పులిచింతల'లోనూ అదే నిర్లక్ష్యం..

అంతేకాక.. పులిచింతల గేట్ల అమరిక కూడా సక్రమంగాలేదని.. వాటిని సరిదిద్దాకే కాంట్రాక్టరుకు తుది బిల్లు చెల్లించాలని 2015లో నిపుణుల కమిటీ నివేదిక ఇస్తే.. చంద్రబాబు తుది బిల్లుతోపాటు బ్యాంకు గ్యారంటీలను చెల్లించి, ప్రభుత్వ ఖజానా నుంచి అదనంగా రూ.199 కోట్లు దోచిపెట్టి కమీషన్లు దండుకున్నారు. ఈ పాపం ఫలితంగానే 2021, ఆగస్టు 5న పులిచింతల 16వ గేటు కొట్టుకుపోయింది. అప్పట్లో యుద్ధప్రాతిపదికన స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుచేసి.. పూర్తి స్థాయిలో 45.77 టీఎంసీలు నిల్వచేసి తద్వారా సీఎం జగన్ రైతుల ప్రయోజనాలను కాపాడారు. ఇటీవలే కొత్త గేటును సైతం బిగించారు. ఇక గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేయకుండానే ప్రధాన(ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను రూ.400 కోట్లతో చంద్రబాబు నిర్మించారు. కాఫర్ డ్యామ్‌ల ఖాళీ ప్రదేశాల గుండా 2020లో గోదావరి అధిక ఉధృతితో ప్రవహించడం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. దీనికి రామోజీ ఏం సమాధానం చెబుతారో!?

ప్రాజెక్టుల విధ్వంసకుడు చంద్రబాబే..

అధికారంలో ఉన్న 14 ఏళ్లు చంద్రబాబు ప్రాజెక్టుల నిర్వహణ, భద్రతను గాలికొదిలేశారు.

- శ్రీశైలం ప్రాజెక్టుకు 1998లో 7.36 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు.. దాన్ని సక్రమంగా నియంత్రించేలా అధికారులకు అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశాలివ్వడంలో విఫలమవడంతో శ్రీశైలం కుడిగట్టు విద్యుత్కేంద్రాన్ని వరద ముంచెత్తి, అపార నష్టాన్ని చేకూర్చింది.
- అనంతపురం జిల్లాలో వేదవతిపై నిర్మించిన భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) గేట్లు తుప్పుపట్టాయని, వాటికి మరమ్మతులు చేయాలని 1997 నుంచి 2001 వరకూ అనేకసార్లు అధికారులు ప్రతిపాదనలు పంపారు. వాటిని చంద్రబాబు తుంగలోకి తొక్కడంతో 2001లో వేదవతికి వచ్చిన వరద ఉధృతికి బీటీపీ గేట్లు కొట్టుకుపోయాయి.
- అలాగే, చెయ్యేరుకు ఆకస్మికంగా వరదలు వస్తాయని.. ఆ ప్రాజెక్టు గేట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని.. అధునాతన జనరేటర్ ఏర్పాటుచేయాలని 1999 నుంచి 2003 వరకూ అనేకసార్లు నిపుణుల కమిటీ నివేదికలిచ్చింది. వాటినీ చంద్రబాబు తుంగలో తొక్కేశారు. దాంతో చెయ్యేరుకు 2003లో వచ్చిన వరదలకు అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి.
- 2018లో చిత్తూరు జిల్లాలో వరదలకు కాళంగి ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయినా బాబులో చలనంలేదు. ప్రాజెక్టుల విధ్వంసకుడు ఎవరో రామోజీ ఇప్పుడు చెప్పాలి..

అదనపు స్పిల్ వే నిర్మించి ఉంటే..

ఇక అన్నమయ్య జిల్లాలో చెయ్యేరుపై అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట 2021, నవంబర్ 19న తెగిపోవడం ద్వారా అపార నష్టం వాటిల్లడానికీ చంద్రబాబే కారణం. చెయ్యేరుకు ఆకస్మికంగా వరదలొస్తాయని.. ఆ ఉధృతిని తట్టుకోవాలంటే మట్టికట్ట స్థానంలో అదనపు స్పిల్ వే నిర్మించాలని 2015, 2017లలో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. ఆ మేరకు అదనపు స్పిల్ వే నిర్మించి ఉంటే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయేది కాదు. అలాగే, పింఛా ప్రాజెక్టు మట్టికట్ట బలహీనంగా ఉందని.. దానికీ మరమ్మతు చేయాలని 2015లో నిపుణుల కమిటీ చేసిన సూచనను చంద్రబాబు పట్టించుకోలేదు. దానివల్ల 2021, నవంబరు 19న ఇది తెగిపోయింది.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

బతికున్నానంటే ప్రభుత్వం పుణ్యమే



ఒకరోజు ఉన్నట్టుండి తీవ్ర జ్వరం, కడుపు నొప్పి వచ్చింది. గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చేరా. తోడుగా నా భార్య నరసమ్మ ఉంది. రక్త పరీక్షలు చేసి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని డాక్టర్లు చెప్పారు. డయాలసిస్ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేకపోతే బతకడం కష్టమన్నారు. నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఇన్ని విన్నాక ఏమి చేయాలో మాకు అర్థం కాలేదు. మాది కర్నూలు జిల్లా కోసిగిలోని నాగన్నకట్ట. ఉపాధి కోసం మా అమ్మానాన్నలు నరసప్ప, రామక్క మమ్మల్ని తీసుకుని చాలా ఏళ్ల కిందట గుంటూరు వచ్చేశారు. అప్పట్లో నేనూ వారితోనే కూలికి వెళ్లేవాడిని. కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. అప్పుడప్పుడూ సొంతూరు కోసిగికి వెళ్లి వస్తుంటాం. నాన్న 2014లో అనారోగ్యంతో కాలం చేశారు. అమ్మ ఉంది. నాకు 28 ఏళ్లు. ఇద్దరు పిల్లలు చిన్న వాళ్లు. ఇంటికి నేనే ఆధారం. నేను మొన్నటి వరకు పత్తి కంపెనీలో పనిచేసేవాడిని. రోజుకు రూ.700 వచ్చేది. నా భార్య కూలికెళితే 500 వస్తుంది. వంట్లో నలతగా ఉన్నా, వర్షం పడినా ఆ రోజు మాకు కూలి ఉండదు. ఈ తరుణంలో కిడ్నీ రూపంలో ఆపద ముంచుకొచ్చింది. నా ప్రాణం ఎలా నిలబెట్టుకోవాలా అని దిగులు పడుతున్న సమయంలో ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా డయాలసిస్ చేస్తారన్న సంగతి డాక్టర్లు చెప్పారు. ఆరోగ్య శ్రీ కార్డుతో గుంటూరులోని అశ్విన్ ఆస్పత్రిని సంప్రదించాం. అక్కడ మళ్లీ వైద్య పరీక్షలు చేశారు. రోజు విడిచి రోజు డయాలసిస్ చేసుకోవాలని చెప్పారు. లేకపోతే ప్రాణానికి కష్టమన్నారు. చేతికి చిన్న సర్జరీ (ఏవీ ఫిస్టులా) చేసి, డయాలసిస్ చేస్తున్నారు. నా అనారోగ్యం దృష్ట్యా నెలకు రూ.10 వేలు పింఛన్ అందిస్తుండడం మా కుటుంబానికి ఎంతో ఊరటనిస్తోంది. ప్రతి నెలా పింఛన్ తీసుకోవడానికి కోసిగికి వస్తాను. ఒకసారి నాకు ఆరోగ్యం బాగోలేకపోతే వలంటీర్ నర్సారెడ్డి గుంటూరుకు వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లారు. ఇంతకంటే నాకు ఇంకేం కావాలి? నేను బతికున్నానంటే ఈ ప్రభుత్వం పుణ్యమే.

– గుర్రాల మునిస్వామి, కోసిగి
(నీలి ఈరేష్, విలేకరి, కోసిగి)

ఇల్లు కదలకుండా ఉపాధి



గతంలో అచ్యుతాపురంలో ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమలో దినసరి కూలీగా పనిచేసేదాన్ని. చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ కష్టమయ్యేది. మాది అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం లైను కొత్తూరు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. నా భర్తకు ఇటీవలే ఒక ప్రమాదంలో కాలు విరగడంతో ఇంటి దగ్గరే ఉన్నారు. పిల్లల చదువు, వారి పోషణ, కుటుంబ ఖర్చులు భారమై, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఈ సమయంలో ఆసరా పథకం ద్వారా రూ.48,690, చేయూత పథకం ద్వారా రూ.56,250, బ్యాంక్ లోన్ రూ లక్ష, స్త్రీనిధి లోన్ నుంచి రూ.లక్ష తీసుకుని సొంతంగా ఇంటి దగ్గర కిరాణా–పాన్ షాపు పెట్టుకున్నాను. ప్రస్తుతం రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అమ్మకం జరుగుతోంది. నెలకు రూ.15 వేల వరకు సంపాదిస్తున్నా. ఇంటి దగ్గరే ఉండి, ఇతర సొంత పనులు కూడా చేసుకుంటూ ఇలా ఉపాధి పొందుతున్నా. అమ్మ ఒడి, విద్యా దీవెన ద్వారా పిల్లలను బాగా చదివించుకుంటున్నా. ఇంటిల్లిపాది సంతోషంగా జీవనం సాగిస్తున్నాం.

– రుత్తల రమణమ్మ, లైను కొత్తూరు
(జోగా తలుపులురాజు, విలేకరి, యలమంచిలి)

దర్జాగా వ్యవసాయం చేస్తున్నా..



ఎన్నో ఏళ్లుగా వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నాం. మాది నిరుపేద రైతు కుటుంబం. నాకంటూ సొంత భూమి లేదు. కుటుంబ పోషణ కోసం విజయనగరం జిల్లా గంట్యాడ మండలం పెదవేమలిలో వేరొకరి వద్ద మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ప్రకృతి అనుకూలించి, ఎలాంటి చీడపీడలు సోకకుండా ఉంటేనే పంట చేతికి వచ్చేది. దాంతో మరో ఏడాది వ్యవసాయానికి పెట్టుబడి లభించేది. కానీ పరిస్థితులు అన్నీ మనకు అనుకూలంగా ఉండవు కదా! ఏటా నష్టాలు చవిచూసేవాడిని. పెట్టుబడికి అప్పులు చేయాల్సి వచ్చేది. దానిని తీర్చే అవకాశం కూడా ఉండేది కాదు. వ్యవసాయం అంటేనే విరక్తి కలిగింది. ఇక మానేద్దాం అనుకుంటున్న సమయంలో ఈ ప్రభుత్వం వచ్చింది. ప్రతి ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయంగా రూ.13,500 నా బ్యాంకు ఖాతాలో పడుతోంది. దీనివల్ల అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది ఉండట్లేదు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నాను. మాకు ఒక్కతే కుమార్తె. ఆమెను కష్టపడి చదివించాను. ఆమె డీఫార్మసీ చదువుకుని ప్రైవేటుగా పని చేస్తోంది. అందరం ఆనందంగా ఉన్నాం.

– పాశల సత్యం, పెదవేమలి
(పొటుపురెడ్డి ఎర్రినాయుడు, విలేకరి, విజయనగరం ఫోర్ట్)

'ఈసీబీసీ' అమల్లో ఏపీ భేష్

బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే



సాక్షి, అమరావతి: ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ)ను అమలు చేయడంలో ఏపీ ప్రభుత్వం, విద్యుత్ సంస్థల పనితీరును కేంద్ర విద్యుత్ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే ప్రశంసించారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ దక్షిణాది రాష్ట్రాల సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈసీబీసీ అమలు, వాటాదారులకు శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అభయ్ భాక్రే చెప్పారు. భవన రంగంలో విద్యుత్ ఆదా కోసం ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సస్టైనబుల్ బిల్డింగ్ కోడ్(ఈసీఎస్‌బీసీ) తీసుకురానున్నట్లు వెల్లడించారు. కర్బన ఉద్గారాలను అరికట్టడం, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి అనుగుణంగా ఆవిష్కరణలను ప్రోత్సహించడం తదితరాలను నిర్మాణ రంగంలో అమలు చేసేందుకు ఈ కోడ్‌ను రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ప్రకారం కర్బన ఉద్గారాల్లో 39 శాతం భవన నిర్మాణ రంగం నుంచే వస్తోందని చెప్పారు. దీనిని తగ్గించడానికి భవన నిర్మాణంలో పాటించాల్సిన ప్రమాణాలను ఈ కోడ్ నిర్దేశిస్తుందని తెలిపారు. 2030 నాటికి భవన నిర్మాణ రంగంలో 50 శాతం ఇంధన డిమాండ్‌ను ఆదా చేయడంతో పాటు 300 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించడానికి బీఈఈ కృషి చేస్తోందన్నారు. ఈ సదస్సుకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ వర్చువల్‌గా హాజరయ్యారు. విశాఖలో నిర్మిస్తున్న సూపర్ ఈసీబీసీ బిల్డింగ్ విశేషాలను ఆయన వివరించారు. వచ్చే జనవరి నాటికి దీనిని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో బీఈఈ డైరెక్టర్ సౌరభ్, ఏపీ, తెలంగాణ డిజిగ్నేటెడ్ ఏజెన్సీస్ సీఈవోలు కుమార్‌రెడ్డి, జనాహ్ తదితరులు పాల్గొన్నారు.

'మిచాంగ్'ను జాతీయ విపత్తుగా ప్రకటించండి

ప్రధాని మోదీకి చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 15 జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపిన మిచాంగ్ తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించి బాధితులను ఆదుకోవాలంటూ ప్రధాని మోదీకి చంద్రబాబు లేఖ రాశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 22 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు తెలుస్తోందని, రూ.10 వేల కోట్ల విలువైన పంటనష్టం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తుపాను తీవ్రత, నష్టం దృష్ట్యా దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు.

బాబు అవినీతివల్లే 'గుండ్లకమ్మ'కు నష్టం

- 2014–19 మధ్య అనేకసార్లు దానిని తనిఖీచేసిన నిపుణుల కమిటీ
- కొత్త గడ్డర్లు ఏర్పాటుచేయాలని.. గేట్లకు మరమ్మతు చేయాలంటూ నివేదిక
- అవి చేయకుండా రూ.5.15 కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన బాబు
- రెండు సందర్భాల్లోనూ స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుచేసి.. రైతుల ప్రయోజనాలు కాపాడాం : అంబటి



సాక్షి, అమరావతి: అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు అవినీతి, అలసత్వంవల్లే గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు దిగువ భాగం కొట్టుకుపోయిందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టంచేశారు. 2014–19 మధ్య నిపుణులతో కూడిన డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ పలుమార్లు గుండ్లకమ్మ ప్రాజెక్టును తనిఖీ చేసిందని.. కొత్తవి ఏర్పాటుచేసి, గేట్లకు మరమ్మతు చేయాలని నివేదిక ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. కానీ, అప్పట్లో ఆ పనులు చేయకుండా.. తూతూమంత్రంగా పనులు చేపట్టి, రూ.5.15 కోట్లను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని ఆరోపించారు. ఆ నిధులను నిపుణుల కమిటీ సూచించిన పనులకు వెచ్చించి ఉంటే ఇప్పుడు గేట్లు కొట్టుకుపోయేవే కావన్నది వాస్తవం కాదా? అంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును అంబటి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

బాబుది నీచ మనస్తత్వం..

మిచాంగ్ తుపానువల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి సీఎం జగన్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే.. చంద్రబాబు బురదజల్లుతూ నీచంగా ప్రవర్తిస్తున్నారు. ఎల్లో మీడియా దిగజారుడు రాతలు రాస్తోంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన సాయం కంటే ఇప్పుడు సీఎం జగన్ ఎక్కువ సాయం చేస్తున్నారు.

పవన్‌ను చంద్రబాబే ఓడిస్తాడు..

మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ జెండాలు పట్టుకుని తిరిగిన చోట కాంగ్రెస్ భూస్థాపితమైంది. మరోవైపు.. పవన్ పార్టీకి కూకట్‌పల్లి మినహా ఒక్కచోట కూడా డిపాజిట్ రాలేదు. వీళ్లు ఇప్పుడు ఇక్కడికొచ్చి డప్పాలు కొట్టుకుంటున్నారు. ఎలక్షన్లలో జనసేనకు చంద్రబాబు ముష్టివేసినట్లు సీట్లు వేస్తాడు.. అక్కడ జనసేనకు అభ్యర్థులు లేకపోతే టీడీపీ వారే తమ అభ్యర్థుల్ని అందులోకి ప్రవేశపెడతారు. ఇక పవన్‌ను చంద్రబాబే తుక్కుతుక్కుగా ఓడిస్తాడు. టీడీపీ, జనసేన క్యాన్సర్ గడ్డ కంటే ప్రమాదకరమైనవి.

గుండ్లకమ్మ రెండో గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు

సాక్షి, అమరావతి: టీడీపీ సర్కార్ అవినీతి, నిర్వహణ లోపంతో తుప్పుపట్టి వరద ఉధృతికి కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు స్థానంలో అధికారులు సీఎం జగన్ ఆదేశాల మేరకు ఆదివారం హుటాహుటిన స్టాప్‌లాగ్ గేటును ఏర్పాటుచేశారు. దీంతో ప్రాజెక్టులో 0.75 టీఎంసీలు కడలిపాలు కాకుండా అడ్డుకట్ట వేశారు. ప్రాజెక్టులో 1.1 టీఎంసీల నిల్వకు మార్గం సుగమం చేశారు.

నీరు నిల్వ ఉన్నా.. వరద కొనసాగుతున్నా..

మిచాంగ్ తుపాను ప్రభావంవల్ల ప్రకాశం జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలతో గుండ్లకమ్మ వరదెత్తింది. ఈ ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరగడంతో అప్పటికే తుప్పుపట్టిన రెండో గేటు 8న కొట్టుకుపోయింది. నిజానికి.. ఇలా కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుచేయాలంటే సాధారణంగా ప్రాజెక్టులో నీటిని ఖాళీచేస్తారు. డెడ్ స్టోరేజీ స్థాయికి నీటినిల్వ చేరాక.. వరద ప్రవాహం తగ్గాక స్టాప్‌లాగ్ గేటును ఏర్పాటుచేస్తారు. కానీ.. ప్రాజెక్టులో నీరునిల్వ ఉన్నా.. వరద కొనసాగుతున్నా.. సీఈ మురళీనాథ్‌రెడ్డి సారథ్యంలో అధికారులు శ్రమించి కొట్టుకుపోయిన రెండో గేటు స్థానంలో ఒక్కో ఎలిమెంట్‌ను దించుతూ స్టాప్‌లాగ్ గేటును విజయవంతంగా ఏర్పాటుచేశారు.

యువ న్యాయవాదులకు అండగా లా నేస్తం

2023-24 సంవత్సరానికి రెండోవిడత సాయం నేడు

- బటన్ నొక్కి వారి ఖాతాల్లో రూ.7,98,95,000 జమచేయనున్న సీఎం వైఎస్ జగన్
- తొలి మూడేళ్లు అండగా ఉంటూ, ఊతమిస్తున్న వైఎస్సార్ లా నేస్తం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జూనియర్ న్యాయవాదులకు అండగా ఉంటున్న రాష్ట్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి సంబంధించి రెండోవిడత వైఎస్సార్ లా నేస్తం నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5,000 స్టైఫండ్ చొప్పున ఈ ఏడాది జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరునెలలకు ఒక్కొక్కరికి రూ.30 వేల వంతున మొత్తం రూ.7,98,95,000ను వారి ఖాతాల్లో జమచేయనున్నారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువ లాయర్లు వృత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్లపాటు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.60 వేల చొప్పున.. మూడేళ్లకు మొత్తం రూ.1.80 లక్షలు ఇస్తోంది. ఏడాదికి రెండుసార్లు నిధులు వారి ఖాతాల్లో జమచేస్తోంది. నేడు ఇస్తున్న సాయంతో కలిపి ఇప్పటివరకు 6,069 మంది యువ న్యాయవాదులకు ఈ నాలుగున్నరేళ్లలో మొత్తం రూ.49.51 కోట్ల ఆర్థికసాయం అందించింది. న్యాయవాదుల సంక్షేమం కోసం అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీలు సభ్యులుగా రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. న్యాయవాదుల అవసరాలకు రుణాలు, గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీలు, ఇతర అవసరాలకోసం ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే రూ.25 కోట్ల ఆర్థికసాయం అందించింది. ఈ ట్రస్ట్ నుంచి ఆర్థికసాయం కోరే అడ్వకేట్స్ ఆన్‌లైన్‌లో sec_law@ap.gov.inలోగానీ, నేరుగా లా సెక్రటరీకిగానీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వైఎస్సార్ లా నేస్తం పథకానికి సంబంధించి ఏ రకమైన ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా 1902 టోల్ ఫ్రీ నంబర్లో సంప్రదించవచ్చు. ఈ పథకాన్ని మరింత సమర్థంగా మానిటర్ చేస్తూ యువ న్యాయవాదులు ఏకకాలంలో పెద్దమొత్తం సొమ్ము అందుకుని వారి అవసరాలు తీర్చుకునే విధంగా ఆరు నెలలకోసారి ప్రభుత్వం వారి ఖాతాల్లో నిధులు జమచేస్తోంది. దరఖాస్తు చేసుకోదలిచినవారు https://ysrlawnestham.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేరు, బ్యాంకు అకౌంట్, ఆధార్ నంబరు, సర్టిఫికెట్లు జతచేయాలి.

రోడ్లకే ప్రాధాన్యత

- రూ.1,120 కోట్లతో 3,448 కి.మీ రోడ్ల పునరుద్ధరణ
- తీర ప్రాంత జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ నిధులతో 2,294 కి.మీ.
- ఇతర జిల్లాల్లో ఆర్ఐడీఎఫ్ నిధులతో 1,154 కి.మీ. రోడ్లు
- ఆర్ అండ్ బి శాఖ ప్రణాళిక



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకుంటూ ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసింది. అందుకోసం 'హై ప్రయారిటీ' రోడ్లుగా 339 రహదారుల పునరుద్ధరణకు ఆమోదం తెలిపింది. మొత్తం రూ.1,120 కోట్లతో 3,448 కిలోమీటర్ల మేర ఈ రోడ్లను పునరుద్ధరించనుంది. అందుకోసం తీరప్రాంత జిల్లాలు, ఇతర జిల్లాల రోడ్ల నిర్మాణానికి వేర్వేరుగా ప్రణాళికను ఖరారు చేసింది. తీరప్రాంత జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ నిధులు రూ.768 కోట్లతో 2,294 కి.మీ.మేర రోడ్లను పునరుద్ధరిస్తుంది. తీరప్రాంతం లేని జిల్లాల్లో ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.352 కోట్లతో 1,154 కి.మీ. మేర పునరుద్ధరిస్తారు. ఈ మేరకు ఆర్ అండ్ బి శాఖ పంపిన ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదించింది. దాంతో పనులు ప్రారంభించేందుకు ఆర్ అండ్ బి శాఖ సన్నాహాలు వేగవంతం చేసింది.

కంటికి రక్ష.. చూపు సురక్ష

- చూపు సమస్యల బాధితులకు వరంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- వైద్యశిబిరాల్లో ఉచిత కంటి స్క్రీనింగ్
- 5.73 లక్షల మందికి అద్దాలు
- 78 వేల మందికి క్యాటరాక్ట్ సర్జరీలు

సాక్షి, అమరావతి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన కంటిచూపు సమస్యల బాధితులకు సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వీరికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇవ్వడంతో పాటు అవసరమైనవారికి క్యాటరాక్ట్ సర్జరీలు చేస్తోంది. గ్రామాల్లో, పట్టణాల్లో కంటి సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రుల వరకు వెళ్లలేని వారికి ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంగా మారింది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ సురక్ష శిబిరాలు నిర్వహించింది. ఈ శిబిరాల్లో 60.27 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. రాష్ట్రంలో ప్రజలందరికీ కంటి సమస్యల నివారణ కోసం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూడు విడతల్లో విద్యార్థులు, వృద్ధులకు పెద్ద ఎత్తున కంటి పరీక్షలు నిర్వహించి వైద్యం చేశారు. మూడు విడతల్లో ఎక్కడైనా మిగిలి పోయిన విద్యార్థులతో పాటు, ఇతర మధ్య వయసు ప్రజలకు మేలు చేకూర్చేలా ఆరోగ్య సురక్షలో కంటివైద్య సేవలను చేర్చారు.

10 లక్షల మందికి కంటి పరీక్షలు

సురక్ష శిబిరాల వద్ద కళ్ల స్క్రీనింగ్ సేవలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. చూపు సమస్యలతో బాధపడుతున్న సుమారు 10 లక్షల మందిని శిబిరాల్లో పరీక్షించారు. 2.80 లక్షల మందికి మందులతో నయమయ్యే సమస్యలున్నట్లు గుర్తించిన వైద్యులు వారికి ఉచితంగా మందులు అందజేశారు. 5,73,140 మందికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి రూ.3.5 కోట్లతో ప్రభుత్వం అద్దాలు పంపిణీ చేస్తోంది. ఇప్పటికే 50 వేల మందికిపైగా వ్యక్తులకు అద్దాలను అందజేశారు. మిగిలిన వారికి చకచకా అందజేసేందుకు వైద్యశాఖ చర్యలు తీసుకుంటోంది. 78,292 మందికి క్యాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు గుర్తించారు. వీరందరికీ ప్రభుత్వం ఉచితంగా సర్జరీలు చేయిస్తోంది. వీరిలో 14 వేలమందికి ఇప్పటికే సర్జరీ చేశారు. అద్దాలు, సర్జరీలు అవసరం ఉన్నవారిని స్థానిక సీహెచ్‌వోలు, ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్లు అనుసంధానించి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.





ఎల్లవేళలా తనను స్తుతించమని కోరుకునే దేవుడిని నేను నమ్మలేను.

- ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 11 డిసెంబర్ 2023

రెండో గొంతు

మనదైనది ఏదో వ్యక్తం చేయడానికి మనదైన భాష ఒకటి ఉండాలనుకుంటాం. కానీ భాష చిత్రమైంది. ఒక్కోసారి అనుకున్న మాట వెంటనే తట్టదు. ఇంకో సందర్భంలో ఆ ఒక్కమాటకు పది మాటలు కనబడి గందరగోళ పరుస్తాయి. రెండు సందర్భాల్లోనూ మనిషి మూగ కావడం గమనార్హం. ఇదంతా భాష సమస్య కాదేమో; మన లోపలి భావానికి అనుగుణంగా భాష మనల్ని ఇలా ఒంటరిగా మాట తోడులేకుండా నిలబెట్టే స్థితిని కల్పిస్తుందేమో! భావం అనేది చాలా సంక్లిష్టమైంది కదా మరి! దాన్ని భాషలోకి తేవాలని అనుకున్నప్పుడు, ఎంతో తెలుసు అనుకున్నది కూడా, ఏ కొసను అందుకోవాలో తెలియక తికమక పరుస్తుంది. ఒక తేనెతుట్టె ఏదో లోపల కదిలినట్టయి గందరగోళం తలెత్తుతుంది. అనుకున్న వ్యక్తీకరణ గాడి తప్పుతుంది. భావాన్ని వ్యక్తపరచడానికి ఏ భాష అయితే కావాలో అదే అవరోధంగా మారడం తమాషా కదా! మరి దానికేమిటి దారి? సంజ్ఞలైతే పనికిరావు. కాబట్టి మళ్లీ భాషే దిక్కు. పోనీ, ఇంకేదో భాష అయితే? అందులో మనకు అంతగా ప్రవేశం లేనిదైతే? ఒక్కోమాటా వాక్యంగా పేర్చుకునేదైతే? నిజంగా అలా రాయడం సాధ్యమా? ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న కొందరు రచయితలు 'తమది కాని' భాషలో సాహిత్యం సృజించారు.

1978లో బేస్‌బాల్ గేమ్ చూస్తున్నప్పుడు, ఆటగాడు బంతిని బలంగా కొట్టిన బ్యాట్ శబ్దం టోక్యో శివార్లలోని 'జింగు' స్టేడియం మొత్తం ప్రతిధ్వనించిన ఒకానొక క్షణాన ఇరవైల్లో ఉన్న హరూకీ మురకామీకి ఉన్నట్టుండి తానూ రాయగలనని అనిపించింది. ఆ క్షణం ఆయనలో ఏదో ఎల్లలు లేని సృజనావేశం తన్నుకొచ్చింది. దాన్ని అలాగే పోనీయకుండా కొన్ని నెలలు శ్రమించి, రాత్రుళ్లు కుస్తీపట్టి జపనీస్ భాషలో మొదటి నవల రాయడానికి ప్రయత్నించాడు. అంతా అయ్యాక చదివితే ఆయనకే నచ్చలేదు. దీనికి కారణం – తన మాతృభాషలో 'పశువుల కొట్టంలో పశువులు క్రిక్కిరిసినట్టుగా' ఆలోచనలు రొద పెట్టడమే! దీనివల్ల ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాడు. 'ఒకరి భావాలను అలవోకగా ఒక క్రమంలో పెట్టడం గురించి మాట్లాడటం సులభమేగానీ, అలా చేయడం అంత సులభం కాదు. బొత్తిగా అప్పుడే రాయడం మొదలుపెట్టిన నా లాంటివాడికి అది మరింత కష్టం. కొత్తగా మళ్లీ ప్రారంభించడానికి, నేను చేయాల్సివచ్చిన మొదటి పని నా రాతప్రతుల కుప్పనూ, ఫౌంటెన్ పెన్నూ వదిలించుకోవడం! అవి నా ముందు ఉన్నంతసేపూ నేనేదో 'సాహిత్యం' లాంటిదాన్ని రాస్తున్నట్టనిపించింది. వాటి స్థానంలోకి నా పాత అలవెటీ టైప్‌రైటర్‌ను అల్మారా లోంచి తెచ్చాను. తర్వాత, ఒక ప్రయోగం లాగా, నా నవల ప్రారంభాన్ని ఇంగ్లీష్‌లో రాయాలని నిర్ణయించుకున్నాను. ఎటూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నప్పుడు ఇలా ఎందుకు చేయకూడదనిపించింది?' అంటూ మురకామీ తాను తన జపనీస్‌ను కాదని ఆంగ్లంలో రాయడానికి పూనుకోవాల్సి వచ్చిన నేపథ్యం చెబుతాడు. అయితే, ఆంగ్లం ఆయనకేమీ మంచినీళ్ల ప్రాయం కాదు. ఈ భాష పరిమితి వల్ల సంక్లిష్ట వాక్యాలు రాయడం కుదరదు. ఆ ఉన్న కొద్దిపాటి పదసంపద, వ్యాకరణాలనే ప్రతిభావంతంగా ఉపయోగించుకోవాలి. 'మై కిచెన్ టేబుల్ ఫిక్షన్' ధోరణిగా వర్ణించే ఆయన రచనలు అలా మొదలయ్యాయి. ఈ ధోరణిలో వచ్చిన 'హియర్ ద విండ్ సింగ్' నవలిక మురకామీని అమాంతం పైకి ఎత్తేసింది.

కృత్యాదిలోనే మురకామీ అవస్థ పడ్డాడు. కానీ ఝుంపా లాహిరిది ఇంకో కథ. లండన్‌లో పుట్టి, అమెరికాలో పెరిగిన భారత(బాంగ్లా) సంతతి ఝుంపా 'ఇంటర్‌ప్రిటర్ ఆఫ్ మాలడీస్' నవలకు 'పులిట్జర్' గెలుచుకుంది. 'నేమ్‌సేక్'తో మరింత పేరొచ్చింది. ఉన్నట్టుండి తన నలభై ఐదేళ్ల వయసులో ఇటాలియన్‌లో రాయాలని నిర్ణయించుకుంది. కొత్త భాషలో రాయడంలో ఒక స్వేచ్ఛ ఉంది అంటారామె. 'పర్ఫెక్టుగా ఉండనక్కరలేని స్వేచ్ఛ'. న్యూయార్క్‌లో కొన్ని ఇటాలియన్ పాఠాలు విన్న అనుభవం ఉంది. కానీ ఆ భాష కోసమే 2015లో ఆమె కుటుంబంతో సహా రోమ్‌కు వెళ్లి, కొన్నేళ్లు ఉండివచ్చింది. తర్వాత మూడు పుస్తకాలు ఇటాలియన్‌లో వెలువరించింది. తర్వాత అవి ఆంగ్లంలోకి వచ్చాయి. సహజంగానే ఇటాలియన్‌లో రాయడమేంటని చాలామంది ఆమెను ప్రశ్నించారు. ఒక్కొక్క పదం, వాక్యం ద్వారా వ్యక్తీకరణను కూడగట్టుకొని కొత్త లోకపు ద్వారంలోకి ప్రవేశించినట్టుగా అనుభూతి చెందానంటుంది. పాత, కొత్త ప్రపంచాల మధ్య అదొక సవాలు కూడా! 'ఇటాలియన్ భాష నా జీవితాన్నేమీ మార్చలేదు; అది నాకు రెండో జీవితాన్ని ఇచ్చింది; మరో అదనపు జీవితం'.

తన అసంబద్ధ రచన 'వెయిటింగ్ ఫర్ గోడో' ద్వారా ఖ్యాతినొందిన శామ్యూల్ బెకెట్ పుట్టుకతో ఐరిష్‌వాడు అయినప్పటికీ ఫ్రెంచ్‌ను తన రచనాభాషగా ఎంచుకున్నాడు. దానికి ఆయన చెప్పిన కారణాలు సాధారణంగా రచయితలు కోరుకునే లక్షణాలకు పూర్తి విరుద్ధమైనవి. తన మాతృభాషకు దూరం కావడం అనేది, ఒక ముసుగును చించుకోవడంతో సమానంగా చూశాడు. ఫ్రెంచ్‌లో (పరాయి భాష) మాత్రమే ఒక శైలి లేకుండా రాయడం సాధ్యమవుతుందన్నాడు. అలాగైతేనే తనకు తగిన వనరులు లేకుండా పోతాయన్నాడు. అందువల్లేనేమో, ఆయన ప్రసిద్ధ 'మినిమలిస్ట్' రచయిత కాగలిగాడు.

వేర్వేరు కారణాల వల్ల తమ మాతృభాషలకు దూరమైన రచయితలు ఎందరో ఉన్నారు. పరిస్థితులు వారికి అలాంటి పరీక్ష పెట్టాయి. ఆ వేదన ఇక్కడ అప్రస్తుతం. కానీ భాష అనేదాన్ని ఒక అవరోధంగా పెట్టుకుని రాయాలనుకోవడం దానికదే ఒక సవాలు. ప్రాణవాయువును మరీ ఎక్కువగా పీల్చకుండా పొదుపుగా వాడుకుంటూ బతికే యోగసాధన లాంటిది అది.

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.చతుర్దశి తె.5.49 వరకు (తెల్లవారితే మంగళ వారం), తదుపరి అమావాస్య, నక్షత్రం: విశాఖ ఉ.11.38 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: ప.3.43 నుండి 5.19 వరకు, దుర్ముహూర్తం: ప.12.16 నుండి 1.04 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.17 వరకు, అమృతఘడియలు: రా.1.24 నుండి 3.04 వరకు; సూర్యోదయం : 6.24, సూర్యాస్తమయం : 5.23, రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

భారత్‌పై అభియోగాల పత్రం

కామెంట్



కరణ్ థాపర్

విలియం షేక్స్‌పియర్ నాటకం 'ద మర్చెంట్ ఆఫ్ వెనిస్'లో షైలాక్ కనికరం లేని వడ్డీ వ్యాపారి. స్నేహితుడి కోసం 'నాదీ పూచీ' అంటూ డబ్బు తీసుకుని చివరికి తీర్చలేకపోతాడు ఆంటోనియో. పరిహారంగా ఒక పౌండు ఆంటోనియో మాంసాన్ని అడుగుతాడు షైలాక్. భారత్‌పై యూఎస్ తాజా అభియోగ పత్రంలోని నేరారోపణలు కొంతవరకు ఆంటోనియోను గుర్తు చేసే విధంగా ఉన్నాయి. అమెరికన్ పౌరుడు గురుపత్‌వంత్ సింగ్ పన్నూపై కొద్దిరోజుల క్రితం జరిగిన హత్యాయత్నం వెనుక భారత ప్రభుత్వ హస్తం ఉందన్నది అమెరికా ఆరోపణ. సంబంధాలు ఇరు దేశాలకూ ముఖ్యమే కనుక యూఎస్ ఈ విషయంలో మౌనంగా ఉండి, షైలాక్‌లాగా భారత్ నుంచి పరిహారంగా 'ఒక పౌండు మాంసాన్ని' కోరుతుందా?

చేర్పులు, జోడింపులతో మరింతగా బలపరిచి అమెరికా ప్రభుత్వం తాజాగా బహిర్గత పరచిన పూర్వపు అభియోగ పత్రాన్ని ఒక కల్పిత కథనంగా మీరు విశ్వసిస్తే తప్ప, అందులోని వెల్లడింపుల పట్ల ఆందోళన చెందవలసిన అవసరం లేదు. కానీ, విచారణకు వెళ్లనున్న కేసు అది. తేలిగ్గా కొట్టిపడేసి పక్కకు తోసేయవలసినది కాదు. కాబట్టి, సహాయకారిగా ఉంటుందనుకుంటే కనుక మనం దృష్టి సారించవలసిన అంశాలను కొన్ని ప్రశ్నలను లేవనెత్తడం ద్వారా ఒక జాబితాగా పొందుపరుస్తాను.

మొదటిది – అమెరికా గడ్డ మీద ఒక అమెరికన్ పౌరుడిని (నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' సంస్థ నేత గురుపత్‌వంత్ సింగ్ పన్నూ) హత్య చేయించేందుకు సిసి–1 అనే సంకేత నామధారి పథక రచన చేయడం! యు.ఎస్. తిరగ రాసిన అభియోగ పత్రంలోని ఆరోపణలను బట్టి– 'భద్రతా నిర్వహణ', 'ఇంటెలిజెన్స్' విభాగాలలో బాధ్యతలు నిర్వర్తిస్తూ తనను తాను 'సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్'నని చెప్పుకుంటున్న ఆ సంకేత నామధారి భారత ప్రభుత్వ సంస్థలో గుర్తింపు పొందిన ఉద్యోగిగా ఉన్నాడు. గతంలో అతడు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లో కూడా పని చేశాడు. మరీ ముఖ్యంగా ఈ సిసి–1 అనే వ్యక్తి ఆ అభియోగ పత్రంలో పేర్కొన్న అన్ని సమయాలలోనూ భారత ప్రభుత్వం నియమించిన విధుల నిర్వహణలో ఉన్నాడు. ఇండియాలోనే ఉన్నాడు. ఇండియా నుంచే హత్యకు కుట్ర పన్నాడు. ఇదేం సూచిస్తోంది? సిసి–1 వెనుక భారత ప్రభుత్వం ఉందనా? లేక సిసి–1 అనే అతడు ఒక మోసగాడు అయి ఉండవచ్చుననా?

రెండవది – ప్రస్తుత పరిస్థితుల్లో ఆ మోసగాడు ఎలా ఉండి ఉంటాడు? ఒంటరి తోడేలు మాదిరిగానా? లేక, దేశ అత్యుత్తమ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఒక చిన్న సమూహంలో భాగంగానా? లేదా అన్ని అధికారిక అనుమతులతో వ్యూహాత్మక టక్కరిగా నటిస్తున్న అత్యున్నతస్థాయి ప్రభుత్వ అధికారి అయివుంటాడా?

మూడవది – ఆ సిసి–1 ఎవరైనా గానీ అసమర్థంగా ఈ పనిని నిర్వహించాడా? 'నిఖిల్ గుప్తా అనే ఒకానొక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల రవాణా వ్యాపారిని సిసి–1 పనిలోకి దింపాడు.' తనకు తెలియకుండానే అలా చేశాడా? తెలియకపోతే తెలుసుకోవలసిన పని లేదా? ఒకవేళ ఉద్దేశపూర్వకంగానే నిఖిల్ గుప్తాను ఎంచుకుని ఉంటే అది తెలివైన ఎంపికేనా?

నాల్గవది – ఇక నిఖిల్ గుప్తా ఏం చేశాడంటే 'డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్' (డి.ఇ.ఎ.)కు రహస్య సమాచారం అందించే వ్యక్తిగా మారిన ఒక భాగస్వామ్య నేరస్థుడిని సంప్రదించాడు. ఆ వ్యక్తి కిరాయి హంతకుడిగా నటిస్తున్న ఒక రహస్య ప్రభుత్వ అధికారి (అండర్ కవర్ ఏజెంట్) దగ్గరికి గుప్తాను తీసుకెళ్లాడు. దీన్నిబట్టి డి.ఇ.ఎ. గుప్తాను నీడలా వెంటాడుతోందనీ, కాబట్టి గుప్తా గురించి మన వరకు రాని అనేక విషయాలు డి.ఇ.ఎ.కు తెలిసి ఉంటాయనీ అనుకోవచ్చా? మరీ ముఖ్యంగా, ఇదొక దారుణమైన గందరగోళంగా అనిపించడం లేదా? బహుశా దీనికంటే 'డాడ్స్ ఆర్మీ' (హోంగార్డులు) నయం కదా?

ఐదవది – కెనడాలో జూన్ 18న హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య జరిగిన కొన్ని గంటల తర్వాత, 'రక్తంతో తడిసిన నిజ్జర్ మృతదేహం ఆయన వాహనంపై పడివున్నట్లు చూపించే వీడియో క్లిప్పును గుప్తాకు సిసి–1 పంపించాడు.' ఈ ఆరోపణ... సిసి–1కి నిజ్జర్ హత్యతో నేరుగా సంబంధం ఉందని చెప్పడానికి యు.ఎస్. అధికారులు సాక్ష్యాధారాలను సృష్టించడాన్ని సూచిస్తోందా? అదే నిజమైతే భారత్‌పై జస్టిన్ ట్రూడో ఆరోపణలకు ఆ సాక్ష్యాధారాలే బలం చేకూరుస్తున్నాయా?



భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



భారత సంతతి ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ

కలవరపరిచే సమాచార వ్యవస్థ

ఆరవది – 'హత్య తర్వాత కొన్ని వారాల పాటు గుప్తా... భాగస్వామ్య నేరస్థునితో, ఆ తర్వాత కిరాయి హంతకుడితో – ఫోన్, వీడియో, టెక్స్ట్ మెసేజెస్ వంటి వాటి ద్వారా వరుసగా ఎలక్ట్రానిక్, రికార్డెడ్ సంభాషణలను జరిపాడు' అని యు.ఎస్. అభియోగ పత్రం చెబుతోంది. ఆ సంభాషణలు సంకేత నిక్షిప్త సందేశాల రూపంలో ఉన్నప్పటికీ వాటిని అడ్డగించి ఉంటారు. అంటే యు.ఎస్. అధికారుల వద్ద ఇప్పటికీ బయట పెట్టని సమాచారం గుట్టలు గుట్టలుగా మిగిలి ఉందనేనా? అది కూడా మన సమాచార వ్యవస్థ తాలూకు పటిష్ఠత, భద్రతల గురించి కలవరపరిచే ప్రశ్నలను రేకెత్తిస్తోంది.

ఏడవది – కనీసం నాలుగు వేర్వేరు చోట్ల హత్యకు వ్యూహం పన్నినట్లు యు.ఎస్. అభియోగ పత్రం చెబుతోంది. వాటిల్లో ఒకటి న్యూయార్క్‌లో... బహుశా గురుపత్‌వంత్ సింగ్ పన్నూని హత్య చేయడం కోసం... మరొకటి క్యాలిఫోర్నియాలో, మరో రెండు కెనడాలో! నిజానికి ఒక దశలో గుప్తా... ''మేము ప్రతి నెలా 2–3 జాబ్ వర్క్‌లు ఇస్తాం'' అని అన్నట్లు యు.ఎస్. ఆరోపణలలో ఉంది. ఇదెలా వినిపిస్తోంది? ఒకే ఒకసారి హత్యలన్నిటికీ లేదా వరుస హత్యల ప్రారంభానికి పథక రచన జరిగిందనే అర్థం ధ్వనించడం లేదా?

చివరిగా – యు.ఎస్. ప్రభుత్వ స్పందన. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్ ఆగస్టు నెలలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఎదుట అమెరికా స్పందనను ప్రస్తావనకు తెచ్చారు. ఒక వారం తర్వాత సి.ఐ.ఎ. అధినేత విలియమ్ బర్న్స్ భారత్‌లోని ఆర్.అండ్ ఎ.డబ్ల్యు.(రా) అధినేతతో మాట్లాడేందుకు ఢిల్లీ వచ్చారు. తర్వాత అధ్యక్షుడు జో బైడెన్ సెప్టెంబరులో జి–20 సదస్సులో ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆ నెలాఖరున వాషింగ్టన్‌లో మళ్లీ సల్లివాన్, యు.ఎస్. విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్... విషయాన్ని జైశంకర్ దృష్టికి తెచ్చారు. చివరిగా అక్టోబర్‌లో నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ అవ్రిల్ హెయిన్స్ మరిన్ని అభియోగ వివరాలతో భారతదేశానికి వచ్చారు. దీనర్థం... వైట్ హౌస్ ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తోందనే కదా! వాస్తవానికి దోవల్‌తో సల్లివాన్ ''ఇలాంటిది మరోసారి జరగదన్న హామీని అమెరికా ప్రభుత్వం కోరుతోంది'' అని అన్నట్లు వాషింగ్టన్ పోస్ట్ నివేదించింది. కఠినమైన భాష కాదా ఇది?

యు.ఎస్. అభియోగ పత్రం మొత్తం అంతా కల్పితం అని విశ్వసించినప్పుడు మాత్రమే మనం ఈ ప్రశ్నలన్నిటినీ విస్మరించగలం. కానీ మీరు ఈ ప్రశ్నలను పూర్తి పరిగణనలోకి తీసుకుంటే కనుక మరొక ప్రశ్న కూడా తలెత్తుతుంది. ఒకవేళ, చివరికి వాషింగ్టన్ ఈ వ్యవహారాన్నంతా చూసీ చూడనట్లు ఉండిపోయేందుకు నిర్ణయించుకుంటే – భాగస్వామ్య వ్యూహాత్మక ప్రయోజనాలు ముఖ్యం కాబట్టి – భారత్ నుంచి ఒక 'మాంస ఖండాన్ని'(పౌండ్ ఆఫ్ ఫ్లెష్) ప్రతిఫలంగా కోరుతోందా?

అమెరికన్ షైలాక్ దయతో నేనొక భారతీయ ఆంటోనియోగా ఉండటాన్ని ద్వేషిస్తాను. లేదా మనల్ని కాపాడేందుకు పోర్షియా వంటి కారుణ్యమూర్తి ఎవరైనా రెక్కలు కట్టుకుని ముందుకొస్తుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వివేకం



నా జీవితంలో నేను ఎలాంటి దశకు వచ్చానంటే, అనవసర వాదనలకు దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాను. ఆఖరికి మీరు రెండు, రెండు కలిపితే ఆరు అవుతుంది అన్నా కూడా, 'బహుశా మీరే కరెక్టు' అంటాను.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

హింసానంతర శాంతి?



కొందరు పండితుల అభిప్రాయానికి ఇది విరుద్ధమే గానీ, ఒక తీవ్రవాద గ్రూపును సమూలంగా నాశనం చేయడం శాంతికి దారితీస్తుంది. మొన్నటికి మొన్న 2009లోనే శ్రీలంక సైన్యం ఎల్టీటీఈని నిర్వీర్యం చేసింది. విషాదకరంగా, ఈ సైనిక చర్య వల్ల చాలామంది పౌరులు మరణించారు. కానీ చివరకు శ్రీలంకలో (తమిళులు, సింహళులు ఇరువురికీ) మెరుగైన పరిస్థితులు ఏర్పడ్డాయి. గాజాలో కూడా అదే జరగనుందా?

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

ఏం మాట్లాడాలి?



నాకు వయసు పెరుగుతున్నకొద్దీ బంధువులతో సంభాషించడానికి నా దగ్గర ఏ విషయాలూ లేవని అనిపిస్తోంది.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

దైవమే రక్ష



ఈ రోజు దీన్ని గుర్తుచేసుకోండి: 'దైవ ప్రేమ, శక్తులు నన్ను కాపాడుతున్నాయి. దైవశక్తి నా చుట్టూ, నా కుటుంబం చుట్టూ వలయంలా ఉంది. నేను ప్రేమించేవాళ్లు సురక్షితం. ఈ గ్రహం మీది ప్రతి జీవినీ దైవశక్తి చేరుతోంది. ప్రతి ఒక్కరూ సురక్షితంగా, భయం లేకుండా, శక్తిమంతులుగా ఉన్నారు.'

– బి.కె. శివాని, బ్రహ్మకుమారి

వారెవ్వా!



గుజరాత్‌లో ఐదుగురు ఒక నకిలీ టోల్ గేటు పెట్టారు. 50 శాతం తక్కువ టోల్ ఆఫర్ పేరుతో జాతీయ హైవే నుంచి ట్రాఫిక్‌ను పక్కకు మళ్లించారు. ఎవరి కంటాబడకుండా ఏడాదిన్నర పాటు ఈ వ్యవహారం సాగింది. 75 కోట్లు సంపాదించారు. దీన్నే 'ఎంటైర్ టోలిటికల్ సైన్స్' అంటారు.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

బలహీనత



ప్రపంచంలోని చాలా సమస్యలు ఓటర్లు చేసే సాధారణ తప్పిదం వల్ల వస్తాయి: చాలా పెద్ద మాటలు మాట్లాడేవాళ్లను 'బలమైన మనుషులు' అని వారు అనుకుంటారు. కానీ వాస్తవానికి అది వ్యతిరేకం. వాళ్ల బలహీనతలు, అభద్రతలను కప్పిపుచ్చుకోవడానికి వాళ్లు డంబాలు కొడుతుంటారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

వారే సమర్థకులు



కొంచెం వ్యవస్థీకృతమైన స్టార్టప్స్‌తో నేను మాట్లాడుతున్నప్పుడు – వారి వృద్ధిరేటు ఎంత, లాభాల్లోనే ఉన్నారా అని అడిగిన తర్వాత, నేను తెలుసుకోవాలనుకునే మొదటి విషయం–వ్యవస్థాపకులకు ఇప్పటికీ బోర్డు మీద నియంత్రణ ఉన్నదా అని! ఒకవేళ జవాబు అవును అయితే, ఆ కంపెనీ గురించి నేను మరింత ఆశావాదంతో ఉంటాను.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

ఇన్ బాక్స్

పర్వత పర్యావరణ పునరుద్ధరణ

'రెస్టోరింగ్ మౌంటెయిన్ ఎకో సిస్టం' నినాదంతో ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 'ప్రపంచ పర్వత దినోత్సవం' జరుపుకొంటున్నారు. పర్వత పర్యావరణాన్ని పునరుద్ధరించే దిశలో వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద, పర్వతారోహణ సంస్థలు ప్రజలకు... ముఖ్యంగా భావి పౌరులైన యువతకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మంచుతో కూడుకున్న పర్వతాలు అనేకం ఉన్నాయి. ఈ పర్వతాల మీద ప్రపంచ జనాభాలో 15 శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. చాలా పర్వతాలపై వాతావరణ మార్పు ప్రభావం తీవ్రంగా ఉంది. మంచుతో కూడిన పర్వతాలు అత్యంత ఆకర్షణీయ సాహస పర్యాటక ప్రాంతాలుగా పర్యాటకంపై ఆధారపడిన వారికి ఆదాయ మార్గం అయ్యాయి. ముఖ్యంగా నేపాల్, యూరప్‌లోని కొన్ని దేశాలు, ఆఫ్రికాలోని కొన్ని దేశాలు పూర్తిగా ఈ పర్వతాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి.

మన భారత దేశంలో హిమాలయ శ్రేణులు ఉత్తరాన పెట్టని గోడగా ఉండటమే కాక, దేశంలోని ఆ ప్రాంతం జీవనదులతో సస్యశ్యామలం కావడానికి కారణమవుతున్నాయి. ప్రాచీన కాలం నుంచి మన నాగరికతా సంస్కృతులకు ఈ నదీ లోయలూ, మైదానాలే కేంద్రాలుగా ఉన్న విషయం గమనార్హం.

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో స్థాపితమైన ఎడ్వంచర్ క్లబ్‌లు పర్వతారోహణ వంటి సాహస కృత్యాలను ప్రోత్సహిస్తూనే పర్వతారోహకులకు వాస్తవ పరిస్థితులను తెలియచేస్తున్నాయి. ఇందువల్ల పర్వతావరణం కలుషితం కాకుండా పర్వతారోహకులు మసలుకునే అవకాశం ఉంది. ఫలితంగా వివిధ ప్లాస్టిక్, ఇతర హానికారక వ్యర్థాల నుండి పర్వతాలూ, కొండలూ రక్షించబడతాయి.

– కె. రంగారావు, ఏసీఏపీ–ఏసీటీఎస్ వ్యవస్థాపకులు

(నేడు అంతర్జాతీయ పర్వత దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సమానత్వానికి ప్రతీక చాపకూడు

భారతదేశ చరిత్రలో మొట్టమొదటి 'సమతా సమానతా వాదం' పల్నాటి వీరుల మస్తిష్కంలో మనకు గోచరిస్తుంది. అప్పటి వరకు ఉన్న కుల నిచ్చెన మెట్లను ధ్వంసం చేసి సమతాస్మృతి నిర్మాణం జరిగేట్లు పల్నాటి వీరులు కృషిచేశారు. కాబట్టే వెయ్యేండ్ల క్రితం ఆ వీరులు నేలకొరిగిన 'కార్యమపూడి' (కారెంపూడి) రణక్షేత్రంలో నేటికీ వారిని స్మరించుకుంటూ, వారి ఆయుధాలను పూజించుకుంటూ, సమతావాదం కోసం పల్నాటి ఆచారవంతులు కృషి చేస్తున్నారు. భారత దేశ చరిత్రలో అంటరానితనం నిర్మూలనకు వెయ్యేండ్ల క్రితమే పల్నాడులో బ్రహ్మనాయుడు కృషి చేశాడు. దళితులకు ఆలయ ప్రవేశం గావించాడు. 'చాపకూడు సిద్ధాంతా'న్ని అమలు చేశాడు. రాజ్యాధికారంలో అన్ని కులాల వారికీ... అంటే శూద్రులకూ, రేచర్ల మాలలకూ సమ ప్రాధాన్యం ఇచ్చాడు. మొదటగా రేచర్ల మాలలకు రాజ్య సర్వసైన్యాధ్యక్ష పదవిని ఇచ్చింది పల్నాటి రాజ్యమే!

పల్నాడు ప్రాంతంలో 1182వ సంవత్సరంలో జరిగిన యుద్ధం 'పల్నాటి యుద్ధం'గా చరిత్రలో నిలిచింది. మహాభారతానికీ, పల్నాటి వీర చరిత్రకూ దగ్గరి పోలికలు ఉండటం చేత పల్నాటి చరిత్రను 'ఆంధ్ర భారతం' అని కూడా అంటారు.

పల్నాటి చరిత్రలో నలగామరాజు, నరసింగ రాజు, మలిదేవరాజులు ముగ్గురూ వేర్వేరు తల్లుల బిడ్డలు. వీరి తండ్రి అనుగురాజు. వీరి మధ్య కోడిపందాల మూలంగానూ, రాజకీయ కుట్ర మూలంగానూ ద్వేషాలు రగిలి యుద్ధానికి దారితీసింది. ఈ యుద్ధం కూడా రాజ్యభాగం కోసమే జరిగింది. బాలచంద్రుని మరణానికీ మహాభారతంలో అభిమన్యుని మరణానికీ మధ్య సారూప్యం ఉంది.

పల్నాటి యుద్ధంలో వాడిన ఆయుధాలను ప్రతి సంవత్సరం కార్తీకమాసం చివరి అమావాస్య రోజున నాగులేటిలో స్నానమాచరింప చేసి వీరారాధన ఉత్సవాలను ప్రారంభించటం ఆనవాయితీ. మార్గశిర మాసంలోని మొదటి రోజు నుంచి పంచమిరోజు వరకు 5 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మనాయుని ఆజ్ఞను పాటిస్తూ... పల్నాటి 'వీరాచార పీఠం' ఈ వేడుకలు నిర్వహిస్తూ వస్తోంది. మొదటి రోజు 'రాచగావు', రెండవ రోజు 'రాయబారం' మూడవ రోజు 'మందపోటు' (చాపకూడు), నాల్గవ రోజు 'కోడి పోరు', ఐదవ రోజు 'కల్లిపాడు' కార్యక్రమాలతో వీరారాధన ఉత్సవాలుగా జరుపుతూ ఉన్నారు. ఈ ఉత్సవాల్లో 'వీరవిద్యావంతులు' ఆలపించే కథలు భావి తరాలకు ముందస్తు హెచ్చరికలు! తగిన జాగ్రత్తలు! మనో వికాస విజ్ఞానిక విపంచులు!



పల్నాటి వీరారాధన ఉత్సవాలు

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పల్నాటి ఆచారవంతులంతా కారెంపూడిలో జరిగే ఈ వేడుకలకు కుటుంబ సమేతంగా వేలాదిగా హాజరవుతూ ఉంటారు. సమతా ధర్మం పాటించే వారికి ఇష్టమైన ప్రీతికరమైన దేవుడు చెన్న కేశవుడు. బ్రహ్మ నాయుడు వాడిన 'నృసింహకుంతం' రూపంలో చెన్న కేశవుని భక్తులు పూజిస్తారు.

చాలా ఊళ్లలో ఈ రూపంలో పూజలందుకుంటున్న ఈ దైవాలు (నృసింహ కుంతాలు) ప్రతి కార్తీక చివరి అమావాస్య రోజున కార్యమపూడిలోని నాగులేటి ఒడ్డున స్నాన మాచరించి భక్తులకు దర్శనమిస్తాయి. ఈ 5 రోజుల పల్నాటి వీరారాధన ఉత్సవాలలో ముచ్చటగా మూడవరోజు జరిపే 'చాపకూడు' ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో అధికారికంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. సమతా భావం మరింతగా వెల్లివిరియడానికి ఇది అవసరం.

– ధర్మాశి చిరంజీవి | 70950 91228

(రేపటి నుంచి 16వ తేదీ వరకు కారెంపూడిలో 'పల్నాటి వీరారాధన' ఉత్సవాలు)

శాంతి – అశాంతి

ఒక ఊళ్ళో ఆగర్భ శ్రీమంతుడున్నాడు. ఒకరోజు అతనికి అర్ధరాత్రి అయినా నిద్ర పట్టక డాబా మీదకు వెళ్లి, ఆకాశంలో నక్షత్రాలనూ, చందమామనూ చూస్తుండగా, అతని దృష్టి తన ఇంటి పక్కన ఉన్న పూరిపాక మీద పడింది. అందులో ఉండే కూలి పని చేసుకునే వ్యక్తి, పాక బయట నేల మీద చింకి చాప మీద గురక పెట్టి నిద్ర పోతూ ఉండటం ధనవంతుడు చూశాడు. 'కటిక నేల మీద అంత హాయిగా ఎలా నిద్ర పోతున్నాడు? రేపటి గురించి అతనికి ఆలోచన లేదా?' అనుకున్నాడు.

మర్నాడు ధనవంతుడు తన గురువు దగ్గరకు వెళ్లి, తన నిద్ర పట్టని సమస్య, పేదవాని నిశ్చింత నిద్రలను గురించి చెప్పి, 'అతను అంత బాగా ఎలా నిద్ర పోయాడు?' అనడిగాడు. అప్పుడు గురువు, ధనవంతునితో 'నువ్వు అతనికి ఇవాళ ఒక బస్తా బియ్యం, వంట సామాను, ఓ వెయ్యి రూపాయలు ఇవ్వు. ఈ రాత్రి ఏమవుతుందో చూడు' అన్నారు. ధనవంతుడు ఆ పేదవానికి అలాగే ఇచ్చాడు. ఆ రాత్రి మళ్లీ ధనికుడు నిద్ర పట్టక డాబా మీదకు వెళ్లాడు. పాక వైపు చూశాడు. పేద వ్యక్తి కూడా నిద్ర పట్టక అటూ ఇటూ పొర్లుతూ ఉండటం చూశాడు. మర్నాడు పేదవానిని పిలిచి ధనికుడు 'నిన్న రాత్రి నీకు నిద్ర బాగా పట్టిందా?' అనడిగాడు. అతను 'లేదు' అన్నాడు. 'ఎందుకని' అడిగాడు ధనికుడు. అప్పుడా పేద వ్యక్తి 'నా గుడిసె తలుపుకి లోపల గడియ లేదు. మీరిచ్చిన డబ్బు, సామాను ఎవరైనా ఎత్తుకుపోతారేమోనన్న భయంతో నిద్ర పట్టలేదు' అన్నాడు.



జ్యోతిర్మయం

నాది అనుకునే భౌతిక సంపద ఎక్కువయ్యే కొద్దీ మనిషి దాన్ని కాపాడుకోవాలనే తపనతో శాంతికి దూరమవుతాడని ధనికుడు గ్రహించాడు. గురువు సందేశం అతనికి బాగా అర్థమయింది.

'ఈశావాస్యోపనిషత్తు' చెప్పేది ఇదే. ఈ లోకంలోని ఐశ్వర్యాలు, అవి అందించే సుఖ భోగాలు మార్పులకు లోనయ్యేవి. అశాశ్వతాలు. శాశ్వతానందాన్ని ఇచ్చేది, అశాంతి నుంచి ముక్తిని కలిగించి శాంతి నిచ్చేది భగవంతుని చింతన మాత్రమే!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

12 నుంచి శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 12 నుంచి జనవరి 5 వరకు అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో ఈ అధ్యయనోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా స్వామి వారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీవైష్ణవులు పారాయణం చేస్తారు.

గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫోకస్

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో స్థానిక సమస్యలను పరిష్కరించడానికి గాను ఆయా ప్రాంతాల్లోని గ్రామ సిబ్బందికి పాలనా అంశాలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, ఏలూరు జిల్లాల పరిధిలోని 761 గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసే 7,425 మంది సచివాలయాల సిబ్బందికి ఏపీఎస్ఐఆర్డీ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఒక్కో మండలంలో 3 సచివాలయాల పరిధిలో ఒక్కో విడత చొప్పున 372 బ్యాచ్‌లుగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కార్యాచరణ సిద్ధం చేసుకొని..ఇప్పటికే శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల్లో ఇప్పటికే ఈ శిక్షణ పూర్తి చేశారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల సిబ్బందికి సోమవారం నుంచి 16వ తేదీ వరకు విడతల వారీగా ఆయా మండలాల స్థాయిలోనే ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

ఐజేఎస్ఓ-2023లో నారాయణ విద్యార్థుల విజయం

సాక్షి, హైదరాబాద్: పదహారేళ్లలోపు విద్యార్థుల్లో సైన్స్‌రంగంలో ప్రతిభావంతుల్ని గుర్తించడంలో భాగంగా థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ వేదికగా నిర్వహించిన 20వ అంతర్జాతీయ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ (ఐజేఎస్ఓ)-2023లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. నారాయణ విద్యాసంస్థలకు చెందిన కనిష్క్ జైన్, సోహమ్ పెడ్నేకర్‌లు అద్భుతమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఈ బంగారు పతకాలు సాధించారు. అంధేరిలోని మరోల్‌లోని నారాయణ ఇ-టెక్నో స్కూల్‌లో చదువుతున్న కనిష్క్ జైన్ సైద్ధాంతిక డొమైన్‌లో అసాధారణ ప్రదర్శనతోపాటు థీయరీలోనూ మంచి ప్రతిభను ప్రదర్శించగా...ముంబైకి చెందిన సోహమ్ పెడ్నేకర్ క్లాస్‌రూమ్‌లో జరిగిన ఐజేఎస్ఓ కార్యక్రమంలో పాల్గొని అద్భుతమైన ప్రతిభను చాటి పతకాలను గెలుచుకున్నారు. ఈ మేరకు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పి.సింధూర, పి.శరణి నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

చింతపల్లిలో 11, అరకులో 12.3 డిగ్రీలు



పాడేరులో ఉదయం 9 గంటలకు కురుస్తున్న పొగమంచు

అల్లూరి జిల్లాలో గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో మంచుతెరలు వీడటం లేదు. ఘాట్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా లైట్ల వెలుగులో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉష్ణోగ్రతలూ రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం 15.5 డిగ్రీలు నమోదు కాగా ఆదివారం 4.5 డిగ్రీలు తగ్గి 11 డిగ్రీలు నమోదైంది. అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 12.3 డిగ్రీలు, పాడేరు మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కాఫీబోర్డు వర్గాలు తెలిపాయి. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం నుంచి చలి గాలులు విజృంభిస్తున్నాయి.

మంచు అందాలకు ఫిదా...

జిల్లా వ్యాప్తంగా చలిగాలుల తీవ్రత ఉన్నప్పటికీ మంచు అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి అందాలను వీక్షిస్తూ పరవశిస్తున్నారు. మారేడుమిల్లి ప్రాంతంలోని గుడిసె, చింతపల్లి మండలంలోని లంబసింగిలోని చెరువులవెనం, పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, హుకుంపేట మండలంలోని సీతమ్మకొండ, అరకులోయ మండలంలోని మాడగడ హిల్స్ ప్రాంతాలకు వేకువజామునే చేరుకుని పొగమంచు, సూర్యోదయం, మేఘాల అందాలను వీక్షిస్తున్నారు.



మాడగడ హిల్స్‌లో పర్యాటకులు

విమానయానంలో విప్లవం

- 2014 ముందు, తర్వాత గమనిస్తే గణనీయ పురోగతి
- మధురపూడి ఎయిర్‌పోర్టులో అంతర్జాతీయస్థాయి వసతులు
- కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా
- రూ.347 కోట్లతో టెర్మినల్ బిల్డింగ్‌కు శంకుస్థాపన



టెర్మినల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి సింధియా, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు రాజా, వెంకట్రావు, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, రాజమహేంద్రవరం/మధురపూడి: గత తొమ్మిదిన్నరేళ్లలో విమానయాన గణనీయమైన అభివృద్ధి సాధించిందని కేంద్ర పౌర విమానయాన, ఉక్కుశాఖల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ.347 కోట్లతో నిర్మిస్తున్న డొమెస్టిక్ టెర్మినల్ భవనానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 65 ఏళ్ల భారతదేశ చరిత్రలో 2014 నాటికి దేశంలో 74 ఎయిర్‌పోర్టులు మాత్రమే ఉన్నాయని, ఈ తొమ్మిదిన్నరేళ్లలో 75 ఎయిర్‌పోర్టులు నిర్మించామని చెప్పారు. దీంతో దేశంలో ఎయిర్‌పోర్టుల సంఖ్య 149కి చేరిందన్నారు. వీటి సంఖ్యను 220కి పెంచుతామని తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న కొత్త టెర్మినల్ పాయింట్ 21,094 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంటుందని, రద్దీవేళల్లో 2,100 మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో పాటు భవిష్యత్‌లో ఏటా 30 లక్షలమంది ప్రయాణికుల వార్షిక సామర్థ్యం ఉంటుందని వివరించారు. 28 చెక్ ఇన్ కౌంటర్లు, నాలుగు అరైవల్ కరైజల్స్, 600 కార్లకు పార్కింగ్, ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో టెర్మినల్ రూపు దిద్దుకోనుందని చెప్పారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. గతంలో రాజమహేంద్రవరం నుంచి శంషాబాద్‌కు మాత్రమే విమానాల కనెక్టివిటీ ఉండేదని, ప్రస్తుతం మూడు ప్రధాన నగరాలకు ఉందని తెలిపారు. తిరుపతి నుంచి గతంలో ఒక నగరానికి మాత్రమే కనెక్టివిటీ ఉండగా.. ఇప్పుడది 10 ప్రాంతాలకు విస్తరించిందని చెప్పారు. విజయవాడకు రెండు నగరాలతో కనెక్టివిటీ ఉంటే ప్రస్తుతం ఎనిమిదికి పెరిగిందని, షార్జా కూడా వెళ్లగలుగుతున్నారని తెలిపారు. విశాఖ ఎయిర్‌పోర్టుకు తొమ్మిది ప్రాంతాలతో ఉన్న కనెక్టివిటీ ఇప్పుడు 14 నగరాలకు పెరిగిందన్నారు. సింగపూర్‌కు సైతం విమానాలు వెళ్లేలా వసతులు కల్పించామని చెప్పారు. అలాగే కడప, కర్నూలు ఎయిర్‌పోర్టుల ద్వారా వివిధ ప్రాంతాలకు విమానాలు వెళ్లేలా తీర్చిదిద్దామన్నారు. భోగాపురం, ముంబై, ఢిల్లీ ఎయిర్‌పోర్టులను గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఆరు ఎయిర్‌పోర్టుల ద్వారా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇటీవల భోగాపురంలో 2,200 ఎకరాల్లో రూ.4 వేల కోట్లతో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని చెప్పారు. రెండేళ్లలో దీని నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. కర్నూలులో రూ.500 కోట్లతో ఫ్లయింగ్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కలెక్టర్ కె.మాధవీలత, జేసీ ఎన్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంజీవ్‌కుమార్, మధురపూడి విమానాశ్రయ అధికారి ఎస్.జ్ఞానేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సింధియా ప్రసంగం

అందరికీ నమస్కారం.. అంటూ సింధియా ప్రారంభించిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతిగాంచిన రాజమహేంద్రవరం పవిత్ర గోదావరి ఒడ్డున ఉందని, వెయ్యేళ్ల ఉత్సవాలు చేసుకుంటున్న ఈ నగర సాంస్కృతిక వారసత్వం దేశానికే తలమానికమని కొనియాడారు. ప్రజాకవి నన్నయ నడయాడిన నేలగా అభివర్ణించారు. అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధులు ఇక్కడి వారేనని ఆయన పేర్కొన్నారు.

శాస్త్రీయ సంగీతంతో మనో వికాసం

- సంగీత, సాహిత్యాలకు ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేయడం అభినందనీయం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



జ్యోతి ప్రజ్వల చేస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రి రోజా తదితరులు

విజయవాడ కల్చరల్: శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహం వంటిదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, ఏపీ పర్యాటక శాఖ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, కేంద్ర టెక్స్‌టైల్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంగీత సాహిత్యాలకు పెద్దపీట వేస్తోందని అభినందించారు. మద్రాస్ వంటి ప్రదేశాల్లో మార్గశిర మాసంలో సంగీత ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, అవి దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అదే స్థాయిలో ప్రతి కార్తీక మాసంలో కృష్ణా, గోదావరి, కావేరీ నదీతీర ప్రాంతాల్లో ఏటా కార్తీక సంగీత ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. శాస్త్రీయ సంగీతం వల్ల మనో వికాసం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి రోజా మాట్లాడుతూ.. భారతీయ సంగీత సంప్రదాయాలు విశిష్టమైనవన్నారు. తెలుగు రాష్ట్రాల పునర్విభజన జరిగాక ఏపీలో తొలిసారిగా కేంద్రం సహకారంతో విజయవాడలో 3 రోజులపాటు కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. కృష్ణాతీరం సకల కళానిలయమని అభివర్ణించారు. సంగీత నాటక అకాడమీ చైర్మన్ సంధ్యా పురిచా, కేంద్ర టూరిజం శాఖ సీఈవో విద్యావతి, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్‌భార్గవ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు కచేరీలతో అలరించారు.

ఎక్స్‌ప్రెస్ రైలు కింద చెలరేగిన మంటలు

అప్రమత్తమైన సిబ్బంది.. తప్పిన ప్రమాదం

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తున్న సిర్పూర్- కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు సమీపంలోకి రాగానే రైలు వీల్స్ లోపలి భాగాల్లో బ్రేక్ లైనర్లు ఒక్కసారిగా పట్టుకోవడంతో మంటల చెలరేగాయి. మంటలను గమనించిన రైల్వేసిబ్బంది అప్రమత్తమై బీబీనగర్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేయించారు. అనంతరం సిబ్బంది, అధికారులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మరమ్మతులు చేయించారు. ఆ తర్వాత రైలును పంపించివేశారు. రైలు అరగంటకుపైగా స్టేషన్‌లో నిలిచిపోవడంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎలాంటి ప్రమాదం తలెత్తకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్త జన యాదాద్రి

- కార్తీకం చివరి వారం కావడంతో కిటకిట
- 70వేల మందికి పైగా భక్తుల రాక

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. కార్తీకం చివరి వారం కావడం.. స్వాతి నక్షత్రం కలిసి రావడంతో 70 వేల మందికి పైగా భక్తులు జంట నగరాలు, వివిధ రాష్ట్రాలతో పాటు ఆయా జిల్లాల నుంచి తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, ఘాట్‌రోడ్లు, మెట్ల మార్గం, గిరిప్రదక్షిణ దారి, కొండపై, కొండ కింద బస్టాండ్లు, పార్కింగ్ ప్రాంతాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులు అధికంగా రావడంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి 6 గంటలు, వీఐపీ దర్శనానికి రెండున్నర గంటలు, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. ఈ క్రమంలో భక్తులు క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. కొండ కిందినుంచి కొండపైకి, కొండపై నుంచి కొండ కిందకు బస్సుల్లో వెళ్లే భక్తులు సీట్ల కోసం వాగ్వాదానికి దిగారు. మెట్ల మార్గంలో, ఘాట్ దారిలో వందల సంఖ్యలో భక్తులు కాలి నడకన కొండపైకి చేరుకున్నారు. అటు శివాలయం, అనుబంధ పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. వివిధ పూజలతో రూ.1,09,40,868 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

అధికారం కోసం దోపిడీ దొంగల ముఠా సంచారం

1,169వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



తాడికొండ: రాష్ట్రంలో అధికారం కోసం దోపిడీ దొంగల ముఠా సంచరిస్తోందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు కోరారు. తుళ్లూరు మండలం, తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,169వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు సందర్శించి, ప్రసంగించారు. అధికారం అడ్డుపెట్టుకొని ఎన్ని తప్పులైనా చేసి బయట పడొచ్చనే యోచనలో ఉన్న బాబు అండ్ కో, అధికారం కోసం అన్ని పార్టీల్లో ఉన్న కులవాదులను, ప్యాకేజీ పార్టీల నాయకులను అడ్డుపెట్టుకొని ఏపీలో తలకిందులుగా తపస్సు ప్రారంభించారని వారి ఆటలు సాగనివ్వమన్నారు. రైతుల ముసుగులో ఉన్న కులవాదులు, టీడీపీ నాయకులు దొంగ ఉద్యమం పెట్టి బాబుకు వత్తాసుగా ఎల్లో మీడియాలో రోజూ అబద్ధాలు ప్రచురిస్తుంటే ఈ ప్రాంతంలో భూములిచ్చి మోసపోయిన రైతులు, అసైన్డ్ రైతులు, రైతు కూలీలకు కడుపు రగిలిపోతుందన్నారు. పేదలను నిరుపేదలుగా మార్చడం, తన సామాజిక వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 14 సంవత్సరాలు సీఎంగా పనిచేసిన చంద్రబాబు, నేడు పేదలకు సమాన హక్కులు కల్పిస్తుంటే చూసి ఓర్చుకోలేక కొత్త ఎత్తుగడలు వేస్తున్నాడన్నారు. విభజన అనంతరం పక్క రాష్ట్రంలో ఇల్లు కట్టుకొని ఇక్కడ ప్రజలను గాలికొదిలేసిన చంద్రబాబు, ఎన్నికలు వచ్చే సరికి రాష్ట్రంలో అవాస్తవాలను పోగేసి అధికారం కోసం పాకులాడటం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం అందించే వారికే బహుజనుల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, బొలిమేర శామ్యూల్, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దిగజారుడు అబద్ధాన్ని జనం నమ్ముతారనేనా!

- ఎప్పుడో 17 నెలల కిందట పింఛను తొలగిస్తే, ఆ మనోవ్యథతో ఇప్పుడు ఆత్మహత్య చేసుకున్నారా?
- ఆ కుటుంబానికి 12 ఎకరాలకు పైనే వ్యవసాయ భూమి ఉంది
- ఆ కుటుంబంలోనే పెళ్లికాని యువకుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కూడా..
- టీడీపీ ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగి ఉన్న కుటుంబంలో ఎవరైనా పింఛను పొందేందుకు అనర్హులే
- పింఛను నిబంధనల్లో టీడీపీ ప్రభుత్వంలో కుటుంబానికి రెండున్నర ఎకరాలకు మించి ఉండకూడదు
- జగన్ సర్కార్ ఆ నిబంధనను సడలించి పదెకరాల దాకా ఉన్నా ఆ కుటుంబానికి పింఛను మంజూరు
- నిబంధనలకు విరుద్ధంగా పింఛను పొందుతున్నారనే అధికారులు తొలగించారు
- 'ఈనాడు' తప్పుడు కథనం రాయడం, దాన్ని చంద్రబాబు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం..
- జనం నమ్ముతారనే సిగ్గులేకుండా జగన్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం
- కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటే.. ప్రభుత్వానికి లింకు పెట్టి ఈనాడు అసత్య కథనం
- గత నాలుగున్నరేళ్లలో 22 లక్షల మందికిపైగా అర్హులకు కొత్త పింఛను మంజూరు చేసిన జగన్ సర్కార్
- అయినా.. ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తున్నట్టు ఈనాడు, చంద్రబాబు, టీడీపీ ప్రచారం చేసే యత్నం


పింఛను తొలగించారని అంధురాలి ఆత్మహత్య

సాక్షి, అమరావతి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై పూర్తిగా ఈర్ష్యాద్వేషాలతో 'ఈనాడు' రోజూ పనిగట్టుకుని రాస్తున్న అబద్ధపు కథనాలు గానీ, ఆ తప్పుడు కథనాలనే చూపిస్తూ చంద్రబాబు, ఇతర టీడీపీ, జనసేన పార్టీల నేతలు విలేకరుల సమావేశాల్లో మాట్లాడే మాటలుగానీ ఎంతటి దిగజారిన స్థాయిలో ఉంటాయనడానికి ఇదో నిదర్శనం. ఆ కథనం, వివరాలు ఏంటో మీరే చూడండి.. ఒక కుటుంబానికి 12.43 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ కుటుంబంలోనే ఇంకా పెళ్లి కాని ఒకరు ఏకంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ రైల్వేలో దాదాపు నెలకు రూ.50 వేల జీతం వచ్చే ఉద్యోగం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సచివాలయాల ఉద్యోగాల భర్తీలో మొదట ఉద్యోగం తెచ్చుకుని, తర్వాత దానికి రాజీనామా చేసి రైల్వే ఉద్యోగంలో చేరారు. ఏ ఆసరా లేని అవ్వాతాతలు, రకరకాల ఇతర అభాగ్యులను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పింఛన్ల పథకంలో నిబంధనలకు విరుద్ధంగా ఆ కుటుంబంలో ఒక దివ్యాంగురాలు (అంధురాలు- ఆమెకు కూడా ఇంకా పెళ్లి కాలేదు) కోటా పింఛను పొందుతున్నారని గుర్తించిన అధికారులు నిబంధనలకు అనుగుణంగా ఆ పింఛన్ని తొలగించారు. ఆ పింఛను తొలగించిన ప్రక్రియ కూడా ఎప్పుడో 17 నెలల కిందట జరిగింది. ఇన్నాళ్ల తర్వాత కుటుంబ కారణాలో లేదంటే ఇతర వ్యక్తిగత కారణాలతోనో శనివారం ఆ అంధురాలు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇదే సమయంలో ఆమె ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 17 నెలల కిందట జరిగిన దానినే గుర్తుపెట్టుకుని మనోవ్యథతో ఆమె ఇప్పుడు అనారోగ్యం పాలైనట్లు, ఆ క్రమంలోనే శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు లింకులు పెట్టి ఈనాడు పత్రిక ఆదివారం ఓ తప్పుడు కథనాన్ని అచ్చేసింది. ఈనాడు రాసిన ఆ తప్పుడు కథనం పేపరు క్లిప్పింగ్‌నే చంద్రబాబు సోషల్ మీడియా 'ఎక్స్'లో ట్యాగ్‌చేసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి కుర్చీలో తమకు అన్నింటా అనుకూలంగా ఉండే చంద్రబాబు కాకుండా.. పేదల సంక్షేమం కోసమే పనిచేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూర్చుని ఉండటాన్ని ఈనాడు సహించలేకపోతోంది. ఎలాగైనా ఆయనను దించి తమ చంద్రబాబునే సీఎం చేయాలని నిజమా.. అబద్ధమా అన్న విచక్షణ కూడా లేకుండా ఏ సంఘటన జరిగినా దాన్ని ప్రభుత్వానికి అంటగట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు రాయడమే పనిగా పెట్టుకున్న ఈనాడుకు తాము రాసింది చూసి జనం నవ్వుకుంటారనే విచక్షణ కూడా లేకుండా పోయింది. మన రాష్ట్రంలో గానీ, దేశ చరిత్రలో మరే రాష్ట్రంలోనూ ఎప్పుడూ జరగనంతస్థాయిలో పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తుంటే.. తనకు ఇక రాజకీయ భవిష్యత్ ఉండదనే బెంగతో ఉన్న చంద్రబాబు కూడా ప్రజలు నవ్వుకుంటారని మరిచిపోయి ప్రవర్తిస్తున్నారు.

బాబు పెట్టిన కఠిన నిబంధనల్ని జగన్ సీఎం అయ్యాక సడలించారు

ఒక కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వం ఉద్యోగం ఉన్నా.. లేదంటే ఆ కుటుంబానికి 2.5 ఎకరాలు లేదంటే ఐదెకరాలకు మించి మెట్ట భూమి ఉన్నా ఆ కుటుంబంలో సభ్యులు పింఛనుకు అనర్హులని గత చంద్రబాబు ప్రభుత్వమే నిబంధనలు తీసుకొచ్చింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక నిబంధనల పేరుతో పేదలు ఎక్కువగా ఇబ్బందులు పడకూడదని అప్పటి ప్రభుత్వం పెట్టిన నిబంధనల్ని చాలావరకు సడలించారు. టీడీపీ ప్రభుత్వంలో ఒక కుటుంబానికి రెండున్నర ఎకరాలకు మించి ఉండకూడదన్న నిబంధనను బాగా సడలించి పదెకరాల దాకా వ్యవసాయ భూమి ఉన్నా పింఛను మంజూరుకు అర్హులుగా ఉత్తర్వులు ఇచ్చారు. గత నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా అర్హులైన పేదలకు ఈ ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పింఛను లబ్ధిదారులు ప్రతి నెలా పింఛను తీసుకోవడానికి కూడా నడవలేని స్థితిలో అవ్వాతాతలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడితే, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందిస్తోంది.

తెలంగాణ

ఏడాదిలో 119 మంది ఖైదీల ఆత్మహత్య

- వీరిలో 109 మంది ఉరేసుకుని బలవన్మరణం
- దేశవ్యాప్తంగా 2022లో 1,922 మంది మృతి
- 1,773 మంది ఖైదీల సహజ మరణం
- 159 మంది అసహజ కారణాలతో మృత్యువాత
- తెలంగాణలో 13 మంది మరణించారన్న ఎన్సీఆర్బీ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో కలిపి 2022 సంవత్సరంలో 119 మంది ఖైదీలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 109 మంది ఉరి వేసుకున్నారు. ఈ ఏడాది తెలంగాణలోని అన్ని జైళ్లలో కలిపి 11 మంది ఖైదీలు సహజ మరణం పొందగా, ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపింది. కాగా 2021తో పోల్చుకుంటే ఖైదీల మరణాలు తగ్గడం గమనార్హం. దేశవ్యాప్తంగా జైళ్లలో పరిస్థితులు, ఖైదీల మరణాలపై నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) ఒక నివేదిక రూపొందించింది. ఇందులోని వివరాలను ఇటీవల కేంద్ర హోంశాఖ వెల్లడించింది. 2022లో దేశవ్యాప్తంగా అన్ని జైళ్లలో కలిపి 1,995 మంది ఖైదీలు మృతి చెందారు. 1,773 మందిది సహజ మరణం కాగా, 159 మంది అసహజ రీతిలో మరణించారు సహజ మరణం పొందిన 1,773 మందిలో 1,670 మంది అనారోగ్యంతో, మరో 103 మంది వృద్ధాప్యం కారణంగా మృతి చెందారు. మిగతావి మిస్టరీ మరణాలు. అనారోగ్య మృతుల్లో 428 మంది ఖైదీలు గుండె సంబంధ వ్యాధులతో, 190 మంది ఊపిరితిత్తుల సమస్యలతో, మరో 100 మంది క్యాన్సర్ కారణంగా మరణించారు. టీబీ కారణంగా 89 మంది, కిడ్నీ సమస్యలతో 81 మంది, బ్రెయిన్ హెమరేజ్‌తో 58 మంది, డ్రగ్స్, ఆల్కహాల్ విత్‌డ్రావల్ లక్షణాల కారణంగా 37 మంది మృతి చెందారు. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 351 మంది అనారోగ్యంతో మరణించారు. పశ్చిమ బెంగాల్ (174), బిహార్ (167) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

అసహజ మరణాల్లో హత్యలు, దాడులు

అసహజ మరణాల్లో 109 మంది ఉరేసుకోగా 10 మంది ఇతర ప్రమాదాల్లో మృతి చెందారు. తోటి ఖైదీల చేతుల్లో నలుగురు హత్యకు గురయ్యారు. బయటి వారి దాడిలో ఒకరు, కారణాలు తెలియని మరణాలు మరో 25 వరకు నమోదయ్యాయి. అసహజ మరణాల్లోనూ అత్యధికంగా ఉత్తర ప్రదేశ్‌లోనే 24 మంది మృతి చెందారు. 17 మందితో కర్ణాటక, 15 మందితో హరియాణ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

పారిపోయింది 257 మంది.. పట్టుకుంది 113 మందిని

మొత్తం 257 మంది ఖైదీలు జైళ్ల నుంచి పారిపోయినట్టు ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. వీరిలో 113 మందిని తిరిగి పట్టుకోగలిగారు. 2020లో 355 మంది, 2021లో 312 మంది పారిపోయినట్టు నివేదిక తెలిపింది.

పత్తి ఏరేందుకు వెళ్లి..

- ముగ్గురు మహిళల దుర్మరణం
- ఆటోను మినీ ట్రక్ ఢీకొట్టడంతో ప్రమాదం
- తొమ్మిది మందికి కూలీలకు తీవ్ర గాయాలు
- సిద్దిపేట జిల్లా వట్టిపల్లి సమీపంలో దుర్ఘటన



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

జగదేవ్‌పూర్(గజ్వేల్): మరో ఇరవై నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోగానే టాటా ఏస్(ట్రాలీ ఆటో- మినీ ట్రక్) రూపంలో దారి కాచిన మృత్యువు ముగ్గురి కూలీలను కబళించింది. ఈ విషాద ఘటన ఆదివారం రాత్రి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన 12 మంది కూలీలు ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన మహేశ్ ఆటోలో జగదేవ్‌పూర్ మండలం బీజీవెంకటాపూర్ గ్రామానికి చెందిన పొలంలో పత్తి తీసేందుకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి అదే ఆటోలో వెళ్తున్న క్రమంలో వట్టిపల్లి గ్రామ సమీపానికి రాగానే కొండపోచమ్మ వైపు నుంచి ఎదురుగా వస్తున్న టాటా ఏస్ బలంగా ఢీ కొంది. దీంతో ఆటోలో ఉన్న పుట్ట జయమ్మ(60), వైనాల శిరీష (17) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గుర్రాల లక్ష్మి (45) గజ్వేల్ ఆస్పత్రిలో మృతి చెందింది. మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారత్- దక్షిణ కొరియా బంధం బలీయం: మోదీ

న్యూఢిల్లీ: భారత్, దక్షిణకొరియాల సంబంధం పరస్పర గౌరవం, ఉమ్మడి విలువల ఆధారంగా మరింత బలపడుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'భారత్, దక్షిణ కొరియాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి నేటితో 50 ఏళ్లు పూరయ్యాయి. ఇది పరస్పర గౌరవం, ఉమ్మడి విలువలు, పెరుగుతున్న భాగస్వామ్యాలు కలగలిసిన ప్రయాణం'అని ఆయన పేర్కొన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకునేందుకు ఆయనతో కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య ఏర్పడిన సంబంధాలకు 50 ఏళ్లయిన సందర్భంగా ఆయన ఆదివారం ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

19న 'ఇండియా' భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఢిల్లీలో ఈ నెల 19న భేటీ కానున్నారు. ఈ సమావేశంలో సీట్ల పంపకం, ఉమ్మడి ఎజెండా, ఉమ్మడిగా ర్యాలీల నిర్వహణ వంటి కీలక అంశాలపై నేతలు ఒక అంగీకారానికి రావాల్సి ఉంది. కూటమి నాలుగో సమావేశం ఢిల్లీలో 19న సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ఆదివారం తెలిపారు. ప్రధాని మోదీకి దీటుగా మనం, నేను కాదు(మైనహీ, హమ్)అనే ఐక్య ఇతివృత్తంతో ఇండియా కూటమి నేతలు ముందుకు సాగుతారని ఆయన చెప్పారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో ఈ సమావేశం జరగనుండటం గమనార్హం. టీఎంసీ చీఫ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సహా కీలక నేతలు ఈ భేటీకి హాజరవుతారని భావిస్తున్నారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు దుర్మరణం

అట్లాంటా: అమెరికాలోని అట్లాంటాలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. పీచ్‌ట్రీ రోడ్డులో సాయంత్రం 6.25 గంటల సమయంలో జరిగినట్లు సమాచారం అందిందని పోలీసు విభాగం తెలిపింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించామన్నారు. ఘటనకు సంబంధించిన ఇతర వివరాలేమీ వెల్లడికాలేదు.

టెన్నెసీలో తుఫానుకు ఆరుగురు బలి

నాష్‌విల్లే: అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రాన్ని భీకర తుపాను వణికిస్తోంది. ఇళ్లు కూలిన ఘటనల్లో ఆరుగురు మృతి చెందగా 25 మందికి పైగా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. నాష్‌విల్లేలోని మాంట్ గోమెరీ కౌంటీలో ఒక చిన్నారి సహా ముగ్గురు చనిపోయారు. నాష్‌విల్లే శివారులో జరిగిన ఘటనలో మరో ముగ్గురు చనిపోయారు.

దక్షిణ అమెరికాలోనూ యుద్ధ మేఘాలు!

గయానాతో కయ్యం దిశగా వెనెజులా ఎసెక్విబో ప్రాంతాన్ని ఆక్రమించే యత్నం

- అక్కడి అపార చమురు నిక్షేపాలపై కన్ను
- విలీనంపై రిఫరెండం, 95 శాతం సమర్థన
- గయానాకు మద్దతుగా అమెరికా

అటు రష్యా-ఉక్రెయిన్. ఇటు ఇజ్రాయెల్-పాలస్తీనా. ఇలా ఇప్పటికే రెండు యుద్ధాలతో దాదాపు రెండేళ్లుగా ప్రపంచం అల్లకల్లోలమవుతోంది. ఇవి చాలవన్నట్టు దక్షిణ అమెరికా ఖండంలో కూడా యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వాతావరణం అంతర్జాతీయ సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది. బుల్లి దేశమైన గయానా అధీనంలో ఉన్న ఎసెక్విబో ప్రాంతంలోని అపార చమురు నిల్వలపై పొరుగు దేశం వెనెజులా కన్నేసింది. ఈ వివాదాస్పద ప్రాంతాన్ని పూర్తిగా కబళించే దిశగా పావులు కదుపుతోంది. ఈ పరిణామం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. గయానాకు అమెరికా దన్నుగా నిలుస్తుండటంతో పరిస్థితులు క్రమంగా ముదురు పాకాన పడుతున్నాయి...

దక్షిణ అమెరికాలోని ఎసెక్విబో ప్రాంతం రెండు శతాబ్దాలుగా వెనెజులా, గయానా మధ్య వివాదాలకు కారణంగా ఉంటూ వస్తోంది. ఇది తమదంటే తమదని రెండు దేశాలూ వాదిస్తున్నాయి. కాకపోతే దాదాపు గత వందేళ్లుగా ఈ ప్రాంతం గయానా అధీనంలోనే ఉంది. దీని విషయమై కొద్ది దశాబ్దాలుగా ఇరు దేశాల నడుమ అడపాదడపా కీచులాటలు సాగుతూనే వస్తున్నాయి. ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నట్టు 2004లో అప్పటి వెనెజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ ప్రకటనతో పదేళ్లపాటు ఉద్రిక్తతలు చల్లారాయి. కానీ ఎసెక్విబోను ఆనుకుని ఉన్న అట్లాంటిక్ సముద్ర జలాల్లో ఏకంగా 11 బిలియన్ బ్యారెళ్ల చమురు నిక్షేపాలున్నట్టు 2015లో బయట పడటంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఆ నిల్వలపై కన్నేసిన వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఎసెక్విబో నిజానికి తమదేనన్న వాదనను తిరగదోడారు. దీన్ని ఇంటా బయటా పదేపదే ప్రస్తావిస్తూ వచ్చారు. ఎసెక్విబోను వెనెజులాలో కలిపేసుకుంటామని ప్రకటించి తాజాగా ఉద్రిక్తతలకు తారస్థాయికి తీసుకెళ్లారు. విలీనంపై వెనెజులాలో రిఫరెండం నిర్వహిస్తామని ప్రకటించడంతో గయానా అంతర్జాతీయ న్యాయస్థానానికి ఫిర్యాదు చేసింది. ఎలాంటి దుందుడుకు చర్యలూ చేపట్టొద్దన్న కోర్టు ఆదేశించిన రెండు రోజులకే వాటిని బేఖాతరు చేస్తూ మదురో డిసెంబర్ 3న వెనెజులావ్యాప్తంగా రిఫరెండం జరిపారు. ఏకంగా 95 శాతం మందిఎసెక్విబో విలీనానికి జై కొట్టినట్టు ప్రకటించారు. వెంటనే ఆ ప్రాంతాన్ని గయానా ఎసెక్విబా పేరిట వెనెజులాలో నూతన రాష్ట్రంగా చూపుతున్న కొత్త మ్యాపులను మదురో విడుదల చేసేశారు!

శతాబ్దాల వివాదం...

వెనెజులా, గయానా మధ్య ఎసెక్విబో వివాదం ఈనాటిది కాదు. వెనెజులా అప్పట్లో స్పెయిన్ వలస రాజ్యంగా ఉన్న రోజుల్లో ఈ ప్రాంతం వెనెజులా అధీనంలోనే ఉండేది. 1899 దాకా అలాగే కొనసాగింది. 1899లో జరిగిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం గయానాకు దఖలు పడింది. కానీ అది మోసపూరిత ఒప్పందని వెనెజులా ఆరోపిస్తూ వస్తోంది. తమ ప్రాతినిధ్యం లేకుండా తమ తరఫున అమెరికా, బ్రిటన్ దీనికి తలూపాయని చెబుతోంది.


రాజకీయ ఎత్తుగడే!

నిజంగా గయానాపై దండెత్తడం మదురో ఉద్దేశం కాదని పరిశీలకులు భావిస్తున్నారు. 2013 నుంచీ అధికారంలో ఉన్న మదురోపై వెనెజులాలో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉంది. ఆయన పదేళ్ల పై చిలుకు పాలనలో దేశం పేదరికం కోరల్లో చిక్కిందన్న అభిప్రాయముంది. ఈ నేపథ్యంలో యుద్ధం పేరిట భావోద్వేగాలు రెచ్చగొట్టడం ద్వారా ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించి, అధ్యక్ష ఎన్నికలను వీలైనంత కాలం వాయిదా వేసేందుకే ఆయన ఈ ఎత్తు వేశారని చెబుతున్నారు.


మదురో

రంగంలోకి అమెరికా

గయానాపై వెనెజులా సైనిక చర్యకు దిగవచ్చన్న వార్తలు కొద్ది రోజులుగా జోరందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా హుటాహుటిన రంగంలోకి దిగింది. గయానాకు అన్నివిధాలా బాసటగా నిలుస్తామని ప్రకటించింది. డిసెంబర్ 7 నుంచి ఆ దేశంలో సంయుక్తంగా సైనిక విన్యాసాలు చేస్తూ వెనెజులాకు హెచ్చరికలు పంపుతోంది. దీని వెనక అమెరికా స్వీయ చమురు ప్రయోజనాలు దాగున్నాయి. ఎసెక్విబోలో చమురు నిల్వలను గుర్తించిన ఎక్సాన్ మొబిల్ అమెరికా చమురు దిగ్గజమే. ఒక్క 2022లోనే చమురు వెలికితీత ద్వారా ఆ కంపెనీకి ఏకంగా 600 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది! వాటిని వదులుకోవడం అగ్ర రాజ్యానికి సుతరామూ ఇష్టం లేదు. దట్టమైన అడవులతో కూడిన ఎసెక్విబోపై దాడి చేయాలంటే సముద్ర మార్గమే వెనెజులాకు శరణ్యం. లేదంటే ఇరు దేశాలతో సరిహద్దు పంచుకుంటున్న బ్రెజిల్ గుండా వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్రెజిల్ కూడా వెనెజులాతో తమ సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. శాంతియుతంగా తేల్చుకోవాలని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా మదురోకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 14న ఆయన సమక్షంలో సమావేశమై వివాదంపై చర్చించుకునేందుకు మదురో, గయానా అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ అంగీకరించినట్టు చెబుతున్నారు.



సహజ వనరుల గని

- ఎసెక్విబో ప్రాంతం అపార సహజ వనరులకు ఆలవాలం
- దీని విస్తీర్ణం దాదాపు 1.59 లక్షల చదరపు కిలోమీటర్లు
- గయానా మొత్తం భూభాగంలో మూడింట రెండొంతులు ఈ ప్రాంతమే విస్తరించి ఉంది
- కానీ గయానా మొత్తం జనాభా దాదాపు 8 లక్షలైతే అందులో ఎసెక్విబోలో ఉన్నది 1.2 లక్షల మందే
- ఈ ప్రాంతం నిండా దట్టమైన అమెజాన్ వర్షారణ్యాలే విస్తరించి ఉన్నాయి
- భారీ పరిమాణంలో బంగారం, రాగి తదితర ఖనిజ నిల్వలు కూడా ఉన్నాయి

- సాక్షి, నేషనల్ డెస్క్

శబరిమలలో భారీ రద్దీ.. దర్శన సమయం గంట పెంపు

పత్తనంతిట్ట: కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయానికి మాలధారుల తాకిడి పెరిగింది. దీంతో దర్శన సమయాన్ని గంట పొడిగించినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డు(టీడీబీ)ఆదివారం ప్రకటించింది. సాయంత్రం దర్శనం 4 బదులు 3 గంటల నుంచే మొదలవనుంది. రోజూ వర్చువల్ క్యూ ద్వారా 90 వేల బుకింగ్‌లు, 30 వేల స్పాట్‌లో బుకింగ్స్ ఉంటున్నాయని ఆలయ ఏర్పాట్లను చూసే ఐజీ స్పర్జన్ కుమార్ చెప్పారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో దర్శనాలను త్వరత్వరగా సాఫీగా సాగేలా చూడాలన్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతోందని వివరించారు. దర్శనానికి 15 నుంచి 20 గంటల వరకు భక్తులు ఎదురుచూపులు చూడాల్సి వస్తోందని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ పేర్కొన్నారు.

ఒడిశా ఐటీ దాడుల మొత్తం రూ.351 కోట్లు

న్యూఢిల్లీ/భువనేశ్వర్: ఒడిశా కేంద్రంగా మద్యం వ్యాపారం చేస్తున్న సంస్థకు సంబంధించిన ప్రాంతాల్లో ఆదాయ పన్ను(ఐటీ) అధికారులు చేసిన సోదాల్లో దొరికిన నగదు మొత్తం రూ.351 కోట్లకు చేరింది. దేశంలో ఒక దర్యాప్తు సంస్థ ఒకేసారి చేసిన సోదాల్లో ఇంతటి భారీస్థాయిలో కరెన్సీ బయటపడటం ఇదే తొలిసారి! బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, దాని ప్రమోటర్లు, ఇతరులకు సంబంధించిన చోట్ల ఐటీ అధికారుల సోదాలు ఐదోరోజైన ఆదివారమూ కొనసాగాయి. మద్యం వ్యాపారం ద్వారా పొందిన దాంట్లో లెక్కల్లో చూపని ఆదాయం గుట్టుమట్లను ఐటీ శాఖ రట్టుచేస్తోంది. తనిఖీల్లో భాగంగా రాంచీలోని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ ప్రసాద్ సాహూ సంబంధిత ప్రాంతాల్లోనూ ఐటీ అధికారులు చెక్‌చేశారు. ఇక్కడ ఎంత మొత్తంలో నగదు, ఇతర పత్రాలు లభించాయనేది అధికారులు వెల్లడించలేదు. 'ఈ అంశం ధీరజ్ సాహూ కుటుంబ విషయం. దాదాపు వందేళ్లకు పైగా వారి కుటుంబం ఉమ్మడి వ్యాపారం చేస్తోంది. అందులో సాహూకు చిన్న వాటా ఉంది. ఏదేమైనా ఆయనకు సంబంధించిన చోట్ల సోదాలు జరిగాయికాబట్టి ఆయన ఈ విషయంలో వివరణ ఇవ్వాల్సిందే. అందుకే ఆయన నుంచి వివరణ తీసుకున్నాం. కాంగ్రెస్ పార్టీకి ఈ సోదాలకు సంబంధం లేదు'' అని జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అవినాశ్ పాండే ఆదివారం స్పష్టంచేశారు.

విపక్షాలపై అమిత్ విమర్శలు

ఐటీ దాడులపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. '' దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తుందని ఇన్నాళ్లూ విపక్షాలు ఎందుకు అన్నాయో ఇప్పుడు అర్థమవుతోంది. విపక్షాలు తమ అవినీతి, అక్రమ సొమ్ము వ్యవహారం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే ఇన్నాళ్లు విషప్రచారం చేశాయి. తీరా ఇప్పుడు కరెన్సీ కట్టలు బయటపడ్డాక కాంగ్రెస్, టీఎంసీ, జేడీయూ, డీఎంకే, ఆర్జేడీలు మౌనం వహిస్తున్నాయి'' అమిత్ వ్యాఖ్యానించారు.


నర్గీస్ తరఫున బహుమానం స్వీకరిస్తున్న ఆమె పిల్లలు (ఇన్‌సెట్లో నర్గీస్)

తల్లి తరఫున నోబెల్ శాంతి బహుమతి స్వీకరణ

కార్యక్రమంలో పాల్గొన్న ఇరాన్ కార్యకర్త నర్గీస్ కవలపిల్లలు

హెల్సింకీ: ఇరాన్ మానవ హక్కుల మహిళా కార్యకర్త నర్గీస్ మొహమ్మదీకి నోబెల్ కమిటీ ప్రకటించిన శాంతి బహుమతిని ఆమె తరఫున ఆమె కుమారుడు, కుమార్తె అందుకున్నారు. ఇరాన్‌లో మహిళల అణచివేత, మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పోరాడుతున్న 51 ఏళ్ల నర్గీస్‌ను ఇరాన్ ప్రభుత్వం అక్రమ కేసులు మోపి టెహ్రాన్ జైలులో పడేసిన విషయం విదితమే. శనివారం నార్వేలోని ఓస్లోలో నర్గీస్ కవల పిల్లలు అలీ, కియానా రహ్మానీ పురస్కారాన్ని స్వీకరించారు. ''ఇరాన్ సమాజానికి అంతర్జాతీయ మద్దతు అవసరం . ప్రభుత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తిన మానవహక్కుల కార్యకర్తలు, నిరసనకారులు, పాత్రికేయుల గొంతుకను సభావేదికగా గట్టిగా వినిపించండి'' అంటూ నర్గీస్ ఇచ్చిన సందేశాన్ని వేదికపై వారు చదివారు.

ఛత్తీస్ సీఎంగా విష్ణుదేవ్ సాయ్

బీజేపీ శాసనసభా పక్షసమావేశంలో ఎన్నుకున్న నేతలు

రాయ్‌పూర్: బీజేపీ అగ్రనాయకత్వం తీవ్ర చర్చోపచర్చల తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో నూతన ముఖ్యమంత్రి ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం లభించింది. ఆదివారం రాయ్‌పూర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు హాజరైన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో విష్ణుదేవ్ సాయ్‌ను సభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. 59 ఏళ్ల విష్ణుదేవ్ రాష్ట్రంలోని సుర్గుజా ప్రాంతంలోని జష్‌పూర్ జిల్లా కుంకురీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ప్రాంతంలోని మొత్తం 14 స్థానాల్లోనూ బీజేపీనే విజయబావుటా ఎగరేసింది. ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాక ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నడ్డాలకు విష్ణుదేవ్ కృతజ్ఞతలు తెలిపారు. సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ఎన్నికల హామీ ప్రకారం వెంటనే హౌజింగ్ పథకం కింద 18 లక్షల ఇళ్లు ఇస్తామని ఆయన ప్రకటించారు. రాయ్‌పూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్యేల భేటీకి 54 మంది పార్టీ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ అధిష్టానం పంపిన పర్యవేక్షకులు అర్జున్ ముండా, శర్బానంద సోనోవాల్, దుష్యంత్ కుమార్ గౌతమ్‌లు హాజరయ్యారు. సమావేశం తర్వాత రాష్ట్ర గవర్నర్‌ను విష్ణుదేవ్ తదితరులు కలిశారు. దీంతో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని కాబోయే ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌ను గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆహ్వానించారని రాజ్‌భవన్ ఒక ప్రకటనలో పేర్కొంది. 90 సీట్లున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలో బీజేపీ 54 చోట్ల గెలిచింది.

సర్పంచ్‌గా మొదలై ఆదివాసీ సీఎం దాకా...

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ కీలక నేతల్లో విష్ణుదేవ్ ఒకరు. రాజకీయ నేపథ్యం నుంచి వచ్చారు. సర్పంచ్‌గా రాజకీయ జీవితం మొదలెట్టి ఆ తర్వాత పలుమార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి మోదీ తొలి కేబినెట్‌లో కేంద్ర మంత్రిగా సేవలందించారు. పార్టీ రాష్ట్ర చీఫ్‌గా మూడుపర్యాయాలు పనిచేసి అధిష్టానం మెప్పు పొందారు. 1990లో బగియా గ్రామ సర్పంచ్‌గా గెలిచారు. అదే ఏడాది అవిభాజ్య మధ్యప్రదేశ్‌లో తపకారా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004, 2009లో రాయ్‌గఢ్ ఎంపీగా గెలిచారు. మోదీ తొలిసారి ప్రధాని అయ్యాక కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలో మెజారిటీ సీట్లు గెలిస్తే విష్ణుదేవ్‌ను 'పెద్దనేత'ను చేస్తామని ఇటీవల ఎన్నికల ప్రచారసభలో అమిత్ షా ప్రకటించడం తెల్సిందే.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడ్డాక అజిత్ జోగీ తొలి ఆదివాసీ సీఎంగా రికార్డులకెక్కారు. ఆయన తర్వాత ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబోతున్న ఆదివాసీ నేతగా విష్ణుదేవ్ పేరు నిలిచిపోనుంది. విష్ణుదేవ్ తాత బుద్ధనాథ్ సాయ్ 1947–52 వరకు నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈయన పెదనాన్న నరహరి ప్రసాద్ రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, జనతాపార్టీ ప్రభుత్వంలో సహాయ మంత్రిగాచేశారు. ఇంకో పెదనాన్న సైతం గతంలో ఎమ్మెల్యేగా గెలిచారు.

భార్యకు 18 ఏళ్లు దాటితే.. భర్తపై వైవాహిక అత్యాచారం కేసుండదు

ప్రయాగ్‌రాజ్: భార్య వయస్సు 18 ఏళ్లు, అంతకు మించి ఉన్న సందర్భాల్లో వైవాహిక అత్యాచారం(మారిటల్ రేప్) అభియోగం నుంచి వ్యక్తికి రక్షణ ఉంటుందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఇందుకు సంబంధించి భర్తపై ఐపీసీ సెక్షన్ 377ను వర్తింప జేయడంపై గతంలో మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉదహరించింది. అయితే, ఇండిపెండెంట్ థాట్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా(2017)కేసులో సుప్రీంకోర్టు తీర్పునను సరించి వ్యక్తి, 15–18 మధ్య వయస్సున్న అతడి భార్య మధ్య జరిగే ఎలాంటి లైంగిక సంపర్కమైనా అత్యాచారం కిందికే వస్తుందని స్పష్టం చేసింది. ఓ వ్యక్తి వేసిన రివిజన్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నెల 6న ఈ మేరకు పేర్కొంది. అయితే, పిటిషనర్‌పై కట్నం వేధింపులకు సంబంధించిన ఆరోపణలపై తమ తీర్పు ప్రభావం ఉండబోదని తెలిపింది. ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిపై 2013లో ఐపీసీ సెక్షన్లు 498ఏ, 323, 377తోపాటు వరకట్న నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఘజియాబాద్‌లోని దిగువ కోర్టుతోపాటు, అప్పిలేట్ కోర్టు కూడా అతడిని దోషిగా పేర్కొన్నాయి. వీటిని సవాల్ చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టులో రివిజన్ పిటిషన్ వేశాడు. విచారించిన హైకోర్టు.. పిటిషనర్‌పై ఐపీసీ సెక్షన్లు 498ఏ, 323 కింద నమోదైన కేసుల్లో దిగువ కోర్టులిచ్చిన తీర్పులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

పనిపిల్లపై యజమాని కుటుంబం దాష్టీకం

13 ఏళ్ల టీనేజర్‌ను వివస్త్రను చేసి బంధించిన వైనం

గురుగ్రామ్: పదమూడేళ్ల పనిపిల్ల పట్ల ఓ ఇంటావిడ దారుణంగా ప్రవర్తించింది. హరియాణాలోని గురుగ్రామ్ పట్టణంలోని సెక్టార్ 51 పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పనికి కుదిర్చిన వ్యక్తితో కలిసి ఎట్టకేలకు తల్లి.. ఆమె కూతురుని విడిపించుకుంది. తాను అనుభవించిన చిత్రహింసను కూతురు ఏడుస్తూ చెప్పడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం.. బిహార్‌కు చెందిన ఈమె తన కూతురును జూన్ 27వ తేదీన ఒకావిడ ఇంట్లో పనికి కుదిర్చింది. ఇంట్లో ఉంచుకుని, పనికి నెలకు రూ.9,000 జీతం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. '' మొదట్లో రెండు నెలలు మాత్రమే నా కుతురుకు జీతం ఇచ్చారు. ఆ తర్వాత చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఇంటి పని అంతా చేయించుకుని ఇష్టమొచ్చినట్లు కొట్టేవారు. పెంపుడు కుక్కతో కరిపించేవారు. యజమాని ఇద్దరు కుమారులు నా బిడ్డను లైంగికంగా వేధించారు. బలవంతంగా బట్టలూడదీసి ఫొటోలు, వీడియోలు తీసేవారు. అసభ్యంగా తాకేవారు. యజమానురాలు ఇనుప కడ్డీ, సుత్తితో కొట్టి చిత్రహింసలు పెట్టేది. బయటకు తప్పించుకునిపోకుండా గదిలో బంధించేవారు. కట్టేసి అరవకుండా నోటికి టేప్ అంటించారు. చేతులపై యాసిడ్ పోశారు. విషయం బయటకు పొక్కితే చంపేస్తామని బెదిరించేవారు. నా బిడ్డకు రెండు రోజులకు ఒకసారి భోజనం పెట్టేవారు. ఇంతటి దారుణాలు తెలిశాక స్థానిక వ్యక్తితో కలిసి ఎట్టకేలకు ఆ బిడ్డను విడిపించుకున్నా'' అని టీనేజర్ తల్లి వాపోయారు.

పొగాకు ఉత్పత్తుల ప్రకటనల్లో పాల్గొంటున్నందుకు.. షారూక్, అక్షయ్, దేవ్‌గణ్‌లకు కేంద్రం నోటీసులు

లక్నో: పొగాకు కంపెనీల తరఫున ప్రకటనల్లో కన్పిస్తున్న బాలీవుడ్ నటులు షారూక్ ఖాన్, అక్షయ్‌కుమార్, అజయ్ దేవ్‌గణ్‌లకు కేంద్రం నోటీసులు పంపింది. ప్రజల ఆరోగ్యానికి చేటు తెస్తున్న పొగాకు ఉత్పత్తుల ప్రకటనల్లో సెలబ్రిటీలు, ముఖ్యంగా పద్మ అవార్డు గ్రహీతలు నటిస్తుండటంపై మోతీలాల్ యాదవ్ అనే న్యాయవాది గతంలో అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. కేంద్రం స్పందించడం లేదని, ఇది ధిక్కరణేనని పిటిషనర్ మరోసారి కోర్టుకు వెళ్లారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. షారూక్, అక్షయ్, అజయ్‌లకు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ అక్టోబర్ 20వ తేదీనే నోటీసులిచ్చిందని కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎస్‌బీ పాండే కోర్టుకు తెలిపారు. ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నందున పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. విచారణ 2024 మే 9కి వాయిదా పడింది.

మాయావతి వారసునిగా మేనల్లుడు


మేనల్లుడు ఆకాశ్‌తో మాయావతి

సాక్షి, న్యూఢిల్లీ: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన తమ్ముడి కుమారుడు, మేనల్లుడు అయిన ఆకాశ్ ఆనంద్‌ను వారసుడి (ఉత్తరాధికారి)గా ప్రకటించారు. ఈ విషయాన్ని పార్టీ షాజహాన్‌పూర్ జిల్లా చీఫ్ ఉదయ్‌వీర్ సింగ్ ఆదివారం మీడియాకు తెలిపారు. 'యూపీ, ఉత్తరాఖండ్ మినహా దేశవ్యాప్తంగా పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో బలోపేతం చేయాల్సిన బాధ్యతలను ఆయనకు అప్పగించారు. తన రాజకీయ వారసుడు ఆకాశ్ ఆనంద్ అని మాయావతి తెలిపారు'అని వివరించారు. ఆదివారం లక్నోలో జరిగిన బీఎస్పీ అఖిల భారత సమావేశంలో ఈ విషయాన్ని మాయావతి స్వయంగా ప్రకటించారని ఉదయ్‌వీర్ చెప్పారు. అయితే దీనిపై పార్టీ అధికార ప్రకటన చేయలేదు. ఆకాశ్ బీఎస్పీ జాతీయ సమన్వయకర్తగా ఉన్నారు. ఎంబీయే చదివిన ఆయన 2016లో పార్టీలో చేరిన నాటి నుంచే క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్‌గా యువతకు దగ్గరయ్యారు. తాజాగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల్లో బీఎస్పీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

దాడులతో చెలరేగిన ఇజ్రాయెల్

యుద్ధం కోసం రూ.834 కోట్ల ఆయుధాలు అమ్మేందుకు అమెరికా సిద్ధం

'వీటో'తో, ఆయుధాలతో సహకరిస్తున్న అమెరికాకు థాంక్యూ: నెతన్యాహు

డెయిర్ అల్-బాలాహ్(గాజా స్ట్రిప్): హమాస్ మెరుపుదాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ మొదలుపెట్టిన దాడులు భీకర రూపం దాలుస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఐక్యరాజ్యసమితి తెచ్చిన తీర్మానాన్ని అమెరికా తన వీటో అధికారంతో కాలదన్నిన దరిమిలా ఇజ్రాయెల్ ఆదివారం మరింత రెచ్చిపోయింది. అమెరికా నుంచి తాజాగా మరింతగా ఆయుధ సంపత్తి అందుతుండటంతో ఇజ్రాయెల్ భీకర గగనతల దాడులతో చెలరేగిపోతోంది. 23 లక్షల గాజా జనాభాలో దాదాపు 85 శాతం మంది బతుకుజీవుడా అంటూ స్వస్థలాలను వదిలిపోయినా సరే ఆదివారం ఇజ్రాయెల్ దాడుల తీవ్రతను తగ్గించకపోవడం గమనార్హం. దాదాపు రూ.834 కోట్ల విలువైన యుద్ధట్యాంక్ ఆయుధాలను ఇజ్రాయెల్‌కు అమ్మేందుకు అమెరికా అంగీకరించడం చూస్తుంటే ఇజ్రాయెల్ సేనల దూకుడు ఇప్పట్లో ఆగేట్లు కనిపించడం లేదు. 'ఐరాస భద్రతా మండలిలో మాకు బాసటగా అమెరికా నిర్ణయాలు తీసుకుంటోంది. యుద్ధం కొనసాగింపునకు వీలుగా కీలక ఆయుధాలు అందేందుకు సహకరిస్తున్న అమెరికాకు నా కృతజ్ఞతలు' అని ఆదివారం ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు.

యుద్ధం ఆగదు: ఇజ్రాయెల్

'హమాస్‌ను ఈలోపే అంతంచేయాలని అమెరికా మాకు ఎలాంటి గడువు విధించలేదు. హమాస్ నిర్మూలన దాకా యుద్ధం కొనసాగుతుంది. హమాస్ అంతానికి వారాలు కాదు నెలలు పట్టొచ్చు. బంధీలందర్నీ విడిపిస్తాం'' అని ఇజ్రాయెల్ జాతీయ భద్రతా సలహాదారు టజాచీ హెనెగ్బీ శనివారం అర్ధరాత్రి తేల్చిచెప్పారు. '' గాజాలో సరైన సాయం అందక సరిదిద్దుకోలేని స్థాయిలో అక్కడ మానవ విపత్తు తీవ్రతరమవుతోంది. ఇది పశ్చిమాసియా శాంతికి విఘాతకరం'' అని ఖతార్‌లో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు. షిజాయాహ్, జబాలియా శరణార్థి శిబిరాల వద్ద నిరంతరం దాడుల కొనసాగుతున్నాయి. ''కదిలే ప్రతి వాహనంపైనా దాడి జరుగుతోంది. శిథిలాలతో నిండిన మా ప్రాంతాలకు అంబులెన్స్‌లు రాలేకపోతున్నాయి'' అని జబాలియా ప్రాంత స్థానికురాలు ఒకరు ఏడుస్తూ చెప్పారు. ఖాన్ యూనిస్ పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ హమాస్, ఇజ్రాయెల్ సేనల మధ్య పరస్పర దాడులు జరుగుతున్నాయి.

గంటలు నిలబడినా పిండి దొరకట్లేదు

సెంట్రల్ గాజాలో ఆహార సంక్షోభం నెలకొంది. '' ఇంట్లో ఏడుగురం ఉన్నాం. ఐరాస ఆహార కేంద్రానికి రోజూ వస్తున్నా. ఆరేడు గంటలు నిలబడ్డా రొట్టెల పిండి దొరకట్లేదు. రెండు వారాలుగా ఇదే పరిస్థితి. పిండి కరువై ఉట్టిచేతుల్తో ఇంటికెళ్తున్నా'' అని అబ్దుల్లాసలాం అల్-మజ్దాలావాలా చెప్పారు. ఇప్పటిదాకా 17,700 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు.

కుక్కపిల్లను కొట్టిచంపాడు

భోపాల్: అటుఇటు తిరుగుతూ తన వద్దకు వచ్చిన కుక్కపిల్లను ఓ వ్యక్తి అత్యంత నిర్దయగా నేలకేసి కొట్టి చంపాడు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో జరిగిన ఈ దారుణం అక్కడి సీసీటీవీలో రికార్డయింది. వీడియో వైరల్‌గా మారడంతో వేలాది మంది.. ఆ వ్యక్తి కర్కశ చర్యపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లడంతో అరెస్ట్‌కు ఆదేశాలిచ్చారు. కఠిన శిక్ష పడేలాచూస్తామని ముఖ్యమంత్రి శివరాజ్ హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం గుణ జిల్లాలోని సుభాష్ కాలనీలో జరిగిన ఈ దారుణ ఘటన తాలూకు వీడియో చూసిన వారంతా వ్యక్తిని తీవ్రంగా శిక్షించాలంటూ పోస్టులు పెట్టారు. దాదాపు 30 ఏళ్ల వయసున్న ఆ వ్యక్తి ఆరుబయట కూర్చోగా అక్కడికి రెండు బుల్లి కుక్క పిల్లలు తిండి కోసం తచ్చాడుతూ వచ్చాయి. వాటిల్లో ఒకటి ఇతడి సమీపానికి రాగానే వెంటనే ఆగ్రహంతో కుక్క పిల్లను ఎత్తిపట్టుకుని నేలకేసి బలంగా కొట్టాడు. అక్కడి నుంచి లేచి వచ్చి దానిని కుడికాలితో పలుమార్లు తొక్కిచంపాడు. ఈ హృదయవిదారక దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ''ఇది నా హృదయాన్ని కలిచివేసింది. అతనికి కఠిన శిక్ష పడేలా చేస్తాం'' అని ముఖ్యమంత్రి చౌహాన్ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం । 11 । డిసెంబర్ । 2023

అర్జున కోసం..

ఆదివారం సాయంత్రం మైసూరు కలెక్టరేట్ ముందు దసరా ఏనుగు అర్జున చిత్రాలతో ప్రజల ప్రదర్శన. అర్జున మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలికితీయాలని కోరారు



న్యూస్‌రీల్

దొరికిన చిరుత



తుమకూరు: తుమకూరు తాలూకాలోని ఊరుకెరెమల్లెనహళ్ళి గ్రామంతో పాటు చుట్టుపక్కల పల్లెల్లో తిరుగుతూ ప్రజలు భయపెడుతున్న చిరుతపులి ఎట్టకేలకు దొరికింది. కొన్నిరోజుల నుంచి చిరుత గ్రామాల్లోకి చొరబడి కుక్కలను, మేకలను ఎత్తుకెళ్తోంది. దీంతో ప్రజల కంటికి నిద్ర లేకుండా చేసింది. ప్రజలు అటవీశాఖకు ఫిర్యాదు చేయడంతో కొన్నిచోట్ల బోనులు పెట్టారు. శనివారం రాత్రి ఒక బోనులో చిరుత చిక్కింది. మరో రెండు మూడు చిరుతలు సంచరిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

మినీ బస్సును ఢీకొన్న కారు

- ప్రేమికులు దుర్మరణం



నుజ్జునుజ్జయిన కారు

దొడ్డబళ్లాపురం: మినీ బస్సును కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రేమికులు మృతి చెందిన సంఘటన కనకపుర తాలూకా కెబ్బహళ్ళి వద్ద చోటుచేసుకుంది. దీపక్ (25), శైల (22)మృతి చెందినవారు. కెబ్బళ్లికి చెందిన దీపక్ శనివారం రాత్రి కారులో శైలతో కలిసి వస్తుండగా ముందు వెళ్తున్న మినీ బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో విఫలమై ఢీకొంది. శైల అక్కడికక్కడే మృతి చెందగా, దీపక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇద్దరూ ప్రేమికులని తెలిసింది.

ఇద్దరికి రూ.5 లక్షల టోపీ

- మైసూరులో సైబర్ మోసం

మైసూరు: సైబర్ మోసగాళ్లు ఇద్దరిని మోసపుచ్చి సుమారు రూ. 5 లక్షలు కొట్టేశారు. మైసూరు నగరంలోని కేఆర్ మొహల్లాకు చెందిన సునీల్ కుమార్, కువెంపు నగరకు చెందిన బీ.కె.మహాదేవ బాధితులు. సునీల్‌కుమార్‌కు దుండగులు తమ వాట్సాప్ గ్రూప్‌లోకి చేర్చుకున్నారు. తమ స్కీంలో డబ్బులు కడితే డబుల్ లాభం వస్తుందని నమ్మించి మొత్తం సుమారు 2.90 లక్షలను కాజేశారు. మరో ఘటనలో ఆన్‌లైన్‌లో పని ఇప్పిస్తామని బీ.కె.మహాదేవకు నమ్మించి అతని నుంచి 2.05 లక్షలను తమ ఖాతాకు వేయించుకొని ఫోన్లను స్విచాఫ్ చేశారు. బాధితులు ఇద్దరూ సెస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కొనసాగిన ఎన్‌ఐఏ దాడులు

బనశంకరి: ఎన్‌ఐఏ అధికారులు మహారాష్ట్రతో పాటు బెంగళూరు లో నిర్వహించిన దాడుల్లో ఉగ్ర గుట్టు రట్టయింది. పాలస్తీనా హమాస్ ఉగ్రవాద సంస్థ జెండాలు, తుపాకులు, ల్యాప్‌టాప్ తదితర వస్తువులు లభించాయి. పులకేశినగరలో అనుమానిత ఉగ్రవాది అలీఅబ్బాస్ ఫ్లాట్‌లో, ఉర్దూ పాఠశాలలో కొంత నగదు లభించినట్లు సమాచారం. అలీఅబ్బాస్‌ను విచారించిన ఎన్‌ఐఏ అధికారులు కీలక సమాచారం సేకరించారు. బెంగళూరు, మహారాష్ట్రతో కలిపి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో సోదాల్లో అనుమానితుల వద్ద ఒక పిస్టల్, రెండు ఎయిర్ గన్స్, రూ. 68 లక్షల నగదు హమాస్ జెండాలు, ఉగ్రవాద సాహిత్యం లభించాయి.

అతి వేగం.. పెను విషాదం



క్రేన్‌తో కారును వెలికితీస్తున్న దృశ్యం



మృత్యుకేళికి నిదర్శనంగా నిలిచిన కారు

- చెరువులోకి దూసుకెళ్లిన కారు
- నలుగురు యువకుల మృత్యువాత
- అందరూ బెంగళూరులో ఓ ప్రైవేటు వర్సిటీ విద్యార్థులు
- చిక్కబళ్లాపుర వద్ద దుర్ఘటన

చిక్కబళ్లాపురం: స్నేహితుని ఇంటికి వచ్చి సరదాగా గడిపిన యువతకు విధి వక్రించింది. కారు చెరువులోకి దూసుకెళ్లి నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన చిక్కబళ్లాపుర వద్ద చోటుచేసుకుంది.

దాబాలో భోజనం చేసి వెళ్తుండగా..

వివరాలు.. చిక్కబళ్లాపురం నగరానికి చెందిన ఆర్యన్ (22) బెంగళూరులోని ఓ ప్రముఖ ప్రైవేటు యూనివర్సిటీలో ఫార్మసీ చదువుతున్నాడు. బెంగళూరు భారతినగరవాసి వసంత్ (22), యలహంక వాసి పవన్ (22), చింతామణివాసి ఠాగూర్ (21) అదే విద్యాసంస్థలో ఇతర డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. వీరందరూ మంచి స్నేహితులు. శనివారం చిక్కలోని ఆర్యన్ ఇంటికి కారులో వచ్చారు. చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలు చూసుకుని శనివారం రాత్రి 9.30 గంటలకు ఓ దాబా హోటల్‌లో భోజనం చేశారు. తిరిగి కారులో ఆర్యన్ ఇంటికి బయల్దేరారు. అయితే హెచ్‌ఎస్ గార్డు ఆంజనేయస్వామి ఆలయం ముందు కారు అదుపు తప్పి అమాని గోపాలక్రిష్ణ చెరువులోకి పడిపోయింది.

అక్కడికక్కడే ముగ్గురు..

కారు వెనుకే వస్తున్న అంబులెన్స్ డ్రైవర్ చూసి వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి కాల్ చేశాడు. కొంతసేపటికే వారు చెరువు వద్దకు చేరుకుని కారును బయటకు తీశారు. నలుగురు యువకులు అప్పటికే నీట మునిగి అపస్మారకంలోకి వెళ్లిపోయారు. కారులో ఆర్యన్, పవన్, వసంత్ చనిపోయారు. ఠాగూర్ కొనఊపిరితో ఉండగా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా దారిలోనే మరణించాడు. ఆర్యన్ కుటుంబీకులు చేరుకుని హృదయ విదారకంగా రోదించారు. మృతదేహాలను చిక్క ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం తరువాత కుటుంబీకులకు అప్పగించారు. చిక్కబళ్లాపురం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

తీరంలో గల్లంతై.. ఇద్దరు మృతి



తీరంలో గాలింపు చర్యలు (ఇన్‌సెట్లో) యశ్విత్, యువరాజ్ (ఫైల్)

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా సోమేశ్వర అలిమకల్లు సమీపంలో శనివారం సముద్రం పాలైన ఇద్దరు యువకులు ఆదివారం ఉదయం శవాలై ఒడ్డుకు వచ్చారు. మంజేశ్వర కుంజత్తూరుకు చెందిన యశ్విత్ (18), కుంజత్తూరు మజల్‌కు చెందిన యువరాజ్ (18)తో సహా సోమేశ్వరంలో చదువుతున్న ఆరు మంది విద్యార్థులు శనివారం మధ్యాహ్నం 12:40 గంటలకు కాలేజీ ముగించుకొని సోమేశ్వర ఆలయానికి వెళ్లారు. భోజనం చేసి అలిమకల్లు వద్ద అరేబియా సముద్రంలోకి దిగారు. పెద్ద అలలు రావడంతో రాళ్ల మధ్య చిక్కుకున్నారు. నలుగురు అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకోగా, మిగతా ఇద్దరూ సముద్రంలోకి కొట్టుకుపోయారు. అప్పటినుంచి గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టగా ఎట్టకేలకు మృతదేహాలు దొరికాయి.

కారు, రూ.50 లక్షల నగదు దోపిడీ



కారును పరిశీలిస్తున్న పోలీసులు



ధ్వంసమైన కారు

- కొడగులో కేరళ కాంట్రాక్టరుకు షాక్
- మైసూరులో బంగారు అమ్మి వెళ్తుండగా ఘటన

మైసూరు: కేరళకు చెందిన కాంట్రాక్టర్‌పై కొడగు జిల్లాలో దోపిడీ దొంగలు దాడి చేశారు. కారు, అందులోని రూ. 50 లక్షల నగదుతో ఉడాయించిన ఘటన గోనికొప్పలు దగ్గర దేవరపుర గ్రామంలోని విరాజపేటె- మైసూరు జాతీయ రహదారిలో జరిగింది.

భార్య బంగారు నగలు కరిగించి..

వివరాలు.. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన కొడక్వాడ్ కోనారి హౌజ్‌వాసి శంజాద్, అతని స్నేహితుడు ఆప్ప. శంజాద్ కాంట్రాక్టరుగా పనిచేస్తుంటాడు. డబ్బులు అవసరమై తన భార్య వద్ద ఉన్న బంగారు నగలను స్థానికంగా కరిగించి కడ్డీలుగా చేసి దానిని మైసూరులో అమ్మాలని వచ్చాడు. మైసూరులోని ఒక బంగారు వ్యాపారికి సుమారు 750 గ్రాముల బంగారాన్ని అమ్మేసి రూ. 50 లక్షలు తీసుకుని మినీ కూపర్ కారులో శుక్రవారం రాత్రి గోణికొప్పలు మీదుగా కేరళకు బయల్దేరాడు. శనివారం తెల్లవారుజామున పొన్నంపేటె తాలూకాలోని గోనికొప్పలు- దేవపుర వద్ద గూడ్స్ వాహనంలో సుమారు 10 నుంచి 15 మంది దుండగులు వచ్చి కారును అడ్డుకున్నారు. శంజాద్, అప్పను కొట్టి కారులో నుంచి బయటకు లాగివేసి కారుతో సహా పరారయ్యారు. బాధితులు గోనికొప్ప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గాలింపు చేపట్టారు. అక్కడికి కొన్ని కిలోమీటర్ల దూరంలోని కొళతుడు వద్ద ఖాళీ కారును గుర్తించారు. దుండగులు కారును ఏమాత్రం పనికిరాకుండా ధ్వంసం చేశారు. కేసు విచారణలో ఉంది.

డేటా దొరకడం లేదు!

- ఉడుపి వీడియోల కేసులో అహ్మదాబాద్‌కు మొబైల్‌ఫోన్



యశవంతపుర: ఉడుపి ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలో బాత్‌రూంలలో విద్యార్థినుల వీడియోలు తీసిన కేసులో మొబైల్‌ఫోన్‌లోని డేటాను తిరిగి పొందడం సాధ్యం కావడం లేదని పోలీసులు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో బీజేపీ సర్కారు చివరిరోజుల్లో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక వర్గానికి చెందిన యువతి.. మరో వర్గానికి చెందిన యువతుల నగ్న వీడియోలను సేకరించి వైరల్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితులు ఫిర్యాదు చేయగానే యువతి ఫోన్‌లోని డేటాను తొలగించింది. సదరు యువతిపై కేసు నమోదు చేసి మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డేటా పునరుద్ధరణ కోసం బెంగళూరు, హైదరాబాదులో ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపారు. కానీ రిట్రీవ్ కాలేదంటూ ఈసారి అహ్మదాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఘటన జరిగి ఆరు నెలలు అవుతున్నా సాక్ష్యాలు దొరకడం లేదని పోలీసులు చెప్పడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులను తప్పించి కేసును మూసేయాలని ఇదంతా చేస్తున్నారని ఉడుపిలోని పలు సంఘాలు ఆరోపణలు చేశాయి.

50 మంది హస్తం ఎమ్మెల్యేలు వచ్చేస్తారు

- ఏమైనా జరగొచ్చు: కుమారస్వామి

యశవంతపుర: లోక్‌సభ ఎన్నికలు ముగియగానే 50 మంది ఎమ్మెల్యేలను తీసుకొస్తానని ఒక కాంగ్రెస్ నాయకుడు బీజేపీ కేంద్ర నాయకులకు చెప్పాడని జేడీఎస్ మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం హాసన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు 50 మంది ఎమ్మెల్యేలను తెస్తానని చెప్పిన సంగతి తెలిసింది. ఆయనెవరో చెప్పను. కానీ 50 మంది ఎమ్మెల్యేలను తీసుకురావడమంటే చోటా నాయకునితో ఇది సాధ్యమా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల తరువాత మహారాష్ట్రలో మాదిరిగా రాజకీయ మార్పులు ఇక్కడ జరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చని, ఎవరిలోనూ నీతి నిజాయతీ లేదని, స్వార్థమే ముఖ్యమై పోయిందని కుమార వాపోయారు. సీఎం సిద్ధరామయ్య కులం పేరుతో వైషమ్యాలను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కులగణన ఎవరికి కావాలి, ఆర్థిక, సామాజిక స్థితిగతుల గణన ఒకటి చాలన్నారు. ముస్లింలకు రూ. 10 వేలు కోట్లు ఇస్తే వద్దనను, కానీ హిందువుల్లో పేదలు, దళితులను మరిచిపోరాదన్నారు. కాంగ్రెస్‌లో బీకే హరిప్రసాద్‌తో పాటు ఎంతోమంది సిద్దరామయ్యను వ్యతిరేకిస్తున్నారని అన్నారు.



యోగా శిబిరం

తుమకూరు: నగరంలోని తుమకూరు వర్సిటీ ఆవరణలో యోగా విస్మయ ట్రస్టు, పలు సంఘాల సహకారంతో ఆదివారం నుంచి 17వ తేదీ వరకు సాగే యోగా శిబిరాన్ని ప్రారంభించారు. తొలిరోజే పెద్దసంఖ్యలో యోగాప్రియులు పాల్గొని ఆసనాలను ఆచరించారు. యోగా గురువు అనంత్‌జీ యోగా గొప్పదనం గురించి వివరించి ప్రాణాయామ చేయించారు.

కన్నడ మధురిమ..జానపద సంభ్రమ

బనశంకరి: యాంత్రిక జీవితం ఒత్తిడిలో జీవిస్తున్న బెంగళూరు నగరవాసులకు రాష్ట్రంలోని వైవిధ్య జానపద కళలు సాంత్వననిస్తాయని కన్నడ సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్ తంగడగి అన్నారు. ఆదివారం నగరంలో రవీంద్ర కళాక్షేత్రలో నమ్మజాత్ర జానపద సంభ్రమను మంత్రి ప్రారంభించారు. బెంగళూరులో కన్నడ భాష వినియోగం తగ్గిపోతోందని, పరభాషల వ్యామోహాన్ని వీడితే కన్నడ వికాసం సాధ్యమని అన్నారు. పంజాబ్ నుంచి వచ్చిన నటి పూజాగాంధీ కన్నడ నేర్చుకుని మాట్లాడటం అభినందనీయమన్నారు. పూజాగాంధీ మాట్లాడుతూ కన్నడ అత్యంత సుందరమైనదని, తనకు జీవితం ఇచ్చిందని తెలిపారు. కన్నడనాడులో ప్రతి ఒక్కరూ కన్నడ పట్ల గౌరవం ఆదరాభిమానం పెంచుకోవాలని తెలిపారు. విధానసౌధ వద్ద నమ్మజాత్రను సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పేరుపొందిన జానపద కళల ఊరేగింపులు ఆకట్టుకున్నాయి.



విధానసౌధ ముందు జానపద సంభ్రమలో పెద్ద తప్పెట్లతో ప్రదర్శన



కన్నడ మాత శకటానికి సీఎం, మంత్రి పుష్పాంజలి



లంబాడీ కళాకారిణుల నృత్యాలు

కాంగ్రెస్ సర్కారుపై పోరాటం: కేంద్రమంత్రి

మండ్య: బీజేపీ, జేడీఎస్‌ల కలయిక వల్ల ఎన్‌డీఏ బలోపేతమవుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ అక్రమ పరిపాలన పైన పోరాటానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి కిషన్‌పాల్ గుర్జార్ చెప్పారు. ఆదివారం మండ్యలో బీజేపీ ఆఫీసులో మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత సంకల్ప యాత్ర ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, మోదీ పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఆ పథకాల గురించి ప్రజలకు చెప్పడం ఓత పాటు వారికి అందేలా చేయడం ప్రతి ఒక్క కార్యకర్త పని అన్నారు.

బస్సులో పాము బుస్



పామును పట్టుకున్న స్నేక్ రఘు

మైసూరు: బస్సులోకి పాము చేరిన సంఘటన సోమవార పేటెలో ఉన్న ప్రైవేట్ బస్టాండులో జరిగింది. కోడ్లిపేటె నుంచి సోమవారపేటె మీదుగా విరాజపేటెకు ప్రైవేటు బస్సు బయల్దేరింది. సోమవారపేటె బస్టాండులో బస్సు నిలిచినప్పుడు ఇంజిన్ దగ్గర పాము కనిపించింది. దాంతో ప్రయాణికులు భయంతో బస్సు నుంచి పరుగులు తీశారు. స్థానికులు స్నేక్ రఘును పిలిపించగా, ఆయన వచ్చి పామును పట్టుకుని దూరంగా వదిలిపెట్టాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

Authirized Company Directly Recruiting Counselors, Recruitment Officers, Associate Trainees, Business Sales Mgrs... Any Deg, age up to 35 yrs, Male/Female, Income Par with Industry Contact: (+91) 94480 17666 [C-777259]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రాజకీయాలు వద్దు, సినిమాలే ముద్దు

బనశంకరి: తన తండ్రి బాటలోనే తాను సినిమాల్లో నటించడం వరకు మాత్రమేనని, తనకు రాజకీయాలు వద్దని హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ స్పష్టం చేశారు. లోకసభ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీకే.శివకుమార్ వ్యాఖ్యలపై స్పందించిన శివరాజ్‌కుమార్ తన తండ్రి ఇచ్చిన దారిని ఎంచుకుని కొనసాగుతానని, ప్రస్తుతానికి రాజకీయాలకు దూరమని చెప్పారు. బంగారప్ప కుమార్తె మా ఇంటి కోడలు గీతకు రాజకీయాలపై ఆసక్తి ఉంటే రాజకీయాల్లోకి రావచ్చని, భార్యకు అన్ని విధాలుగా సహకరించడం భర్త విధి అన్నారు. గీత ఇష్టపడితే ఎన్నికల్లో అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. 75వ ఈడిగ సముదాయ కార్యక్రమంలో ఉన్నత వ్యక్తులు ఉండాలి కాని లేరని వారి ఆశీర్వాదం ఉందన్నారు. తమ డిమాండ్లు సిద్దరామయ్య ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.



వనితల ఉల్లాసం

మండ్య: మండ్య జిల్లాలోని కేఆర్ పేటె పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆదివారం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిరంతరం పని ఒత్తిడిలో ఉండే వనితలు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆడిపాడారు. జోక్‌లతో నవ్వించడం, కుప్పి గెంతులు, తాడు లాగే ఆటలు తదితరాల్లో సరదాగా తలపడ్డారు.



వివిధ క్రీడా పోటీల్లో మహిళలు

బీజేపీ నేతల ఇళ్లలోనూ సోదాలు చేయాలి : సీఎం

శివాజీనగర: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎస్.నిజలింగప్ప, కర్ణాటక రాష్ట్ర అభివృద్ధికి అపారమైన సేవలందించారని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఆదివారం నిజలింగప్ప జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కాగా, దేశంలో కాంగ్రెస్‌వారినే లక్ష్యంగా పెట్టుకొని ఐటీ దాడులు జరుగుతున్నాయని, బీజేపీవారిపై ఐటీ దాడి జరిగితే లెక్కలేనంత నగదు లభిస్తుందని సీఎం అన్నారు. ఎవరి ఇంటిలో నగదు లభించినా అది తప్పే. చట్టపరంగా ఎవరు తప్పు చేసినా వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. ఇందులో బీజేపీవారికి ఎందుకు మినహాయింపు ఇస్తున్నారో తెలియడం లేదని దుయ్యబట్టారు.

ఇంటి ముందున్న గంధం చెట్ల చోరీ



నరికివేసిన ఓ చెట్టు

శివమొగ్గ: ఇంటి ముందు ఉన్న రెండు శ్రీగంధం చెట్లను దుండగులు నరికి ఎత్తుకెళ్లిన సంఘటన శివమొగ్గ జిల్లాలోని సాగర పట్టణంలోని రాంపుర లేఔట్‌లో జరిగింది. పర్యావరణ కార్యకర్త గౌతమ్ ఇంటి ఆవరణలో గంధం చెట్లను పోషిస్తున్నాడు.

ఈ నెల 6వ తేదీన తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో దుండగులు రంపాలతో చెట్లను కోసి చోరీ చేశారు. రాత్రి వరకూ ఉన్న చెట్లు పొద్దున చూడగానే లేకపోవడంతో గౌతమ్ ఆవేదనకు లోనయ్యాడు. ఇందులో ఒక చెట్టు వయసు 22 సంవత్సరాలు, మరో చెట్టుకు 18 సంవత్సరాలు ఉన్నాయి. అటవీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గౌతమ్ తెలిపారు. గంధం చెట్లను పెంచుతున్న వారిలో ఈ చోరీ గుబులు రేకెత్తించింది.

క్లుప్తంగా

నీటిపారుదలకు పెద్దపీట వేయాలి



ముఖ్యమంత్రి చంద్రును సన్మానిస్తున్న కమ్మరచేడుమఠం స్వామీజీ తదితరులు

కంప్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయానికి కావాల్సిన నీటిపారుదల పథకాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు డిమాండ్ చేశారు. తాలూకాలోని నందిపురలో మఠాధీశుల ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటిపారుదల చింతన్ మంతన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఎక్కువగా ఉన్నా నీటిపారుదల సౌకర్యం పొందలేక పోయారన్నారు. పక్కనే తుంగభద్ర నది ఉన్నా సద్వినియోగం కావడం లేదన్నారు. ప్రభుత్వం రైతుల శ్రేయస్సుపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు.

దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే బలం



ప్రారంభిస్తున్న బీఆర్‌సీ అధికారి శివకుమార్

హొసపేటె: దివ్యాంగులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని విద్యా శాఖ బీఆర్‌సీ అధికారి శివ కుమార్ తెలిపారు. ఆయన శనివారం బీఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా పాఠశాలల్లో సుమారు 500 మంది దివ్యాంగ పిల్లలు చదువుతున్నారన్నారు. దివ్యాంగ తల్లిదండ్రులు దివ్యాంగుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని కోరారు. దివ్యాంగులను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలన్నారు. వనస్ఫూర్తి వికలచేతన సంఘం నేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వసతి సౌకర్యానికి వినతి

కంప్లి: తాలూకాలోని నెల్లుడి గ్రామ పరిధిలో సర్వే నెం-133/బీ-1లోని 4.19 సెంట్ల ప్రభుత్వ భూమిలో వసతి సదుపాయం కల్పించాలని కర్ణాటక మాదిగ రక్షణా వేదిక, కర్ణాటక జనశక్తి, భూ వసతి పోరాట సమితి పదాధికారులు తహసీల్దార్ శివరాజ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం మాదిగ రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరియప్ప గుడిమని మాట్లాడుతూ తమ పోరాటం భూ, వసతి వంచితుల కోసమని, తగిన న్యాయం చేయాలని కోరారు.

లక్ష్మీవేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

రాయచూరు రూరల్: నగరంలోని బెస్తవారిపేటలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా 24 దీపాలను వెలిగించి మహాలక్ష్మి, సరస్వతి, మహాదుర్గా దేవిలను ఆహ్వానించి షోడస, అష్టోత్తర నామంతో గాయత్రి జపంతో విశేష పూజలను నెరవేర్చినట్లు ఉప్పార సమాజం అధ్యక్షుడు ఈరణ్ణ తెలిపారు.

రక్తదానం చేసిన శునకం

- మరో కుక్కకు ప్రాణదానం



మరో శునకానికి రక్తం అందిస్తున్న శునకం

సాక్షి, బళ్లారి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మనుషులే కాదు, శునకాలు కూడా కోరుకుంటున్నాయి. అదే మాదిరిగా ఓ శునకం రక్తదానం చేసి మరో శునకం ప్రాణాన్ని కాపాడింది. కర్ణాటకలో హావేరి జిల్లా ఉల్లత్తి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తికి చెందిన శునకానికి సుస్తీ చేస్తే పశు వైద్యులకు చూపించాడు. శునకానికి రక్తహీనత ఉందని, తక్షణం రక్తం అవసరమని చెప్పారు. అదే గ్రూపు శునకం రక్తాన్ని తెప్పించి ఇస్తే చికిత్స చేస్తామని చెప్పారు. దీంతో నాగరాజు సోషల్ మీడియాలో తన కుక్క బాధను ఏకరువు పెట్టాడు. ఇది తెలుసుకొని బొమ్మనహాళ్ గ్రామానికి చెందిన రంజిత అనే మహిళ తన శునకం రక్తాన్ని ఇచ్చేందుకు ఒప్పుకొని ఆ దిశగా స్థానిక హానగల్ తాలూకాలోని అక్కిఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క రక్తాన్ని దానం చేశారు.

పత్తి ధర వెలవెల.. రైతు విలవిల



రాయచూరులోని నూతన పత్తి మార్కెట్ ప్రవేశ ద్వారం



టెండర్ కోసం వేచి ఉన్న పత్తి లోడ్ వాహనాలు

- కళ్యాణ కర్ణాటకలో పత్తి దిగుబడి ఘనం
- మార్కెట్‌లో తెల్ల బంగారానికి ధర అధమం

రాయచూరు రూరల్: తెల్ల బంగారాని(పత్తి)కి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు తల్లడిల్లిపోతున్నారు. గత ఏడాది క్వింటాల్‌కు రూ.8,500 నుంచి రూ.9000 ధర ఉండగా ఈసారి రూ.6,800 నుంచి రూ.7100 ధర పలుకుతోంది. నూతన పత్తి మార్కెట్లో ధరను ప్రకటించిన మిల్లు యజమానులు క్వింటాల్‌కు రూ.300 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అధికంగా తెలంగాణలోని కృష్ణా, మక్తల్, నారాయణపేట, మద్దూరు, ఊట్కూరు, గద్వాల, ధరూరు, నందిన్ని, బలిగేర, అయిజ, ఆంధ్రప్రదేశ్‌లోని మాధవరం తదితర ప్రాంతాల నుంచి అధికంగా పత్తి బేళ్లు వస్తున్నాయి. ప్రతి నిత్యం హైదరాబాద్–రాయచూరు రహదారిలో పత్తితో లారీలు, ట్రాక్టర్లు, మినీ లారీలు, జీపులు, క్యాబ్‌లతో రైతులు పత్తిని తీసుకు రావడంతో ట్రాఫిక్ సమస్య అధికమైంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక రైతుల ముఖాల్లో కళ లేదు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ జిల్లాల్లోని నదుల్లో నీరున్నా, యాదగిరి, కలబుర్గి జిల్లాల్లో నదుల నీరందక రైతులు భూముల్లో వేసుకున్న పంటల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. రైతులు జిల్లాలో లక్షా 70 వేల ఎకరాల్లో పత్తి, 86 వేల ఎకరాల్లో కందులు సాగు చేశారు.



ఆదివారం రాత్రి ఐటీ సిటీలోని కమర్షియల్ వీధిలో బెంగళూరు హబ్బ ఊరేగింపు దృశ్యం



బెంగళూరు రవీంద్ర కళాక్షేత్ర వద్ద కర్ణాటక సంభ్రమ ఉత్సవాలలో ప్రదర్శనలు ఇచ్చి అలసి సొలసి విశ్రాంతి తీసుకుంటున్న కళాకారులు

మానవ హక్కుల్ని కాపాడతాం



ప్రతిజ్ఞ చేస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

హొసపేటె: మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయ హాలులో జిల్లా పాలనాధికారి ప్రతిజ్ఞ చేశారు. కర్ణాటక రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఆదేశాల మేరకు జిల్లాధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మానవ హక్కుల్ని కాపాడతామని తహసీల్దార్ మేఘా ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాధికారి కార్యాలయ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజలింగప్ప జయంతి



ప్రతిమకు పూలమాల వేసిన స్థానికులు

రాయచూరు రూరల్: నగరంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి దివంగత నిజలింగప్ప 121వ జయంతిని ఆచరించారు. నిజలింగప్ప కాలనీలోని నిజలింగప్ప ప్రతిమకు సీనియర్ సిటిజన్ వీరనగౌడ పూలమాల వేసి ముఖ్యమంత్రిగా నిజలింగప్ప అందించిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా నారాయణ రెడ్డి, సిద్దారెడ్డి, భీమరెడ్డి, అమరేగౌడలున్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరు మృతి



మృతుడు రాజు (ఫైల్)

మండ్య: మండ్య నగరంలోని స్వర్ణసంద్ర దగ్గర ఫైర్ స్టేషన్ ముందు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దూరు తాలూకాలోని గెజ్జలగెరెకి చెందిన రాజు (29) అనే యువకుడు మృతి చెందాడు. మండ్యలో పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళుతున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. మండ్య నగర ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

జీపును ఢీకొన్న బస్సు, ఒకరు మృతి

బనశంకరి: కార్కళ పడుబిద్రి జాతీయ రహదారిలో ప్రైవేటు బస్, జీపు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా పలువురు గాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం ప్రైవేటు బస్, జీపును ఓవర్ టేక్ చేసే సమయంలో అదుపుతప్పి జీప్‌ను ఢీకొనింది. జీపులోని ఒకరు మృతిచెందగా పలువురు గాయపడటంతో 108 అంబులెన్స్‌లో కార్కళ తాలూకా ఆసుపత్రికి తరలించారు.

హనుమ యాత్రకు ఘన స్వాగతం



హనుమయాత్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మాలూరు: తాలూకాలోని కేజీ హళ్లిలో ఆదివారం అయోధ్య శ్రీరామ కార్యానికి వెళుతున్న హనుమయాత్రకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వాహనంలోని హనుమాన్ విగ్రహానికి గ్రామంలోని వినాయక ఆలయం వద్ద విశేషంగా ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.హరీష్ పూజలను చేసి అష్టోత్తర, హనుమాన్ చాలీసాను పఠించారు. హిందూ కార్యకర్తలు హనుమాన్ యాత్రకు పుష్పాంజలి సమర్పించారు. కేజీహళ్లి జీపీ అధ్యక్షుడు కేవీ మంజునాథ్, నారాయణ స్వామి, అర్జున్, దినేష్, శ్రీధర్, మెడికల్ మునిరాజు పాల్గొన్నారు.

అంకసముద్రలో విదేశీ పక్షుల సందడి



అంకసముద్రకు వలస వచ్చిన వివిధ రకాల పక్షులు



హొసపేటె: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని తుంగభద్ర నది తీరాన ఉన్న అంకసముద్రలో విదేశీ పక్షులు సందడి చేశాయి. ప్రస్తుతం చలికాలం ప్రారంభం కావడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి పక్షులు వలస రావడంతో అంకసముద్రం వివిధ రకాల పక్షులతో కనువిందు చేస్తోంది. సూర్యోదయానికి ముందు ఇక్కడ వాతావరణ దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా మారింది. సుమారు 244 ఎకరాల ప్రదేశంలో ఉన్న ఈ అంకసముద్రలో ప్రతి ఏటా వివిధ ప్రాంతాల నుంచి పక్షులు వలస రావడం ఆనవాయితీ. చలికాలం ముగింపు అనంతరం వేసవి ప్రారంభ సమయంలో ఇక్కడకు వచ్చిన వలస పక్షులు తిరిగి తమ సొంత గూటికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహారం కోసం అన్వేషిస్తాయి. సూర్యాస్తమయం అనంతరం అంకసముద్రలో నివాసముంటాయి. నార్తర్న్ శెవలర్ గార్గేవి, ఉడ్‌శాండ్ పైపర్, కామన్ ప్యాండ్ పైపర్, పేంటెడ్ స్టార్క్, స్పాట్ బిల్డ్ డక్, పెలికాన్, గ్రే హెరాన్, నైట్ హెరాన్, క్యాటర్ ఈ గ్రేట్‌తో పాటు మొత్తం 150 పైగా రకాల వివిధ అందమైన అతిథి పక్షులు ఇక్కడకు వలస వచ్చాయి. ఇక్కడ ఉన్న పక్షులను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి రావడంతో అంకసముద్ర పరిసరాలు పర్యాటకుల సందడితో కళకళలాడుతున్నాయి.

ఇది కరప్షన్, క్యాపిటేషన్ సర్కారు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్లీ: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు సీసీ సర్కారు ఉన్నట్లే, సీసీ అంటే కరప్షన్, క్యాపిటేషన్ అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో పరస్పరం బురదజల్లుకోవడం చూస్తుంటే అంతా తేటతెల్లం అవుతోందన్నారు. ఈ విషయంలో తానేమీ ఎక్కువ మాట్లాడబోనన్నారు. కాంగ్రెస్‌లో అంతా సరిగ్గా లేదన్న విషయాన్ని బీకే.హరిప్రసాద్ స్పష్టంగా చెప్పారన్నారు.సర్కారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిందన్నారు. తన నియంత్రణ కోల్పోతోందన్నారు. పార్టీలో పరస్పరం బురదజల్లుకోవడం ఆగలేదన్నారు. అసమ్మతి వల్ల పాలనపై పరిణామాలు పడ్డాయన్నారు. అందుకే ఇది సీసీ సర్కారు అని ఆయన ఎద్దేవా చేశారు. ఇదే సర్కారు అభివృద్ధి అన్నారు. ప్రధాన మోదీ కేంద్రం తరపున 5 కేజీల బియ్యం ఇస్తుంటే రాష్ట్రంలోని పాలనకు ఒక కేజీ బియ్యాన్ని కూడా దానికి అదనంగా ఇవ్వడం లేదు. దీన్నే అన్నభాగ్య పథకం అంటూ అసత్య ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బెంగళూరు ప్యాలెస్‌లో జరుగుతున్న ఈడిగ సమావేశం గురించి మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయమై హరి ప్రసాద్ మాట్లాడారన్నారు. కాంగ్రెస్‌లో తనకు వ్యతిరేకంగా రాజకీయాలు చేసే వారికి గురించి మాట్లాడే సత్తా హరిప్రసాద్‌కు లేదన్నారు. అందుకే ఆయన బీజేపీని నిందిస్తున్నారన్నారు. ఈ మతల బ్‌లు చేసేది సిద్దరామయ్యేనని, మాట్లాడే శక్తి హరి ప్రసాద్‌కు లేదని అన్నారు. ఆయన సర్కారుపై ఎంత మేర రేగుతారో దాన్ని బట్టి సమాధానం ఇస్తానని ప్రహ్లాద్‌జోషి కాంగ్రెస్ రాజకీయాల గురించి తనదైన శైలిలో మండిపడ్డారు.

స్వామీజీలకు రాజకీయాలు వద్దు



మాట్లాడుతున్న నిజగుణానంద స్వామీజీ

హుబ్లీ: స్వామీజీలు రాజకీయాలకు దూరంగా ఉండాలని, మఠాన్ని రాజకీయాల్లోకి లాగరాదని నిజగుణానంద స్వామీజీ హితవు పలికారు. ధార్వాడలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. డీకే శివకుమార్ సీఎం అవుతారన్న నొణవినకెరె స్వామీజీ వ్యాఖ్యలపై స్పందించిన ఆయన లింగాయతులు మాత్రమే స్వామీజీలు కాదు, మౌల్వీలు, ఫాదర్లతో పాటు ఏ మత పెద్దలు రాజకీయాల్లోకి ప్రవేశించరాదన్నారు. ధర్మం, సంస్కృతి, సంస్కారాల గురించి ప్రజలకు బోధించడమే తమ కర్తవ్యం అన్నారు. నేటి సమాజంలో సమతుల్యత లోపించిందన్నారు. మఠాధీశులు రాజకీయాల్లోకి రాకూడదనేది సత్యం అన్నారు. రాజకీయ నేతలకు స్వామీజీలు మార్గదర్శనం చేయవచ్చు కానీ స్వామీజీలు ఎప్పటికీ రాజకీయ నేతలను బుజ్జగించరాదన్నారు. స్వామీజీల సేవలను పొందినప్పుడు రాజకీయ నేతలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. రాజకీయ నేతలతో ఉన్నప్పుడు స్వామీజీలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్ని పార్టీల వారు మఠాలకు వస్తారు. వారితో స్వామీజీలు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మఠాధీశులను రాజకీయాల్లో దుర్వినియోగపరచరాదన్నారు. ఆ సోయ(ప్రజ్ఞ) నేతలకు ఉండాలన్నారు. ఏ మఠాధిపతికి ఒత్తిళ్లు ఉండరాదన్నారు.

క్రీడలతో పోటీతత్వం



మాట్లాడుతున్న ఎస్ఐ గీతాంజలి షిండే

కంప్లి: పిల్లలు పాఠాలతో పాటు ఆటల్లో పాల్గొనడం వల్ల పోటీ మనోభావం పెంపొందుతుందని, శారీరక ఎదుగుదల, ఆరోగ్య వృద్ధికి దోహదపడుతుందని ఎస్ఐ గీతాంజలి షిండే తెలిపారు. కొట్టూరు పట్టణంలోని సీబీఎస్ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడోత్సవాలను ప్రారంభించి ఆమె మాట్లాడారు. పిల్లల అభ్యసన సర్వతోముఖ అభివృద్ధికి, మానసిక ఆరోగ్యానికి క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. గెలుపు ఓటమి కంటే పాల్గొనడం ముఖ్యం అన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరు బైకిస్టుల దుర్మరణం



మరణించిన యువకులు

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరు తాలూకాలో బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. సింధనూరు తాలూకా ముద్దాపుర వద్ద మల్లాపురకు చెందిన హనుమంతప్ప(23), దేవరాజ్(24)లు మస్కి నుంచి సింధనూరుకు బైక్‌పై వెళుతుండగా ముద్దాపుర కేఈబీ వద్ద వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ప్రమాదం జరిగిన వెంటనే సింధనూరు డీఎస్పీ తళవార్, సీఐ వీరారెడ్డి, దుర్గప్ప పరిశీలించి మృతదేహాలను పంచనామా కోసం సింధనూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కోలారు వార్తలు...

భక్తిశ్రద్ధలతో ధాత్రిహోమం



ధాత్రి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: నగరంలోని కోటలో ఉన్న శృంగేరి శారదా మఠంలో ఆదివారం ధాత్రి హోమం, మహా రుద్ర యాగాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ధాత్రి హోమంలో భాగంగా ఉదయం శారదా దేవి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. ధాత్రి హోమంలో శంకర మఠం, బ్రాహ్మణ సంఘం పదాధికారులు, ఋత్వికులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారానికే వికసిత్ భారత్ యాత్ర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేసేందుకు వికసిత్ భారత్ యాత్రను ప్రారంభించినట్లు ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. ఆదివారం తాలూకాలోని హోళూరులో వికసిత్ భారత సంకల్ప యాత్రను ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో మద్యం దుకాణాలను తెరుస్తోందన్నారు. చిల్లర దుకాణాల్లో కూడా మద్యం విక్రయాలు సాగుతుండడంతో యువత మద్యానికి బానిస అవుతున్నారని ఆరోపించారు. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్న ప్రధాని 2024లో మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. యావత్ ప్రపంచానికి కోవిడ్ టీకాలను అందించిన ఘనత నరేంద్ర మోదీనేనన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా కేంద్రం కోలారు జిల్లాకు రూ.1880 కోట్లు ఇచ్చిందన్నారు. 1600 పైగా గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు సాగుతున్నాయన్నారు. పీఎం సహాయనిధి కింద జిల్లాలో 12 వేల మంది వీధి వ్యాపారులకు తలా రూ.10 వేల చొప్పున భద్రత లేని రుణాలు అందించామన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని తిరిగి ప్రధానిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ ప్రక్రియతో సమయం, డబ్బు ఆదా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

కోలారు: లోక్‌అదాలత్‌ల్లో రాజీ ప్రక్రియ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని న్యాయమూర్తి జీపీ మంజునాథ్ తెలిపారు. ఆదివారం నగరంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన 4వ జాతీయ లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్న చిన్న కేసులు కోర్టు వరకు రావడం వల్ల కోర్టు సమయం ఎంతో వృథా అవుతోంది. ఇలాంటి వాటిని రాజీ చేసుకోవడం ద్వారా ఎంతో ఉపయోగం ఉందని, కోర్టు సమయం కూడా వృథా కాదన్నారు. ప్రస్తుతం సంవత్సరంలో నాలుగోసారి నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌లతో ఇంతవరకు 20 వేల కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రాజీ ప్రక్రియ ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలన్నారు. జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్య కార్యదర్శి సునీల్ ఎస్.హొసమని, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.మునేగౌడ, కార్యదర్శి భైరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కేజీఎఫ్: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని జిల్లా సెషన్స్ జడ్జి గణపతి గురుసిద్ధ బాదామి తెలిపారు. ఆదివారం నగరంలోని రోటరీ క్లబ్‌లో మాదక వస్తు రహిత కేజీఎఫ్ నిర్మాణానికి నిర్వహించిన 10కె మారథాన్‌లో ఆయన మాట్లాడారు. నిత్యం రాత్రి త్వరగా పడుకుని తెల్లవారగానే నిద్ర లేచి వ్యాయాయం చేయాలన్నారు. ప్రముఖంగా పౌష్టిక ఆహారాన్ని సేవించాలన్నారు. ఉదయం లేవగానే వాకింగ్, జాగింగ్ చేయడాన్ని పరిపాటిగా చేసుకోవాలన్నారు. ఉత్తమ జీవిత విధానాలను అలవర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవితం సాగించవచ్చన్నారు. సీనియర్ జడ్జి ముజఫర్ ఎ మాంజరి మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. ఒకసారి మాదక ద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్‌లో వాటిని వీడడం చాలా కష్టకరం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ, జడ్జిలు ఆర్ఎం నదాఫ్, ఆర్ మంజునాథ్, వినోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ మనోభావం పెంచుకోవాలి



విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందించిన దృశ్యం

కోలారు: విద్యార్థులు శాస్త్రీయ మనోభావాన్ని పెంచుకోవాలని, విజ్ఞాన పోటీల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని మొరార్జీ దేశాయి వసతి పాఠశాల ఉపాధ్యాయిని సుగుణ తెలిపారు. ఆదివారం తాలూకాలోని సోమయాజులపల్లికి చెందిన మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన వస్తు ప్రదర్శన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోటీల్లో గెలుపు ఓటములను విద్యార్థులు సమానంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి వస్తు ప్రదర్శన పోటీల్లో విజేతలై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఎంఎస్ హేమంత్, ఆర్ యశ్వంత్ కుమార్‌లకు ప్రమాణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు వి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పసంద్రలో కనకదాస జయంతి


కనకదాస చిత్రపటానికి ఎమ్మెల్యే పూజలు

కృష్ణరాజపురం: హోసకోటె నియోజకవర్గం లోని అప్పసంద్ర గ్రామంలో ఆదివారం దాస శ్రేష్ఠ కనకదాస 536వ జయంతి వేడుకలను ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు, నగదు చోరీ

మైసూరు: ఓ ఇంటిలో చోరీ జరిగిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బిళికెరె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుధా అనే మహిళ పొరుగూరికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంటి తాళం బద్దలు కొట్టి ఇంటిలో ఉన్న రూ. 4.5 లక్షల విలువైన బంగారు, నగదు చోరీ చేశారు. ఇంటికి వచ్చిన బాధితురాలు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ పర్సులో బంగారం..

మహిళ పర్సులో 55 గ్రాముల బంగారం నగలు చోరీ అయిన ఘటన హుణసూరు పట్టణంలోని బస్టాండులో చోటు చేసుకుంది. హెబ్బాలు గ్రామానికి చెందిన సునంద బాధితురాలు. ఈమె టికెట్ తీసుకోవడానికి పర్సులో చూడగా అందులో ఉన్న 55 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ

గౌరిబిదనూరు: తాలూకాలో ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు. తొండేబావి, అలకాపుర, హోసూరు, ముదుగెరె, కాదలవేణి, గదరె తదితర గ్రామాలలో అంగనవాడి భవనాలు, సిసి రోడ్లు, మురికి కాల్వలు, గ్రంథాలయాల భవనాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల మనసులు సూక్ష్మమైనవని, వారికి తగ్గట్టుగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో , పంచాయతీరాజ్ అధికారి రఘునాథ్, ఇంజనీర్ చలువరాజ్, లక్ష్మణరావ్, నారాయణస్వామి, కాంతరాజు, నరసింహమూర్తి, జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల ధర్నా



మండ్య: కాంగ్రెస్ నేతల వద్ద కోట్ల కొద్ది అక్రమ నగదు బయట పడుతుండటంపై కేంద్ర మంత్రి కిశన్‌పాల్ గుర్జర్ ఆధ్వర్యంలో మండ్య నగరంలో ఆదివారం బీజేపీ నేతలు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. మండ్య నగరంలోని జేసీ సర్కిల్ వద్దకు చేరుకున్న కార్యకర్తలు, నాయకులు, రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం ఏర్పడిందని, కాంగ్రెస్ పార్టీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమేశ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు ధీరజ్‌సాహు ఇంటిపై మూడు రోజుల పాటు ఐటీ అధికారులు దాడి చేయగా ఇప్పటికే వందల కోట్ల నగదు దొరికిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేటుగాళ్లు అరెస్ట్

యశవంతపుర: పెళ్లి కుదిరిస్తామని నమ్మించి విశ్రాంత సైనికాధికారి నుంచి లక్షల నగదు వసూలు చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన కొడగులో జరిగింది. ఫైజల్, అబ్దుల్ బషీర్, సాదిక్‌లను మడికేరి నగర పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన జాన్ మ్యాథ్యూ అవివాహితుడు. సైన్యాధికారిగా పని చేసి రిటైర్ అయ్యారు. ముగ్గురు నిందితులు జాన్‌కు పరిచయం అయ్యారు. కొద్ది రోజుల తరువాత పెళ్లి చేస్తామని నమ్మించి లక్షలు డబ్బులను తీసుకున్నారు. ప్లాన్ ప్రకారం ఒక మహిళతో జాన్‌కు సరళంగా పెళ్లి చేశారు. అనంతరం పెళ్లి ఫొటోలను తమ వద్ద పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేయటం ప్రారంభించారు. నిందితులు రూ.8 లక్షలు నగదుతో పాటు, రూ.2.10 లక్షలు విలువగల చెక్కులు తీసుకున్నారు. జాన్ ఫిర్యాదు ఆధారం మడికేరి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

నేటి నుంచి బసవనగుడి శెనక్కాయల జాతర




ఆదివారం బసవనగుడి దొడ్డ బసవణ్ణ ఆలయం వద్ద శెనక్కాయల కొంటున్న యువతులు, పరుషలో నగరవాసుల రద్దీ, శెనక్కాయలను రుచిచూస్తున్న మంత్రి రామలింగారెడ్డి తదితరులు

- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి రామలింగారెడ్డి
- జాతరకు భారీగా తరలివస్తున్న నగర వాసులు

బనశంకరి: కార్తీక మాసం చివరి సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించే బసవనగుడి దొడ్డబసవణ్ణ శెనక్కాయల పరుష ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఉదయం దేవదాయశాఖమంత్రి రామలింగారెడ్డి పరుషను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి శెనక్కాయలను రుచి చూశారు. దొడ్డబసవణ్ణకు శెనక్కాయలతో అలంకరణ చేపట్టగా భక్తులు బారులు తీరి బసవణ్ణ, దొడ్డగణపతిని దర్శించుకున్నారు.

శెనక్కాయల రాసులు:

బుల్‌టెంపుల్ రోడ్డుకు ఇరువైపుల శెనక్కాయల రాసులు దర్శనమిస్తున్నాయి. కనకపుర, దొడ్డబళ్లాపుర, రామనగర, చిక్కబళ్లాపుర, కోలారు, మాగడి, మైసూరు, మండ్య, తుమకూరు జిల్లాల నుంచి రైతులు, వ్యాపారస్తులు శెనక్కాయలను పరుషకు తీసుకువచ్చారు. ఆదివారం సెలవురోజు కావడంతో కుటుంబ సమేతంగా నగరవాసులు తరలివచ్చి శనక్కాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. బసవనగుడి బుల్‌టెంపుల్‌రోడ్డులో పల్లె వాతావరణం కనిపించింది. దేవస్థానం చుట్టుపక్కన పిల్లలు ఆటవిడుపు కోసం జెయింట్‌వీల్, స్కూటర్ రైడింగ్, వివిధ క్రీడా యంత్రాలను ఏర్పాటు చేశారు. శనక్కాయలు కొనుగోలు చేసే వారు దుస్తులు, బట్టలతో తయారు చేసిన సంచులు తీసుకురావాలని ప్రజలను జాగృతం చేస్తున్నారు. శనక్కాయల పరుషను సోమవారం ఉదయం దొడ్డబసవణ్ణకు ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం ఆలయం ముందు దొడ్డబసవణ్ణకు శెనక్కాయలతో తులాభారం నిర్వహించి పరుషను లాంఛనంగా ప్రారంభిస్తారు. పరుష రెండురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. లక్షలాది మంది పరుషకు విచ్చేసే అవకాశం ఉంది. పరుషలో శెనక్కాయలు శేరు రూ.50 నుంచి 80 రూపాయలు, కిలో రూ.100 విక్రయిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ కాకుండా పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు.

దంతాలు గుచ్చుకోవడంతోనే ఏనుగు అర్జున మృతి

మైసూరు: కెప్టెన్ ఏనుగు అర్జున తుపాకీ తూటా కారణంగా చనిపోలేదని, మరో ఏనుగు దంతం గుచ్చుకోవడంతోనే మృతి చెందినట్లు వైద్యుడు డాక్టర్ రమేశ్ తెలిపారు. మైసూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...యసళూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ అడవి ఏనుగును బంధించడానికి అర్జునను తీసుకుని వెళ్లామని, ఈ సమయంలో పొదల్లో దాక్కుని ఉన్న మరో ఏనుగు ఒక్కసారిగా అర్జునపై దాడి చేసిందని, దంతం గుచ్చుకోవడంతోనే అర్జున మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు.

అర్జునకు స్మారకం : మంత్రి ఈశ్వర్ ఖండ్రె

శివాజీనగర: ఇటీవల హాసన జిల్లా సకలేశపుర తాలూకా యసళూరులో అడవిలో అనూహ్యంగా మృతి చెందిన ఏనుగు అర్జునకు స్మారకాన్ని నిర్మిస్తామని అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె, తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... అడవి ఏనుగుల కార్యచరణ సమయంలో ఏనుగు అర్జున మృతి చెందడం బాధగా ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. దసరా ఉత్సవాల్లో ఎనిమిదిసార్లు అంబారీ మోసిన అర్జున మృతి ఎంతో కలిచివేసిందన్నారు.

యువ రైతుకు అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న రైతు రమేశ్

తుమకూరు: తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా హుళియూరు సమీపంలో ఉన్న తమ్మడిహళ్లి గొల్లరగట్టికి చెందిన యువ రైతు రమేష్‌కు 2023కు సంబంధించి మహేంద్ర ట్రాక్టర్స్ ఆధ్వర్యంలో ప్రదానం చేసే మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు లభించింది. జిల్లాలోని తిపటూరు తాలూకాలో 2020లో 500 క్వింటాళ్ల రాగి పంటను సాగు చేసినందుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇటీవలె రాజధాని ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత నుంచి ఈ అవార్డును అందుకున్నారు.

మిస్పా తెలుగు చర్చిలో పిల్లల క్రిస్మస్


మిస్పా చర్చీ ఆవరణంలో పిల్లల క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల డ్యాన్స్

శివాజీనగర: క్రైస్తవ సముదాయంలో ఎవరి నోట విన్నా క్రిస్మస్ మాటే. లోకానికి సరికొత్త వెలుగులు పంచి సమస్త మానవాళిని పాపకూపం నుంచి విముక్తులను చేసిన యేసుక్రీస్తును స్మరిస్తూ బెంగళూరు నగరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అంబరమంటుతున్నాయి. చర్చీలలో సామూహిక ప్రార్థనలు క్రైస్తవులను భక్తి పారవశ్యంతో ముంచెత్తుతున్నాయి. రాజధాని బెంగళూరు నగరంలో అత్యధిక సంఖ్యలో చేరుకునే మిస్పా తెలుగు చర్చిలో ప్రతి రోజు ముందస్తు క్రిస్మస్ సందడి నెలకొంది. ఇందులో భాగంగానే ప్రతి ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను వివిధ రీతుల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. గత ఆదివారం మహిళా క్రిస్మస్ జరుపగా, ఈ ఆదివారం పిల్లల క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ బెరాకా హ్యాండీ, కార్యదర్శి కెప్టెన్ జాన్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన పిల్లల క్రిస్మస్‌లో పిల్లలు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు అలరించాయి. క్రైస్తవ భక్తి పాటలతోనూ, బైబిల్ పఠనం, డ్యాన్స్, బైబిల్‌లోని వివిధ సంఘటనలను జ్ఞాపకం చేసుకొంటూ నిర్వహించిన స్కిట్లు సంఘ సభ్యులను మంత్రముగ్ధులను చేశాయి. అంతకు ముందుగా పిల్లల క్రిస్మస్ వేడుకల గురించి దైవ వర్తమానాన్ని వినిపించిన సంఘకాపరి రెవరెండ్ బెరాకా హ్యాండీ, పరిశుద్ధ బైబిల్ గ్రంథంలోని వాక్యాలను వినిపించి బాల్యం నుండే పిల్లలను భక్తితో పెంచాలని ఉపదేశించారు.

రెండు బస్సులు ఢీ, 20 మందికి గాయాలు


ఢీకొన్న బస్సులు

యశవంతపుర: రెండు కేఎస్ ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా మాకోనహళ్లి గ్రామం వద్ద ఆదివారం ఉదయం జరిగింది. రెండు బస్సులు అతివేగంగా రావటంతో ప్రమాదం జరిగింది. ఘటనలో 20 మంది ప్రయాణికులతో పాటు డ్రైవర్లు ఇద్దరు గాయపడ్డారు. బస్సుల ముందు భాగం దెబ్బతింది. గాయపడిన ప్రయాణికులను మూడిగెరె ఆస్పత్రికి తరలించారు.

బస్సులు లేక భక్తులు ఆందోళన

దక్షిణ కన్నడ జిల్లా ధర్మస్థలలో జరుగుతున్న లక్ష దీపోత్సవానికి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. అయితే ధర్మస్థలకు వెళ్లే భక్తులకు బస్సుల సౌకర్యం లేక చిక్కమగళూరులో అనేక ఇబ్బందు పడ్డారు. శనివారం అర్ధరాత్రి చిక్కమగళూరు నగరం నుంచి ధర్మస్థలకు బస్సు సౌకర్యం లేని కారణంగా వందల మంది భక్తులు ఇబ్బందుకుల గురయ్యారు. బస్సులు రాకపోవటంతో కడూరు–మంగళూరు జాతీయ రహదారిలో ఆందోళన చేశారు.

విద్యాభ్యాసం కోసం కుమారుడిని దూరంగా ఉంచాను

దొడ్డబళ్లాపురం: విద్యాభ్యాసం కోసం తన కుమారుడిని ఇన్ని రోజులు దూరంగా ఉంచడం జరిగిందని వేరే ఉద్దేశం లేదని వినోద్‌రాజ్ తెలిపారు. తన తల్లి లీలావతి తనను ఏ విధంగా మంచి వ్యక్తిగా తీర్చిదిద్దిందో అదేవిధంగా తన భార్య తన కుమారుడికి మంచి చదువు చెప్పించి తీర్చి దిద్దిందని ప్రస్తుతం తన కుమారుడు మంచి ఉద్యోగంలో ఉన్నాడని వినోద్‌రాజ్ చెప్పుకొచ్చారు. తన కుమారుడు చెన్నైలో ఉన్నప్పటికీ కన్నడ బాగా మాట్లాడతాడన్నారు. దేవాలయాలు దర్శించుకోవాలని తన తల్లికి కోరిక ఉండేదన్నారు. అయితే ఆ కోరిక తీరకుండానే వెళ్లిపోయిందని, ఆమెకు గుడి కట్టాలని నిర్ణయించుకున్నానన్నారు. ఇవన్నీ జరగాలంటే సమయం పడుతుందన్నారు. యువరాజ్ ఉద్యోగం చేస్తూ మంచి జీతం తీసుకుంటుండడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

లీలావతి మూడవరోజు కార్యం

కన్నడ సీనియర్ నటి లీలావతి మృతి చెందిన నేపథ్యంలో ముడవ రోజు కార్యాన్ని కుమారుడు వినోద్ రాజ్ నెరవేర్చారు. నెలమంగల తాలూకా సోలదేనహళ్లిలోని ఆమె ఫాంహౌస్‌లో ప్రభుత్వ లాంఛనాలతో లీలావతి అంత్యక్రియలు శనివారం జరిగాయి. ఆదివారం వినోద్‌రాజ్, కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికుల సమక్షంలో మూడవరోజు కార్యాన్ని సమాధికి పూజ చేసి పాలు, నెయ్యి పోసి పూర్తి చేసారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలు మృతి

క్రిష్ణగిరి: ఆస్పత్రికి వెళ్తున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఊత్తంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... ఊత్తంగేరి సమీపంలోని కొమ్మపట్టి గ్రామానికి చెందిన సెవతాన్ (83) అనారోగ్యంతో ఉండగా ఆమెను ఊత్తంగేరి ఆస్పత్రికి తరలిస్తుండగా ముత్తువేడి ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందారు. ఊత్తంగేరి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

సమాజ సేవల్లో కూడా పాలుపంచుకోవాలి

గౌరిబిదనూరు: విద్యా సంస్థలు కేవలం విద్యా బోధనలవైపు మాత్రమే దృష్టి పెట్టకుండా సమాజానికి వారి సేవలను అందించాలని జీఎస్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి అన్నారు. జీఎస్ఆర్ పీయూ కళాశాల వార్షికోత్సవ సమావేశంలో వివిధ రంగాలలో సేవలందించిన వారిని సన్మానించి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదవాలి. లక్ష్య సాధన మరవకూడదన్నారు. గురువుల పట్ల తల్లితండ్రుల పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. సన్మాన కీబోర్డ్ వాదకులు, విశ్రాంత బిఎఆర్‌సి విజ్ఞాని దశిక శ్రీనివాసరావ్ మాట్లాడుతూ... తాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడినని, 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటూ స్థానికుడిని అయ్యాయన్నారు. సంగీతంలో కర్ణాటక కళాశ్రీ గోపాలకృష్ణాచార్, రంగస్థల నటుడు నరసరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టీ పుష్ప, ప్రిన్సిపాల్ నాగరాజు, సంచాలకులైన ఫౌజియా ఫర్హత్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


సైంటిస్టు దశిక శ్రీనివాసరావ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నాగరికత నుంచే నాటకాలు ప్రారంభం

మండ్య: మనిషి నాగరికత ప్రారంభం అయినప్పటి నుంచి నాటకాలు, నృత్యంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని మైసూరు అబ్కారి కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. మండ్య నగరంలోని హోసహళ్లి బసవేశ్వర దేవాలయం ముందుభాగంలో నిర్వహించిన మధుర మండ్య రంగ కళా ట్రస్ట్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అబ్బుర పరుస్తున్న స్త్రీత్వ చిత్రాలు



వసంత్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన స్త్రీ తత్వాన్ని తెలిపే చిత్రాలు, (కింద) తిలకిస్తున్న సందర్శకులు

బనశంకరి: స్త్రీత్వ (స్త్రీతత్వం) పేరుతో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ప్రదర్శన నగరవాసులను కనువిందు చేస్తోంది. పాతమద్రాసురోడ్డులో వసంత్ ఆర్ట్‌గ్యాలరీలో ప్రముఖ చిత్రకారుడు సౌరభ్‌సదానంద్ డింగరే స్త్రీత్వ (స్త్రీతత్వం) పేరుతో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ప్రదర్శనలో వివాహం చేసుకుని అత్తవారింట్లోకి అడుగు పెట్టిన యువతి ఇతివృత్తంగా చేసుకుని గీసిన చిత్రాలు ఆలోచనలో పడేస్తున్నాయి. ఒంటరిగా తన బాధ్యతలు నిర్వహించుకోవడం, భర్త కోసం ఎదురుచూపులు, అత్తమామలకు సేవలు చేయడం, సంతానం అనంతరం పెరిగిన బాధ్యతలపై తన మనసులోని భావాలను ఇతివృత్తంగా చేసుకుని కళాకారుడు సౌరభ్‌సదానంద్‌డింగరే నవ్యమైన చిత్రాలను గీశారు. మహిళ దేవతగా, యుద్ధవీరులుగా, ప్రేమను పంచే అమ్మగా, కళాకారిణిగా బహుముఖపాత్రలను ఏకకాలంలో పోషించే స్త్రీగా ఒకేసిరీస్‌లో గీసిన పెయింటింగ్స్ సౌరబ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటలవరకు ప్రదర్శన వీక్షించవచ్చు.



హోసూరు వార్తలు..

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్టు


అరెస్టయిన దంపతులు ప్రియ, ఆనంద్, మంగళ, దాసప్ప

హోసూరు: తీసుకొన్న అప్పును తీర్చలేకపోవడంతో కిడ్నాప్ చేసి బెదిరించిన నలుగురిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు పట్టణంలోని ఉప్కర్ నగర్‌కు చెందిన మాదేష్ (54) కొన్నిరోజుల క్రితం బస్తీ ప్రాంతానికి చెందిన ప్రియ (30), సున్నపువీధికి చెందిన మంగళ (38) వద్ద లక్షల రూపాయలు రుణం తీసుకొన్నాడు. తీసుకొన్న డబ్బులు తిరిగి చెల్లించక ఆలస్యం చేశాడు. దీంతో శనివారం మాదేష్‌ను కిడ్నాప్ చేసి అప్పు కట్టాలని ఒత్తిడి చేశారు. వారి నుంచి తప్పించుకొన్న బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రియ, ఆమె భర్త ఆనంద్, మంగళ ఆమె భర్త దాసప్పలను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

కార్మికుడు ఆత్మహత్య

క్రిష్ణగిరి: అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాక కూలి కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కావేరిపట్టణం వద్ద జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కావేరి పట్టణం సమీపంలోని గుండలంబట్టి గ్రామానికి చెందిన కూలికార్మికుడు పళణి (48) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. కానీ స్వస్థత కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన పళణి శనివారం రాత్రి ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.

ఖాద్రీశునికి పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో స్వామివారి జన్మదినం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభునికి వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాతో పాటు చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఖాద్రీశుని దర్శించుకున్నారు. మహిళలు ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు.



భారీ ఏనుగుల మంద సంచారం

క్రిష్ణగిరి: హోసూరు సమీపంలోని హనుమతపురం అటవీ ప్రాంతంలో 70 ఏనుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బెంగళూరు బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి వందకు పైగా ఏనుగులు జవుళగిరి అటవీ ప్రాంతం మీదుగా డెంకణీకోట సమీపలోని నగనూరు, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాలకు చేరుకొన్నాయి. ఆదివారం ఉదయం 70 ఏనుగులు హనుమంతపురం అటవీ ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులకు కనిపించాయి. వెంటనే విషయాన్ని అటవీశాఖాధికార్లకు తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగులను దట్టమైన అటవీ ప్రాంతాలకు మళ్లించే ప్రయత్నం చేపట్టారు. శ్యానమావు, ఆళియాలం, పోడూరు, రామాపురం తదితర చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రకటించారు.


హనుమంతపురం వద్ద ఏనుగులు

రాజాజీకి ఘన నివాళి


రాజగోపాలాచారి విగ్రహానికి కలెక్టర్ నివాళి

హోసూరు: భారత మొట్టమొదటి గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారి 145వ జయంతిని ఘనంగా ఆచరించారు. ఆదివారం హోసూరు తాలూకా తొరపల్లిఅగ్రహారంలోని ఆయన స్వగృహంలో కలెక్టర్ శరయు, నాయకులు పాల్గొని నివాళులర్పించారు. రాజాజీ జీవిత చరిత్రపై ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, ఉపమేయర్ ఆనందయ్య, అధికార్లు స్వామినాథన్, రాజప్రకాష్, తహసీల్దార్ సుబ్రమణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరుబయలే అంచెట్టి బస్టాండు


అంచెట్టి బస్టాండు ఇదే

కెలమంగలం: క్రిష్ణగిరి జిల్లా చిట్టచివరి తాలూకా అంచెట్టిలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించాలని స్థానిక ప్రజలు డిమాండ్‌చేస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని అంచెట్టి చుట్టుప్రక్కల నాట్రాంపాళ్యం, ఉరిగం, మంచుగొండపల్లి, తగ్గట్టి తదితర వందకుపైగా గ్రామాలున్నాయి. ప్రధానంగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, తమిళనాడులోని హోసూరు తదితర ప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది పర్యాటకులు ఈ మార్గంలోనే హొగేనకల్‌కు వచ్చి వెళ్తున్నారు. బస్సులు రోజూ ఎక్కువ సంఖ్యలో తమిళనాడు, కర్ణాటక బస్సులు అంచెట్టికి వచ్చి వెళ్తుంటాయి. కానీ సరైన బస్టాండు లేక స్థానికులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయటే బస్సులు వచ్చి వెళ్తుంటాయి. వర్షాకాలం, ఎండాకాలంలో ప్రయాణికులకు అవస్థలే. భవన సముదాయంతో కూడిన ఆధునిక బస్టాండును ఏర్పాటు చేయాలని కోరారు.

నగదు బదలాయించుకుని పరారీ

హోసూరు: ద్విచక్ర వాహనం చెడిపోయిందని, మెకానిక్ షాపునకు గూగుల్‌పే చేయాలని నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకొని పరారైన దొంగల కోసం బర్గూరు పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు... తిరుపత్తూరు జిల్లా వెలకల్‌నత్తం గ్రామానికి చెందిన మోహన్ (29) బర్గూరు సమీపంలోని ఒప్పదవాడి గ్రామంలో జిరాక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం అక్కడికెళ్లిన ఇద్దరు వ్యక్తులు మోహన్‌ను కలిసి మార్గమధ్యలో ద్విచక్రవాహనం చెడిపోయిందని, వాహనాన్ని మెకానిక్‌షాప్‌లో వదిలామని, మెకానిక్‌కు రూ. 15 వేలు గూగుల్‌పే చేయాలని, తాము నగదుగా అందజేస్తామని కోరడంతో వారి మాటలు నమ్మిన మోహన్ నగదును ట్రాన్స్‌ఫర్ చేశారు. అనంతరం సమీపంలోని ఏటీఎంలో నగదు తీసుకొస్తామని చెప్పి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణం సమీపంలోని మండిబెలె పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా శివణ్ణ, ఉపాధ్యక్షుడిగా తమణ్ణ మాత్రమే నామినేషన్లు వేయడంతో వారిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

విజయపురలో వేరుశనగ పరుష ప్రారంభం



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని శ్రీ బసవకళ్యాణ మఠం ఆవరణంలో సహోపరమపూజ్యులు నిరంజన ప్రసవస్వరూప డాక్టర్ మహాదేవ స్వామీజీ ఆధ్వర్యంలో కార్తీక చివరి సోమవారం సందర్భంగా వేరుశనగ పరుష ప్రారంభమైంది. కార్యక్రమంలో బసవ కల్యాణ మఠానికి చెందిన జూనియర్ స్వామీజీ సదాశివ హాజరయ్యారు.

క్లుప్తంగా...

జర్మనీలో నర్సింగ్ కోసం నైపుణ్య శిక్షణ

సాక్షి, అమరావతి: విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) వేగంగా అడుగులు వేస్తోంది. స్కిల్ ఇంటర్నేషనల్ పోగ్రాం కింద పలు విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని స్థానిక యువతకు విదేశీ అవకాశాలను కల్పిస్తోంది. జర్మనీ వైద్య రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గాను చంద్రకళ ఎడ్యుకేషనల్ సొసైటీ (గ్యాక్‌గో జర్మనీ)తో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద జర్మనీలో నర్సింగ్ విద్యార్థులకు గ్యాక్‌గో జర్మనీ శిక్షణ ఇవ్వనుందని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో వినోద్ కుమార్ తెలిపారు. గ్యాక్‌గో జర్మనీ..ఆ దేశంలోని హాస్పిటల్స్, ఓల్డ్ ఏజ్ హోమ్స్‌తో ఒప్పందాలు చేసుకొని అభ్యర్థులను ఎంపిక చేసి అక్కడే ఉద్యోగం పొందే విధంగా ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు.

క్రూడ్ పామాయిల్ ధరను సవరించండి



నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రం ఇస్తున్న జాతీయ ఆయిల్ పామ్ రైతుల సంఘం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: క్రూడ్ పామాయిల్ వయబిలిటీ(సీపీవో) ధరను సవరించడంతో పాటు దిగుమతి సుంకాలను పునరుద్ధరించాలని జాతీయ ఆయిల్ పామ్ రైతుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీఎస్ఆర్ ప్రసాద్, కె.క్రాంతికుమార్‌రెడ్డి, ఏపీ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బ వీరరాఘవరావు, ఏపీ భారతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సీహెచ్ కుమారస్వామి ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేశారు. క్రూడ్ పామాయిల్‌పై 49శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడం వల్ల ఆయిల్ పామ్ రంగం సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. ఆయిల్‌పామ్ రంగాన్ని, రైతుల జీవనోపాధిని సంరక్షించడానికి 'డైనమిక్ ఇంపోర్ట్ డ్యూటీ మెకానిజాన్ని' రూపొందించి, దిగుమతి సుంకాలను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

స్పందన లేని యువగళం పాదయాత్ర

తొండంగి : టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ఆదివారం ప్రజల నుంచి స్పందన కరువైంది. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో రెండో రోజు పాదయాత్ర షెడ్యూలు ప్రకారం ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతుందని ప్రకటించారు. అయితే, ఒంటిమామిడి జంక్షన్‌లో ప్రజలు రాకపోవడంతో దాదాపు రెండు గంటలకు పైగా ఎదురు చూసి ఆలస్యంగా పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి తొండంగి మీదుగా శృంగవృక్షం గ్రామానికి పాదయాత్ర చేరుకుంది. తొండంగి మెయిన్ సెంటర్‌లో కూడా జనం లేరు. శృంగవృక్షంలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం సెజ్ రైతులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. అనంతరం పి.అగ్రహారం మీదుగా తుని మండలం తిమ్మాపురం వరకూ పాదయాత్ర సాగింది.

కేసీఆర్‌ను పరామర్శించిన రేవంత్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకుని శాసనసభకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మంత్రి సీతక్క, మాజీ మంత్రి షబ్బీర్ అలీతో కలసి సోమాజిగూడ యశోద హాస్పిటల్‌కు వెళ్లిన రేవంత్.. కేసీఆర్‌ను పరామర్శించారు. ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, వైద్యులతోనూ మాట్లాడారు. తర్వాత ఆస్పత్రి బయట రేవంత్ మీడియాతో మాట్లాడారు. ''కేసీఆర్ వైద్యం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించాం. కేసీఆర్ త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నా..''అని రేవంత్ అన్నారు.

సీఎం క్యాంప్ ఆఫీస్‌గా ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనం!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రాన్ని(ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) సందర్శించారు. సంస్థ కార్యకలాపాల గురించి వాకబు చేశారు. అంతేగాక సంస్థలోని వివిధ బ్లాకులను సోలార్ పవర్ వాహనంలో కలియతిరుగుతూ పరిశీలించారు. సీఎం క్యాంపు కార్యాలయంగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనాన్ని వినియోగించుకోవాలని భావనతోనే ఆయన ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనాన్ని సందర్శించినట్లు సమాచారం.

భూగర్భజల పరిరక్షణలో ఏపీ టాప్



వర్షం, జలసంరక్షణ చర్యల వల్ల 983.3 టీఎంసీలు భూగర్భజలాలుగా రూపాంతరం

- జాతీయ ప్రమాణాల మేరకు 934.21 టీఎంసీలు వాడుకునే అవకాశం
- అందులో 264.18 టీఎంసీలు మాత్రమే వినియోగించుకున్న రాష్ట్రం
- దేశవ్యాప్తంగా సగటున 59.26 శాతం భూగర్భజలాల వినియోగం
- రాష్ట్రంలో సగటున 28.3 శాతమే వాడకం
- భూగర్భజలాల పరిరక్షణలో రెండో ఏడాదీ దేశంలో ముందు నిలిచిన రాష్ట్రం
- కేంద్ర భూగర్భజలవనరుల మండలి అధ్యయనంలో వెల్లడి
- గతేడాది కంటే ఈ ఏడాది వర్షపాతం తక్కువైనా.. భూగర్భజలాల పెరుగుదలలో మెరుగు

సాక్షి, అమరావతి: గతేడాది కంటే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైనా భూగర్భజలాల పెరుగుదలలో దేశంలో మన రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. వర్షం తక్కువగా కురిసినా రాష్ట్ర ప్రభుత్వం వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలుగా మార్చే జలసంరక్షణ చర్యలు మెరుగ్గా చేపట్టడం వల్లే ఇది సాధ్యమైందని కేంద్ర భూగర్భ జలవనరుల మండలి (సీజీడబ్ల్యూబీ) ప్రశంసించింది. దేశంలో ఈ ఏడాది భూగర్భజలాల పరిస్థితిపై సీజీడబ్ల్యూబీ అధ్యయనం చేసింది. అధ్యయనంలో వెల్లడైన అంశాలపై కేంద్ర జల్‌శక్తి శాఖకు ఇటీవల నివేదికను అందించింది. ఆ నివేదికలో ప్రధానాంశాలు ఇవీ..

వరుసగా రెండో ఏడాదీ అగ్రగామిగా రాష్ట్రం

- ▲ దేశవ్యాప్తంగా 6,553 మండలాలు/బ్లాక్‌లలో భూగర్భజలాల పరిస్థితిపై సీజీడబ్ల్యూబీ అధ్యయనం చేసింది. రాష్ట్రంలో 667 మండలాల్లో అధ్యయనం చేసింది.
- ▲ నైరుతి, ఈశాన్య రుతుపవనాల వల్ల ఏటా సగటున దేశంలో 1,236.4 మిల్లీమీటర్లు, రాష్ట్రంలో 1,148.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాలి.
- ▲ ఈ ఏడాది దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం కంటే తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 835.03 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 714.88 మిల్లీమీటర్లు కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 14.39 శాతం తక్కువగా నమోదైంది.
- ▲ వర్షపాతం, జలసంరక్షణ కట్టడాలు, చర్యల వల్ల దేశంలో 2023లో భూగర్భజలాలు 15,861.50 టీఎంసీలు పెరిగాయి. ఇందులో జాతీయ ప్రమాణాల మేరకు 14,382.65 టీఎంసీలు (90.67 శాతం) వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. అందులో 8,524.12 టీఎంసీలను (59.26%) ఇప్పటికే వినియోగించుకున్నారు.
- ▲ రాష్ట్రంలో వర్షపాతం, జలసంరక్షణ చర్యల వల్ల భూగర్భజలాలు ఈ ఏడాది 983.30 టీఎంసీలు పెరిగాయి. ఇందులో 934.21 టీఎంసీలు వాడుకోవచ్చు. అందులో ఇప్పటివరకు 264.18 టీఎంసీలు (28.3 శాతం) మాత్రమే వినియోగించుకున్నారు. ఇటు భూగర్భజలాలు సంరక్షిస్తూ, అటు పొదుపుగా వినియోగించుకుంటూ భూగర్భజలాల పరిరక్షణలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. గతేడాది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షం కురిసినా భూగర్భజలాలు 982.95 టీఎంసీలే పెరగడం గమనార్హం.
- ▲ భూగర్భజలాల పరిరక్షణలో గతేడాది మొదటి స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది కూడా అగ్రగామిగా నిలిచింది.
- ▲ దేశంలో 2–5 మీటర్ల లోతులోనే పుష్కలంగా భూగర్భజలాలు లభ్యమయ్యే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, అసోం, ఉత్తరప్రదేశ్ (ఉత్తర ప్రాంతం), బిహార్ (ఉత్తర ప్రాంతం) నిలిచాయి. భూగర్భజలమట్టం దారుణంగా 20–40 మీటర్లకు పడిపోయిన రాష్ట్రాల్లో ఢిల్లీ, హరియాణ, పంజాబ్, రాజస్థాన్ ఉన్నాయి.

జలసంరక్షణ చర్యల వల్లే


రాష్ట్రంలో కురిసిన వర్షపాతం కంటే.. ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, అడవుల్లో కందకాలు తవ్వడం వంటి జలసంరక్షణ చర్యల వల్లే భూగర్భజలాలు అధికంగా పెరుగుతున్నాయి. వర్షాకాలంలో వర్షం వల్ల 316.82 టీఎంసీలు భూగర్భజలాలుగా మారుతుండగా.. జలసంరక్షణ చర్యల వల్ల 351.08 టీఎంసీలు భూగర్భజలాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఇక చలి, వేసవి కాలాల్లో కురిసే వర్షాల వల్ల 30.02 టీఎంసీలు భూగర్భజలాలుగా మారుతుంటే.. జలసంరక్షణ చర్యల వల్ల 285.38 టీఎంసీలు భూగర్భజలాలుగా రూపాంతరం చెందుతున్నాయి.

దేశంలో, రాష్ట్రంలో భూగర్భజలాల పరిస్థితి ఇదీ..

భూగర్భజలాల పరిస్థితి	దేశం (మండలాలు/బ్లాక్‌లు)	రాష్ట్రం (మండలాలు)
సురక్షితం	4,793 (73.1 శాతం)	597 (89.5 శాతం)
కొంతమేర సమస్యాత్మకం	698 (10.7 శాతం)	18 (2.7 శాతం)
సమస్యాత్మకం	199 (3 శాతం)	3 (0.45 శాతం)
ఆందోళనకరం	736 (11.2 శాతం)	10 (1.5 శాతం)
ఉప్పునీళ్లుగా మారినవి	127 (1.9 శాతం)	39 (5.85)

రాష్ట్రంలో భూగర్భజలాలు ఆందోళనకరంగా ఉన్న 10 మండలాలు ఇవే..

జిల్లా	మండలం
పల్నాడు	వెల్దుర్తి
ప్రకాశం	రాచర్ల, పెద్దారవీడు, కంభం
శ్రీసత్యసాయి	తనకల్లు, హిందూపురం, రోళ్ల, గాండ్లపెంట
శ్రీకాకుళం	రణస్థలం
వైఎస్సార్	పులివెందుల



వ్యవసాయానికే సింహభాగం వినియోగం

రాష్ట్రంలో భూగర్భజలాలను సింహభాగం వ్యవసాయానికే వినియోగిస్తున్నారు. పంటల సాగుకు 227.46 టీఎంసీలను బోరుబావుల ద్వారా రైతులు వాడుకుంటున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం 4.94 టీఎంసీలను బోరుబావుల ద్వారా వినియోగించుకుంటున్నారు. గృహ అవసరాల కోసం ప్రజలు 31.78 టీఎంసీలను వాడుకుంటున్నారు.

బాబు పిచ్చికూతలు.. రామోజీ పిచ్చిరాతలు

- రైతులకు మంచి చేస్తున్నా వారిద్దరూ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు
- బురద రాజకీయాలు చేస్తూ ఫొటోలకు ఫోజులిచ్చే నైజం బాబుది
- మిచాంగ్ తుపానులో బాధితులకు అండగా నిలిచిన సీఎం జగన్
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు : మిచాంగ్ తుపాను నేపథ్యంలో సత్వర చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు రామోజీ డైరెక్షన్‌లో చంద్రబాబు యాక్షన్‌లోకి దిగారని, తుపాను పరిహారంపై ఆయన పిచ్చిరాతలు రాస్తే ఈయన పిచ్చికూతలు కూస్తున్నారంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుపాను సాయంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ముందస్తుగా ఆదేశాలు జారీచేయడమే కాక ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇస్తే ప్రభుత్వం ఎక్కడ విఫలమైందో చంద్రబాబు తన రెండ్రోజుల పర్యటనలో చెప్పలేకపోయారని మంత్రి ఎద్దేవా చేశారు. నిజానికి.. చంద్రబాబు సీఎంగా 14 ఏళ్లు పనిచేశారని, ఆ సమయంలో రైతులకు ఆయన చేసిన మేలేమిటో చెప్పాలన్నారు. పైగా వ్యవసాయాన్ని కించపర్చేలా మాట్లాడారని గుర్తుచేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం జగన్ అక్కడి రైతులతో ముఖాముఖి చర్చించి వారికి భరోసా ఇచ్చారన్నారు. విపత్తు సమయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా ఉండాలని, సాయం చేయకుండా ప్రెస్‌మీట్లు, ఫొటోలకు పోజులిచ్చేందుకు చంద్రబాబు, టీడీపీ నేతలు పరిమితమయ్యారని కాకాణి విమర్శించారు.

ప్రభుత్వంపై బాబు, రామోజీ విషం..

రైతులకు మంచి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై చంద్రబాబు, రామోజీ విషం కక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు. తాను పరిహారాన్ని ఎక్కువగా ఇచ్చానంటూ చంద్రబాబు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాడని.. ఆయన హయాంలో ఎవరైతే బీమా ప్రీమియం కడతారో వారికే ప్రభుత్వ వాటా చెల్లిస్తానని చెప్పి బీమా రాకుండా రైతులను ఆయన ముంచాడన్నారు. కానీ, ప్రస్తుతం పంట వేసుకుంటే నోటిఫై పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేయించి పారదర్శకంగా వారికి సంబంధించిన బీమా ప్రీమియంని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని కాకాణి చెప్పారు. ఇక టీడీపీ హయాంలో విత్తనాల కోసం క్యూల్లో నిలబడి రైతులు ప్రాణాలు కోల్పోయిన సంగతి రాష్ట్రంలోని అన్నదాతలు మర్చిపోలేదన్నారు. ఎవరికి పంట నష్టం జరిగిందో రైతుభరోసా కేంద్రాల్లో ప్రచురిస్తారని, అనంతరం వాటిలో అభ్యంతరాలుంటే పరిగణనలోకి తీసుకుని బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు. కందిపప్పుకు.. పెసరపప్పుకు తేడా తెలియని వ్యక్తి లోకేశ్ అన్నారు. తుపాను సాయంపై చంద్రబాబుతో బహిరంగ చర్చకు సిద్ధమని కాకాణి సవాల్ చేశారు.

ఆక్వా రంగంపై మాట్లాడే హక్కు మీకెక్కడిది?

- డిస్కంలకు చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలను జగన్ ప్రభుత్వమే చెల్లించింది
- లోకేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ అప్సడా కో–వైస్ చైర్మన్ రఘురామ్



సాక్షి, అమరావతి:ఆక్వా రంగం గురించి మాట్లాడే అర్హత టీడీపీ నేత లోకేశ్‌కు.. ఆయన తండ్రి చంద్రబాబుకు లేదని ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ ఎద్దేవా చేశారు. విజయవాడలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల వల్ల ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందంటూ లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఆక్వా జోన్ విధానం తెచ్చింది చంద్రబాబు హయాంలోనే అనే విషయం లోకేశ్‌కు తెలియకపోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. 2018లో ప్రారంభించిన ఆక్వా జోన్ విధానాన్ని చంద్రబాబు మధ్యలో గాలికొదిలేస్తే.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సర్వే ద్వారా జోన్, నాన్ జోన్ పరిధిని నిర్ధారించారన్నారు. రాష్ట్రంలో 4.65 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా.. ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు 3.27 లక్షల ఎకరాలను తీసుకొచ్చి, యూనిట్ విద్యుత్‌ను రూపాయిన్నరకే ఇస్తూ సన్న, చిన్న ఆక్వా రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికలకు 6 నెలల ముందు యూనిట్ విద్యుత్ రూ.2కే ఇస్తానని ఆక్వా రైతులకు నమ్మబలికి, డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీని ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుదన్నారు. చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలు చెల్లించడంతోపాటు రైతుల తరఫున డిస్కంలకు చెల్లించాల్సిన మొత్తాన్ని పైసలతో సహా చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు రూ.2,800 కోట్లకు పైగా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లించిందన్నారు.

ఆక్వా రైతులకు రక్షణగా ప్రభుత్వం

అప్సడా చట్టం ద్వారా ఆక్వారంగ కార్యకలాపాలన్నిటినీ చట్ట పరిధిలోకి తీసుకొచ్చి రైతులకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని రఘురామ్ పేర్కొన్నారు. ఆక్వా రైతులకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సీడ్, ఫీడ్ చట్టాలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

అవమానాలు ఎదుర్కొంటూ టీడీపీలో ఇమడలేను..

- నాకన్నా పార్టీ ఫిరాయించిన వ్యక్తికే చంద్రబాబు ప్రాధాన్యం ఇచ్చారు
- త్వరలో భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటిస్తా..
- ఆత్మీయులతో సమావేశంలో టీడీపీ నేత ఆర్‌వీ సుభాష్‌చంద్రబోస్



గంగవరం(చిత్తూరు జిల్లా): 'టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న నాకు ఆ పార్టీలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. అందుకే టీడీపీ నుంచి బయటికి వస్తున్నా. త్వరలో నా భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటిస్తా' అంటూ పలమనేరు టీడీపీ నేత ఆర్‌వీ సుభాష్‌చంద్రబోస్ చెప్పారు. గంగవరం మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన ఆత్మీయులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో అభిమానులు, ఆయన ఆత్మీయులు తరలివచ్చారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. 'పార్టీ ఫిరాయించిన అమరనాథరెడ్డి టీడీపీలో చేరినప్పటి నుంచి చంద్రబాబు నన్ను విస్మరించారు. ఏకంగా మంత్రి పదవినే కట్టబెట్టారు. అనంతరం టీడీపీ అధిష్టానం నన్ను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఆ తర్వాత నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ఎదురుకాని అవమానాలను ఎదుర్కొన్నా. 2019 ఎన్నికల్లో అమరనాథరెడ్డికి నా వంతు సహకారం అందించా. ఆయన మంత్రిగా చేస్తున్న సమయంలో బస్సుల సర్వీసులకు గాను ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కొంత స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా.. ఒక్కసారికే నాకు స్థలం కేటాయించి ఆదుకున్నారు. ఒకప్పటి టీడీపీ బహిరంగ సభలో నన్ను పులిగా చెప్పుకొచ్చిన లోకేశ్.. మొన్న యువగళం పాదయాత్రలో అమరనాథరెడ్డిని పులి అనడం, పాదయాత్ర పలమనేరు మీదుగా వెళ్లినా నన్ను ఏమాత్రం పట్టించుకోకపోవడం దేనికి సంకేతం? ఇలా ఎన్నో రకాలుగా నాతోపాటు అభిమానులకు, శ్రేయోభిలాషులకు టీడీపీలో తీరని అన్యాయం జరిగింది. గౌరవ ప్రతిష్టలు లేని ఇలాంటి పార్టీకి సేవ చేయడం మానుకుంటున్నా.

జగన్ అభివృద్ధి కార్యక్రమాలకు హద్దులు లేవు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు(చిత్తూరు జిల్లా): సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి పాలన కొనసాగుతోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు హద్దులు లేవన్నారు. పుంగనూరు మండలంలో నిర్మించిన ఆర్బీకేలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సబ్‌స్టేషన్లను మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎంసీపల్లెలో మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతమైన పుంగనూరుకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఆయన నిధులు కేటాయించడంతో నియోజకవర్గంలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి.. ఇంటింటికీ నీళ్లిచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను ఎన్నికల్లోపు ప్రారంభించి.. ప్రజలకు అంకితమిస్తామన్నారు. గతంలో మాజీ సీఎం కిరణ్ తన నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పేదలకు అండగా నిలిచిన సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి గతంలో కంటే గొప్పగా.. అత్యధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని చెప్పారు.

తెలంగాణ

నట్టేట ముంచిన గూగుల్ మ్యాప్

గౌరవెల్లి ప్రాజెక్టులోకి దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్

- కొంతదూరం వెళ్లాక ఈదుకుంటూ బయటపడ్డ డ్రైవర్
- సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో ఘటన



వ్యాన్‌ను బయటకు తీసుకొస్తున్న జేసీబీ

అక్కన్నపేట (హుస్నాబాద్): ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్తున్నామా?.. జస్ట్ గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేయడం, అందులో సూచించిన దారిని అనుసరిస్తూ ముందుకు వెళ్లిపోవడం మామూలైపోయింది. కానీ అన్నిసార్లు గూగుల్ మ్యాప్స్‌ను గుడ్డిగా నమ్మి ముందుకెళ్తే నట్టేట మునగడం ఖాయం. తాజాగా ఓ డీసీఎం వ్యాన్ డ్రైవర్ గూగుల్ మ్యాప్ చూసుకుంటూ వాహనం నడిపి ఏకంగా ప్రాజెక్టులోకి వెళ్లిపోయాడు. సిద్దిపేట అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద ఈ ఘటన జరిగింది.

హైదరాబాద్‌కు చెందిన ఓ డీసీఎం డ్రైవర్ శనివారం రాత్రి హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో వృథా అయిన పాల ప్యాకెట్లను వ్యాన్‌లో లోడ్ చేసుకున్నారు. తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి హుస్నాబాద్ మీదుగా రామవరం వైపు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్‌కు రోడ్డుపై సరైన అవగాహన లేక గూగుల్ మ్యాప్స్ చూసుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో బంగారు లొద్దితండా దాటాక రామవరం వైపు వెళ్లాల్సిన ఉన్నా.. గుడాటిపల్లి వైపు మళ్లారు. మ్యాప్‌లో చూపించినట్టుగా ముందుకువెళ్లారు. కొంతదూరం వెళ్లాక నీరు ఎక్కువగా కనిపించింది. వాన వల్ల నీళ్లు నిలిచాయేమో అనుకుని ముందుకెళ్లాడు. క్యాబిన్ వరకూ నీళ్లు వచ్చాయి. డీసీఎం ఆగిపోయింది. దీంతో డ్రైవర్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈదుకుంటూ బయటకు వచ్చాడు. చుట్టుపక్కల ఉన్న వారి వద్దకు వెళ్లి ఈ విషయం చెప్పాడు. ఆదివారం ఉదయం స్థానికులు జేసీబీ సాయంతో డీసీఎంను బయటకు లాగారు.

ఆరు లేన్లుగా హైదరాబాద్‌–విజయవాడ రహదారి

తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్/నల్లగొండ: హైదరాబాద్‌–విజయవాడ జాతీయ రహదారిని త్వరలోనే ఆరు వరుసలుగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడకు అతి తక్కువ సమయంలోనే చేరుకునే అవకాశముందని కోమటిరెడ్డి వెల్లడించారు. తన పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు ఢిల్లీకి వెళ్తున్న నేపథ్యంలో.. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో భేటీ అయి పెండింగ్‌లో ఉన్న 14 జాతీయ రహదారుల ప్రతిపాదనలపై చర్చించనున్నట్టు వెల్లడించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు

- టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం
- ఏపీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం
- తెలంగాణలో బీజేపీతో జనసేన.. కాంగ్రెస్‌కు టీడీపీ మద్దతు
- అనైతిక పొత్తులను అసహ్యించుకుంటున్న ప్రజలు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ అడ్రస్ లేకుండా పోతాయని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు వత్తాసు పలికితే.. జనసేన మరో జాతీయ పార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకుందన్నారు. ఏపీలో అనైతిక పొత్తు ద్వారా టీడీపీ–జనసేన ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని స్పష్టమవుతోందన్నారు. ఇటువంటి నైతికతలేని పొత్తులను ఆంధ్రా ప్రజలు అంగీకరించరని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు తమ వల్లే అంటూ టీడీపీ వాళ్లు చేసుకున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆంధ్రా సెటిలర్స్ అంతా బీఆర్ఎస్‌కే మద్దతు పలికి గెలిపించారని.. కనీసం కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదని చెప్పారు. టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం అయ్యారన్నారు. టీడీపీ కూడా ఫలితాలు వెలువడిన ఒకటి రెండు రోజులు హడావుడి చేసి.. ఆ తరువాత జనానికి విషయం అర్థం అయిందని తెలియగానే గప్‌చుప్ అయిందని చెప్పారు. టీడీపీ అంటేనే ఆంధ్రా ప్రజానీకం అసహ్యించుకునే పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ వారు రోడ్డు మీదకు రావడాన్ని తట్టుకోలేకనే తెలంగాణలో కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారని, రేపు ఆంధ్రాలో జరిగే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ కూడా గల్లంతవుతుందని చెప్పారు. ప్రజలను భ్రమల్లో బతికించేద్దామని ప్రయత్నిస్తున్నారని టీడీపీ, జనసేన పొత్తులను చూస్తే అర్థం అవుతోందన్నారు. వైఎస్ జగన్ మాత్రం అప్పుడైనా, ఇప్పుడైనా ఒకటేమాట అని, అది ఒంటరిగానే పోటీ అని చెప్పారు. శివారు ప్రాంతాలకు వెళితే.. జనం ఎవరి వైపు ఉన్నారో తెలుస్తుందన్నారు. వాస్తవానికి ఎన్నికలకు ముందే తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని ఒక వ్యక్తి తనతో పందేనికి సిద్ధపడ్డారన్నారు. కానీ తన కుమారుడు బీఆర్ఎస్ గెలుస్తుందనడంతో తాను ఆ పందెం నుంచి ఉపసంహరించుకున్నట్లు చెప్పారు.

చంద్రబాబు ఏమన్నా సైకిల్ మీద వచ్చారా?

బాపట్ల జిల్లా తుపాను బాధిత ప్రజల్లో భరోసా నింపేందుకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురించి పచ్చమీడియాలో దారుణంగా రాయడం సరికాదన్నారు. జగన్ చొక్కా నలగకుండా హెలికాప్టర్లో వచ్చి వెళ్లారంటూ రాయడం ద్వారా వారి వైఖరేంటో అర్థమవుతోందని చెప్పారు. చంద్రబాబు హయాంలో తుపాన్లు వస్తే ఆయన ఏమన్నా సైకిల్ తొక్కుకుంటూ ఆ ప్రాంతాల్లో తిరిగారా? అంటూ మండిపడ్డారు. మూడు జిల్లాల్లో పర్యటన ఉండడంతో సీఎం జగన్ హెలికాప్టర్‌లో వచ్చారని చెప్పారు. దాన్ని కూడా వక్రీకరించడం సరికాదన్నారు. తుపాను వచ్చినప్పుడు ముందుగానే అన్ని జిల్లాల కలెక్టర్లకు తగినన్ని నిధులు విడుదల చేసిన సీఎం.. పకడ్బందీగా పునరావాస చర్యలు చేపట్టి బాధితులకు అండగా నిలిచారని చెప్పారు. ఒంగోలులో లోతట్టు ప్రాంతాల్లో అందరికీ భోజన సదుపాయం కల్పించామన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికి సైతం నగరంలో నీరు నిలిచేదని, కానీ మొన్న మూడు రోజులపాటు తుపాను వచ్చినా చుక్కనీరు నిలవలేదని, దానికి కారణం చేసిన అభివృద్ధేనని చెప్పారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో నేటికీ 1.40 టీఎంసీల నీరు నిల్వ ఉందని, టీడీపీ హయాంలో ప్రాజెక్టు నిర్వహణ గాలికి వదిలివేయడం వల్లే నేడు సమస్య నెలకొందని పేర్కొన్నారు. అయినా శాశ్వత మరమ్మతులకు రూ.9 కోట్లతో టెండర్లు కూడా పిలిచారని, త్వరలోనే గేట్ల మరమ్మతులు కూడా చేపడతారని చెప్పారు.

ఆదుకునే మనస్తత్వం నాది..

చిన్నతనం నుంచి తనది ఆదుకునే మనస్తత్వమని బాలినేని పేర్కొన్నారు. తన పక్కనుండేవారికి ఏ అవసరమొచ్చినా అప్పు తెచ్చి అయినా అండగా నిలిచేవాడినన్నారు. అందువల్లే తమ తాత సంపాదించిన ఆస్తుల్లో సగం నేడు హరించుకుపోయాయన్నారు. పార్టీ ఫండ్ కింద ఎవరైనా ఇస్తే తీసుకున్నట్లు చెప్పానని, దానిని వక్రీకరించడం సరికాదన్నారు. తనకు నేటికీ నగరంలో టీడీపీకి చెందినవారి వద్దే రూ.15 కోట్ల అప్పులున్నాయని, అంతమాత్రాన తాను అప్పులు ఎగ్గొట్టే రకం కాదని తెలిపారు. ఆస్తులమ్మి అయినా తీరుస్తానన్నారు. ఎన్నికల సమయంలో తన వియ్యంకుడు ఎన్నికల ఖర్చు పెట్టే పరిస్థితి అని పేర్కొన్నారు.

నాయకుల్లో బాధ్యత మరింత పెంచేందుకే..

అధికారంలో ఉన్నాం కదా అని కొద్దిగా నిర్లక్ష్యం వహిస్తున్న నాయకుల్లో సైతం బాధ్యతను పెంచేందుకు తాను మాట్లాడానని, అంతేతప్ప కార్యకర్తలను నిరుత్సాహ పరిచేందుకు కాదని చెప్పారు. తనకోసం ఎందాకైనా.. అంటూ పోరాడే నాయకులు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో గతం కంటే మెరుగైన సీట్లు గెలుచుకోవడంతోపాటు ఒంగోలులో 40 నుంచి 50 వేల ఓట్ల మెజార్టీ సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో ఎవరికి సీటు ఇచ్చినా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

మంచిమాట

అంకిత భావం



అంకము అంటే గుర్తు, ముద్ర. అంకితం అంటే గుర్తు, లేక ముద్ర కలిగినది. తమ పని ఏదైనా ఏ విధంగా గుర్తించబడాలో సూచించే గుర్తును చెప్పటం అంకితం. మన కవులు అందరు తమ కావ్యాలను అంకితం చేశారు. రచన తమది అయినా ఆ రచనను చదివే వారికి మరొకరు మనసులో మెదులుతారు. అది తమ ఇష్టదైవం కావచ్చు. ఆదరించిన రాజో, మిత్రుడో, ఆత్మీయులో కావచ్చు. అది మరెవరి గుర్తింపు కొరకో తాము చేసే కృషి అని చెప్పటం. కావ్య అవతారికలోనే చెప్పటం సంప్రదాయం. ఆదికవి నన్నయ ఈ ఒరవడి ప్రారంభించినట్టు కనపడుతుంది. తన సహాధ్యాయి, రాజు, పోషకుడు అయిన రాజరాజ నరేంద్రుడి కోరిక మీద ఆయనకి అంకితంగా భారతసంహితా రచనా ధురంధురుడయ్యాడు. ఈ అంకితం కారణంగానే తిక్కనామాత్యులవారు అరణ్యపర్వశేషాన్ని స్పృశించలేదని కొందరు సాహిత్యవిమర్శకుల అభిప్రాయం.

నన్నయభట్టు నరాంకితంగా చేసిన దానిలో మిగిలిన భాగాన్ని దైవానికి అంకితం ఇవ్వటం ఇష్టం లేక విరాటపర్వం నుండి ప్రారంభించి ఉంటారని భావన. పైగా ఆయనకి హరిహరనాథుడు స్వప్నంలో కనపడి ఆదేశించాడు కూడా. పోతనామాత్యుల వారి అంకితం కించిత్ ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. శివధ్యానం చేస్తున్న పోతనకి శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చి కృష్ణకథ ప్రధానంగా ఉన్న భాగవతాన్ని తనకి అంకితంగా రచించమని కోరాడు.

వాగ్గేయకారులు తమ కీర్తనలలో ప్రతిదానిలోనూ తమ ఇష్టదైవం నామాన్ని గాని ఒక ప్రత్యేకమైన పదాన్ని గాని గుర్తుగా పేర్కొంటారు. దానిని ముద్ర అంటారు. కీర్తనలు వేటికి అవి విడిగా ఉంటాయి. కావ్యంలో లాగా అవతారికలో ఒకసారి పేర్కొంటే సరిపోదు కదా! అందుకని ప్రతి కృతిలోనూ ముద్ర తప్పని సరి. త్యాగరాజ కృతులలో ప్రతి దానిలోనూ త్యాగరాజనుత అనే ముద్ర కనపడుతుంది. శ్యామశాస్త్రివారి కీర్తనలలో శ్యామకృష్ణ అని, ముత్తుస్వామి దీక్షితులవారి కీర్తనలలో గురుగుహ అనే ముద్రలు దర్శనమిస్తాయి. ఆ ముద్ర చూడగానే అది ఎవరి రచన అన్నది తెలిసిపోతుంది. నిజానికి వారు మనకి తేలికగా తెలియటం కోసం పెట్టలేదు ముద్ర లని. ఆ ముద్ర తనకి, ఎవరిని గురించి పాడుతున్నారో వారికి గుర్తింపు.

వాచస్పతి మిశ్రుడు తన రచనకు ఏ మాత్రం ఇబ్బంది కలిగించకుండా సహకరించిన, అప్పటివరకు ముఖమైనా చూడని ధర్మపత్ని 'భామతి' పేరుని తన గ్రంథనామంగా ఉంచాడు.

తమకు ఉన్న ప్రేమాభిమానాలను వ్యక్తపరచటానికి రచనాదికాలు చేయలేక పోయినా, తాము చేసిన ఏ ఘనకార్యమైనా అంకితం చేస్తూ ఉంటారు.

అందరు ఏదో ఒక ఘనకార్యం చేసి అంకితం ఇవ్వలేక పోవచ్చు. వారు తమ జీవితాన్నే అంకితం చేయటం మనం గమనించ వచ్చు. ''నా జీవితం నీకే అంకితం..'' అంటూ పాడిన పాటలు ఉదాహరణలు. అంటే, తన అస్తిత్వానికి ఒక గుర్తింపు అవసరం లేదు, అస్తిత్వంతో సహా అంతా సమర్పణమే ఇష్టదైవానికో, ఇష్టమైన వ్యక్తికో.

చివరికి ఈ అంకిత ప్రక్రియ ఏ స్థాయికి చేరింది అంటే, ఆకాశవాణిలో గాని, దృశ్యశ్రవణ ప్రసార మాధ్యమాలలో గాని ఇష్టమైన పాటలని వేయించి, వాటిని అంకితం చేస్తున్నారు. వీరజవానులు తమ జీవితాలను దేశరక్షణకు అంకితం చేస్తారు. కొందరు దైవానికి తమ జీవితాలని అంకితం చేస్తారు.

తన ఉనికి కోసం, గుర్తింపు కోసం తాపత్రయ పడకుండా మరెవరి గుర్తింపుకో నిస్వార్థంగా చేయటం అంకితం.

– డా. ఎన్. అనంతలక్ష్మి

కావ్యాలు, కీర్తనలు మాత్రమే కాదు ఏ సృజనాత్మక సృష్టి అయినా తన గుర్తింపు కోసం కాక ఇతరులకు గుర్తింపు కలగటం కోసం చేసినప్పుడు ఆ ప్రక్రియని అంకితం అంటారు. ఉదాహరణకి నన్నయభట్టు భారతాన్ని ఆంధ్రీకరించాడు. ఆయన పేరుతో పాటు అంకితం పుచ్చుకున్న రాజరాజనరేంద్రుడి పేరు కూడా చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. రాజుగా కన్న ఆంధ్ర మహాభారతాన్ని అంకితం పుచ్చుకున్న వాడిగా గుర్తింపు అధికం. శ్రీనాథ కవి సార్వభౌముడి పేరు నిలిచి ఉన్నంత కాలం వీరారెడ్డి, అవచి తిప్పయ్య శెట్టి, పెదకోమటి వేమారెడ్డి మొదలైన వారందరి పేర్లు శాశ్వతం. రచనలు చేయలేదు కాని, కావ్యాలు అంకితం పుచ్చుకున్నారు కనక, ఆ కావ్యాలు ఆదరించబడినంత కాలం వారి పేరు చిరస్థాయిగా ఉంటుంది.

వాగ్గేయకార వైభవం

అన్నీ రాళ్లే.. కానీ...



సనాతన ధర్మంలో భగవంతుడే గురువుగా కూడా ఉంటాడు. పరమాత్మ కృష్ణుడిగా వచ్చాడు. పరిపూర్ణావతారం. సాందీపని మహర్షి దగ్గర శిష్యరికం చేసాడు. ఆయనకు తెలియదా.. జగద్గురువు!!! పుట్టుకచేత సమస్తం తెలిసున్నవాడు. తన జన్మ, అవతార విశేషాన్ని ఎవరు తెలుసుకుంటారో వారికి పునర్జన్మ లేదన్నాడు. అటువంటి పరమాత్మ శ్రావణ మాసం బహుళ పక్షం అష్టమి తిథినాడు కటిక చీకటిలో వచ్చాడు. దక్షిణాయనం దేవతలందరికీ చీకటి. కృష్ణపక్షం పితృదేవతలందరికీ చీకటి. అంటే – దేవతలతో కలిపి సమస్త ప్రాణులకు ఎప్పుడు చీకటో ఆ చీకటిలో ఆయన ఆవిర్భవించాడు. అలా ఎందుకు?.. అంటే.. అజ్ఞానంలో ఉన్నవాళ్లందరికీ కూడా దేశకాలాలతో సంబంధం లేకుండా ఎప్పటికీ పనికొచ్చే భగవద్గీతను ఉపదేశం చేయడానికి వచ్చిన అవతారం అది. అక్కడినుండి మరో ఆరునెలలు... కృష్ణపక్షంలో అర్ధరాత్రివేళ కృష్ణుడు కరచరణాదులతో వస్తే– మళ్ళీ మాఘమాసం వచ్చేటప్పటికి – ఆ మాసపు బహుళ చతుర్దశి అర్ధరాత్రివేళ కరచరణాదులు లేని శివలింగంగా వచ్చాడు. అది జ్యోతిర్లింగం. అలా వచ్చాడు.

ఆవు ఎక్కడెక్కడో పుట్టలు, గుట్టలు తిరిగి పచ్చిగడ్డితిని వాహినుల్లో ప్రవహించే నీరు తాగి సేదతీరుతూ నెమరువేసుకుని, సాయంత్రానికి పాలగా మార్చుకుంటుంది. దూడవెళ్ళి నోటితో శిరం చుప్పరించినంత మాత్రం చేత ఒక్కసారిగా పాలు విడిచిపెట్టేస్తుంది. ఒకసారి అలా విడిచిపెడితే దానిని వెనక్కి తీయడం గోమాతకు సాధ్యం కాదు. అలా గురువుగారూ! మాకోసం మీరిది చెప్పాలి.. అని వెళ్ళి పాదాలు పట్టుకున్నంత మాత్రం చేత ఆవు–దూడలమీద ఎట్లా ప్రేమ చూపించి పాలు విడిచి పెడుతుందో.. అలా తాను కష్టపడి సమకూర్చుకున్న జ్ఞానాన్నంతటినీ గురువు బోధ రూపంలో శిష్యుడికి అనుగ్రహిస్తాడు.

అటువంటి గురుపాదాలపట్ల భక్తి కలిగి ఉండడం... జన్మజన్మాంతర సుకృతం. సర్వసాధారణంగా గురువు విషయంలో – ఆయన కూడా మనలాగే కరచరణాదులతో ఉన్నాడు, ఆయనా మనలాగే సంసారంలో ఉన్నాడు, మనలాగే ప్రవర్తిస్తున్నాడు... అన్న భావన కలుగుతుంది. ఎన్నో గులకరాళ్లలో పూజనీయమైన సాలగ్రామం కూడా కలిసిపోయి ఉంటుంది. అది సాలగ్రామమని తెలియగానే దానిని వేరుచేసి ఎలా పూజ చేస్తామో– అలాగే గురువు కూడా అందరితో కలిసిపోయినట్లు కనబడతాడు. కానీ ఆ గురువు వైభవాన్ని గుర్తించగలిగినవాడు ఎవడో ఆయన గొప్ప శిష్యుడు.

అటువంటి గురి వాగ్గేయకారులందరిలో మనకు చాలా గొప్పగా కనబడుతుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సువార్త

ఆకాశమంత దేవుని ప్రేమ

ఎందుకూ పనికి రాని ఆనాటి సుంకరులకు, పాపులకు బోధిస్తున్నాడంటూ యూదుమత ప్రముఖులైన పరిసయ్యులు, శాస్త్రులు యేసు ప్రభువు మీద అభియోగం మోపారు. సుంకరులంటే తమ పన్నుల వసూలు కోసం రోమా ప్రభుత్వం నియమించుకున్న యూదు ఉద్యోగులు. నిర్ణీతమొత్తాల కన్నా అత్యధికంగా డబ్బు వసూలుచేసే అవినీతిపరులుగా ముద్రపడి సమాజంలో పరువు కోల్పోయిన వాళ్ళు వీళ్ళు. పాపులంటే, ధర్మశాస్త్రాన్ని, యూదుమత బోధకుల ఆజ్ఞల్ని పాటించని, అవి పాటించే తీరికలేని సామాన్యులు, నిరుపేదలు. ఈ రెండు తెగలవారినీ 'పాపులు' అని యూదుమతప్రముఖుల న్నారు. కానీ యేసుప్రభువైతే వారిని ఎంతో కనికరంతో 'తప్పిపోయినవారు' అని మాత్రమే సంబోధించాడు. యేసుప్రభువుకున్న కాపరి తత్వాన్ని, దీనులు, పేదలు, తప్పిపోయినవారిపట్ల ఆయనకున్నప్రేమను ఆవిష్కరించే అద్భుతమైన బైబిల్ భాగం లూకా 15 వ అధ్యాయం. ఈ అధ్యాయంలో వంద గొర్రెల్లో ఒక గొర్రె తప్పిపోవడం, పది నాణెల్లో ఒక దాన్ని పోగొట్టుకోవడం, ఇద్దరు కొడుకుల్లో ఒకరు దారితప్పడం అన్నది ప్రధానాంశంగా ప్రభువు మూడు ఉపమానాలు వివరిస్తూ తన ప్రేమతత్వాన్ని బయల్పరచాడు.



ఒక కాపరికి వందగొర్రెలున్నాయి. పగలంతా వాటిని అడవిలో మేతకు వదిలి, పొద్దుగుంకే సమయానికి వాటిని తిరిగి సమకూర్చేటపుడు వాటిలో ఒకటి తప్పిపోయినట్టు కాపరి కనుగొన్నాడు. అపుడు కాపరి ఏం చెయ్యాలి? వందలో 99 తిరిగొచ్చాయి కదా, ఒక గొర్రె కోసం పాకులాడటం దేనికి? అనుకున్నా అందులో తప్పేమీ లేదు. కానీ కాపరి హృదయం అందుకు సమ్మతించదు. ఆ ఒక్క గొర్రె దొరికితే ఎంత లాభం? దాన్ని కోల్పోతే ఎంత నష్టం అనే 'లాభనష్టాల వ్యాపారకోణం' కన్నా, ఆ రాత్రికి దాని ఒంటరితనం, భయంతో బిక్క చచ్చిన దాని దీనత్వం, తనను తాను కాపాడుకోలేని ఆ గొర్రె నిస్సహాయత్వం, ప్రాణాపాయకరమైన దాని ప్రమాదభరిత నేపథ్యం, ఇవే కాపరి హృదయాన్ని కలచివేస్తాయి, దాన్ని వెదికి కనుగొనడానికి కాపరిని పురికొల్పుతాయి. కనికరం, కరుణ కలిగిన ఎవరిలోనైనా వ్యాపారకోణం మీద ఈ భావోద్వేగాలదే పై చేయి అవుతుంది.

తప్పిపోయే దాకా కాపరి తోడు వదిలేసిన గొర్రె అదయితే, అది దొరికే దాకా తన ప్రాణాలకు తెగించి మరీ దాన్ని వెదికి కనుగొన్న కాపరి ఆయన. అది తనను వదిలిందన్న కోపం కన్నా, అదెక్కడ ఏ పరిస్థితుల్లో ఉందోనన్న బాధే కాపరిది. అందుకే దాన్ని వెదికి తిరిగి కనుగొన్నపుడు కాపరి దాన్ని తిట్టలేదు, కొట్టలేదు సరికదా దాన్ని తన భుజాల మీద మోసుకొని ఇంటికి తెచ్చి తన స్నేహితులకు, పొరుగు వారికి దాన్ని చూపించి సంతోషించాడని బైబిల్ చెబుతుంది. తప్పిపోయిన వారిని వెదికి, కనుగొని, వారిని తన భుజాల మీద ఎత్తుకొని సంతోషించే దేవుని ప్రేమను వర్ణించే గొప్ప ఉపమానం ఇది. దేవుని అనంతమైన ప్రేమకు ప్రతిరూపంగా యేసుప్రభువు ఈ లోకానికి వచ్చిన అంతరార్థాన్ని వివరించే ఈ ఉపమానం దేవుని భావోద్వేగాలు, మితిలేని ఆయన ప్రేమ, కృప, కరుణ, కనికరాలకు అద్దం పడుతుంది.

– డా. సుభక్త

సినిమా

నిన్నిట్టా సూత్తుంటే..



• నాగార్జున, ఆషికా రంగనాథ్

'నిన్నిట్టా సూత్తుంటే ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే పిల్ల.. ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే..' అంటూ హీరోయిన్ ఆషికా రంగనాథ్‌ని చూసి పాడేస్తున్నారు హీరో నాగార్జున. విజయ్ బిన్నీ దర్శకత్వంలో నాగార్జున, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న 'నా సామి రంగ' చిత్రంలోని పాట ఇది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే పిల్ల...' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, రామ్ మిరియాల పాడారు. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'నా సామి రంగ'. ఈ సినిమాలో నాగార్జున ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు. 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే పిల్ల..' పాటలో నాగార్జున, ఆషిక కెమిస్ట్రీ అందర్నీ ఆకట్టుకుంటుంది. నాగార్జున హ్యాండ్సమ్ లుక్స్, ఆషిక ట్రెడిషనల్ గెటప్ ఆకట్టుకుంటాయి. ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. సంక్రాంతికి విడుదల కానున్న మా సినిమా కుటుంబంతో కలిసి చూసేలా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

స్టైలిష్ డెవిల్



• కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ టైటిల్ రోల్‌లో రూపొందిన తాజా చిత్రం 'డెవిల్'. అభిషేక్ పిక్చర్స్‌పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ఇది. ఈ నెల 29న ఈ పీరియాడికల్ డ్రామాని విడుదల చేయనున్నారు. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పరిపాలించిన కాలానికి సంబంధించిన కథ ఇది. ఈ చిత్రంలో కల్యాణ్ రామ్ భారతీయుడు అయినప్పటికీ బ్రిటిష్ గూఢచారి డెవిల్ పాత్రలో కనిపించనున్నారు. భారతీయత ఉట్టిపడటంతో పాటు స్టైలిష్ గూఢచారిగా చూపించేందుకు కాస్ట్యూమ్ డిజైనర్ రాజేశ్‌తో 90 కాస్ట్యూమ్స్ తయారు చేయించారు అభిషేక్ నామా. ఈ దుస్తుల గురించి కాస్ట్యూమ్ డిజైనర్ రాజేశ్ మాట్లాడుతూ– ''హీరో లుక్ కొత్తగా ఉండేలా ట్రై చేశాం. ధోతి, పైన ఒక వెయిస్ట్ కోటుతో ఆయన కాస్ట్యూమ్స్‌లో భారతీయత కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇటలీ నుంచి తెప్పించిన మోహైర్ ఊల్‌తో 60 బ్లేజర్స్, దేశీ కాటన్‌తో కుర్తాలు, ధోతీలు తయారు చేశాం. 25 వెయిస్ట్ కోట్స్ కుట్టాం. బ్లేజర్ జేబు పక్కన వేలాడుతూ ఉండేలా ఓ హ్యాంగింగ్ వాచ్‌ను ప్రత్యేకంగా తయారు చేయించాం'' అన్నారు.

సరదా.. సరదాగా...

హీరో వెంకటేశ్ నటిస్తున్న 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సరదా.. సరదాగా...' అంటూ సాగే రెండో పాటని నేడు విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. వెంకటేశ్, శ్రద్ధా శ్రీనాథ్, బేబీ సారా కలిసి సరదాగా సముద్రపు ఒడ్డున చిరునవ్వులు చిందిస్తూ నడుస్తున్న పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన 'రాంగ్ యూసేజ్..' అనే తొలి పాటకి మంచి స్పందన వస్తోంది. 'సరదా.. సరదాగా...' పాట కూడా అద్భుతంగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్), సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు.



• వెంకటేశ్, సారా, శ్రద్ధా శ్రీనాథ్

ఏపీలో చిత్రపరిశ్రమ అభివృద్ధి కావాలి

ఏపీ చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ఏయం రత్నం




• మోహన్ గౌడ్, ఏయం రత్నం, విజయ్ వర్మ

ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి నూతన అధ్యక్షుడిగా నిర్మాత ఏయం రత్నం ఎన్నికయ్యారు. ఆదివారం 5వ వార్షిక సర్వసభ్య సమావేశం, 2023–25 సంవత్సరాలకు నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం విజయవాడలో జరిగాయి. నూతన అధ్యక్షుడిగా ఏయం రత్నం, ఉపాధ్యక్షులుగా పి. విజయ్ వర్మ, సీహెచ్. లక్ష్మీ నరసింహం, మంతా శ్రీనివాస్, కార్యదర్శిగా జేవీ మోహన్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా పి. రమణా రెడ్డి, యస్.యస్. మూర్తి, కోశాధికారిగా యం. శ్రీనాథరావు, కార్యవర్గ సభ్యులుగా నిర్మాతల విభాగం నుంచి పీడీఆర్. ప్రసాద్ రెడ్డి, వీవీ రామానుజం, మిత్తాన ఈశ్వర రావు, యు. వెంకట్ రావు, రవీంద్ర గోపాల, పంపిణీదారుల విభాగం నుంచి కె. రవీంద్రనాథ్ ఠాగూర్ బాబు, ఆర్.వి.యస్. వరప్రసాద్, మిర్జా అబీద్ హుస్సేన్, స్టూడియో విభాగం నుంచి బి. హనుమంతరావు ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏయం రత్నం మాట్లాడుతూ– ''ఏపీలో కూడా చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉందని భావించి, అధ్యక్షుడిగా వ్యవహరించడానికి అంగీకరించాను'' అన్నారు.

జేడీ చక్రవర్తి, శ్రీకాంత్ హీరోలుగా నటించిన చిత్రం 'వన్ బై టు'. శివ నాగేశ్వర రావు దర్శకత్వంలో తమ్మారెడ్డి భరద్వాజ నిర్మించిన ఈ సినిమా 1994 డిసెంబరు 10న విడుదలైంది. ఈ చిత్రం రిలీజై ముప్పై ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం 'థర్టీ ఇయర్స్ ఆఫ్ వన్ బై టు' పేరుతో హైదరాబాద్‌లో రీ యూనియన్ కార్యక్రమాన్ని నిర్వహించింది చిత్ర యూనిట్. తమ్మారెడ్డి భరద్వాజ, శివ నాగేశ్వర రావు, జేడీ చక్రవర్తి , శ్రీకాంత్, కెమెరామేన్ బాబు, నటులు భిక్షు, చిట్టి తదితరులు పాల్గొని, ముప్పై ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.



స్నేహానికి హద్దు లేదురా



• ఆశిష్ గాంధీ

ఆశిష్ గాంధీ, అశోక్, వర్ష, ప్రతీక హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'హద్దు లేదురా..'. రాజశేఖర్ రావి దర్శకత్వంలో వీరేష్ గాజుల బళ్లారి నిర్మించారు. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ని దర్శకుడు క్రిష్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''హద్దు లేదురా..' టైటిల్ బాగుంది. ఫస్ట్ లుక్, సినిమా థీమ్ వైవిధ్యంగా ఉన్నాయి. సినిమా హిట్ అవ్వాలి'' అన్నారు. ''అలనాటి కృష్ణార్జునులు స్నేహితులు అయితే ఎలా ఉంటారో తెలిపే కథ, కథనంతో 'హద్దు లేదురా..' రూపొందింది. ఫైట్స్, పాటలు, సెకండ్ హాఫ్‌లో వచ్చే ట్విస్టులు, క్లైమాక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు రాజశేఖర్ రావి. ''జనవరిలో మా సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు గాజుల వీరేశ్. ''స్నేహం నేపథ్యంలో రూపొందిన 'హద్దు లేదురా..' మా యూనిట్‌కి మంచి పేరు తీసుకొస్తుంది'' అన్నారు ఆశిష్ గాంధీ. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సహ నిర్మాత: రావి మోహన్ రావు.

రెండు వారాల గ్యాప్‌లో రెండు హిట్లు – మాటల రచయిత నాగేంద్ర కాశీ



''నేను మాటలు అందించిన 'కోట బొమ్మాళి' (నవంబర్ 24), 'హాయ్ నాన్న' (డిసెంబరు 7) చిత్రాలు రెండు వారాల గ్యాప్‌లో విడుదలై సక్సెస్ అవడం సంతోషంగా ఉంది. 'కోట బొమ్మాళి' పొలిటికల్ థ్రిల్లర్. 'హాయ్ నాన్న' ఎమోషన్స్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. రెండు విభిన్నమైన కథలకు మాటలు అందించిన నాకు మంచి పేరొచ్చింది. నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు, డైరెక్టర్ సుకుమార్ గార్లు ప్రత్యేకంగా అభినందించడం మరచిపోలేను'' అన్నారు మాటల రచయిత నాగేంద్ర కాశీ. ఇంకా తన కెరీర్ గురించి నాగేంద్ర మాట్లాడుతూ– ''నాది కోనసీమ జిల్లా అమలాపురం. నాన్న నాగేశ్వరరావు, అమ్మ సత్యవతి. రచన, సాహిత్యంపై ఇష్టంతో ఇంటర్ చదివే రోజుల నుంచే కథలు రాయడం మొదలుపెట్టాను. నేను రాసిన కథలతో 'నల్ల వంతెన' అనే తొలి పుస్తకం పబ్లిష్ చేశాను. దీనికి నాలుగు అవార్డులు వచ్చాయి. తొలిసారి 'పలాస 1978' సినిమాకి కో రైటర్‌గా పని చేశా. ఆ తర్వాత 'తోలు బొమ్మలాట' మూవీకి రచనా సహకారం చేశాను. 'శ్రీదేవి సోడా సెంటర్' సినిమాకి కథ ఇచ్చాను. నా 'నల్ల వంతెన'లో ఓ కథ నచ్చడంతో నాకు 'సుకుమార్ రైటింగ్స్‌లో' చాన్స్ ఇచ్చారు డైరెక్టర్ సుకుమార్‌గారు. 'విరూపాక్ష'కి రైటింగ్ విభాగంలో చేశా. ఆ తర్వాత రామ్‌చరణ్– బుచ్చిబాబుగార్ల మూవీకి బుచ్చిబాబుగారితో కలిసి మాటలు రాస్తున్నాను. 'పుష్ప 2' సినిమాకి రచయితల విభాగంలో చేస్తున్నాను. అలాగే రష్మిక నటిస్తున్న 'రెయిన్‌బో'కి మాటలు అందిస్తున్నాను. సుకుమార్‌గారి వద్ద పని చేసే చాన్స్ రావడం నా లక్. భవిష్యత్తులో డైరెక్టర్ కావాలని ఉంది. ఐదు కథలు సిద్ధం చేసుకున్నాను'' అన్నారు.

ఈ కథలో...



• ఫణి రాజ్, క్రిష్

హోమానంద్, రేవంత్ హీరోలుగా, సిమ్రాన్ పరింజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఈ కథలో నేను'. ఎమ్మెస్ ఫణిరాజ్ దర్శకత్వంలో ఎం. అచ్చిబాబు సమర్పణలో టి. కేశవ తీర్థ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ని డైరెక్టర్ క్రిష్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రం నేటి ట్రెండ్‌కి, ఇప్పటి యూత్‌కి సరిపోయేలా ఉంటుంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ఎమ్మెస్ ఫణిరాజ్ మాట్లాడుతూ– ''లవ్ అండ్ లస్ట్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారితో పాటలు రాయించుకునే అదృష్టం మా సినిమాకి, నాకు దక్కింది. ఆయన తనయుడు యోగి శ్రీ మంచి సంగీతం అందించారు'' అన్నారు. ''ఫణిగారు ఓ మంచి చిత్రాన్ని మాకు ఇచ్చినందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు అచ్చిబాబు. ఈ చిత్రానికి కెమెరా: మల్హర్ భట్ జోషి.

నవ్వుల నమో



• విశ్వంత్, విస్మయ శ్రీ, అనురూప్

విశ్వంత్ దుద్దంపూడి, అనురూప్ కటారి హీరోలుగా, విస్మయ శ్రీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నమో'. ఈ చిత్రం ద్వారా ఆదిత్య రెడ్డి కుందూరు దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎ. ప్రశాంత్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఆదిత్య నా దగ్గర అసిస్టెంట్‌గా చేశాడు. ఏదో చేయాలనే, నేర్చుకోవాలనే తపన తనలో ఉంది. 'నమో' పేరు వినగానే ప్రధాని నరేంద్ర మోదీగారి మీద కథ అనుకున్నాను. హీరోల పాత్రల పేర్లలోని (నగేశ్, మోహన్) తొలి అక్షరాలతో టైటిల్ పెట్టినట్లు చెప్పాడు. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''నమో' ప్రేక్షకులు హాయిగా నవ్వుకునేలా ఉంటుంది'' అన్నారు ఆదిత్య రెడ్డి కుందూరు. ''ఇదొక వైవిధ్యమైన చిత్రం'' అన్నారు విశ్వంత్ దుద్దంపూడి, అనురూప్ కటారి, విస్మయ.



తొమ్మిదో స్థానంతో భారత్ ముగింపు... 'షూటౌట్'లో అమెరికాపై విజయం

జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు తొమ్మిదో స్థానం దక్కింది. చిలీ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో 9–10 స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 3–2 గోల్స్ తేడాతో అమెరికా జట్టును ఓడించింది. నిర్ణీత 60 నిమిషాలు ముగిశాక భారత్, అమెరికా జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున మంజు (11వ ని.లో), సునెలితా (57వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... అమెరికా జట్టుకు కిర్‌స్టెన్ థామస్ (27వ, 53వ ని.లో) రెండు గోల్స్ అందించింది. 'షూటౌట్'లో మొదటి ఐదు షాట్‌లు ముగిశాక కూడా రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున ముంతాజ్, రుతుజా గోల్స్ చేయగా... ప్రీతి, సాక్షి, అన్ను విఫలమయ్యారు. అమెరికా జట్టు తరఫున అబిగెయిల్, లారెన్ వడాస్, అండర్‌వుడ్ కొట్టిన షాట్‌లను భారత గోల్‌కీపర్ మాధురి నిలువరించగా... కేటీ డిక్సన్, ఒలివియా గోల్స్ చేశారు. 'సడెన్‌డెత్'లో లారెన్ వడాస్ షాట్‌ను మాధురి అడ్డుకోగా... అనంతరం రుతుజా గోల్‌తో భారత విజయం ఖరారైంది.

అశ్విని-తనీషా జోడీకి మహిళల డబుల్స్ టైటిల్



గువాహటి: ఆద్యంతం నిలకడగా రాణించిన అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీ ఈ ఏడాది మూడో డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ముగిసిన గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ –100 బ్యాడ్మింటన్ టోర్నీలో అశ్విని–తనీషా ద్వయం విజేతగా నిలిచింది. 40 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అశ్విని–తనీషా జోడీ 21–13, 21–19తో సుంగ్ షువో యున్–యు చియెన్ హుయ్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. విజేతగా నిలిచిన అశ్విని–తనీషా జోడీకి 7,900 డాలర్ల (రూ. 6 లక్షల 58 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది అశ్విని–తనీషా ద్వయం అబుదాబి మాస్టర్స్, నాంటెస్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీల్లోనూ టైటిల్స్ గెలిచింది.

జ్యోతి సురేఖకు రజతం



తావోయువాన్ సిటీ (చైనీస్ తైపీ): వరల్డ్ ఇండోర్ ఆర్చరీ సిరీస్‌లో భాగంగా జరిగిన తైపీ ఓపెన్ టోర్నీలో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు స్వర్ణ, రజత పతకాలు లభించాయి. ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ రజత పతకం సాధించగా... భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో జ్యోతి సురేఖ 145–146తో పర్ణీత్ కౌర్ చేతిలో ఓడిపోయింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్ ప్రథమేశ్ స్వర్ణ పతకం నెగ్గాడు. ఫైనల్లో ప్రథమేశ్ 149–148తో మైక్ ష్లాసెర్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు.

తొలి మ్యాచ్ వర్షార్పణం

భారత్–దక్షిణాఫ్రికా తొలి టి20 రద్దు



డర్బన్: దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్‌కు వర్షం ఎదురైంది. సఫారీలో కఠిన సవాలు ఎదురవుతుందనుకుంటే ఎడతెరిపిలేని వర్షంతో తొలి టి20 మ్యాచ్ రద్దయ్యింది. అదేపనిగా వాన కురవడంతో పిచ్‌పై కప్పి ఉంచిన కవర్స్‌ను తీయాల్సిన అవసరమే రాలేదు. కాస్త ఆలస్యంగానైనా మ్యాచ్‌ను ఆస్వాదించవచ్చని ఎదురుచూస్తూ మైదానంలో గొడుగుల కిందే గడిపిన క్రికెట్ ప్రియుల ఆశలపై నీళ్లు పడ్డాయి. ఆగని వాన వల్ల కనీసం టాస్ కూడా వేసే అవకాశం లేకపోయింది. దీంతో మైదానంలో ఆడాల్సిన ఇరుజట్ల ఆటగాళ్లు... డ్రెస్సింగ్ రూమ్‌లలో సగటు ప్రేక్షకుల్లానే మిగిలిపోయారు. వాతావరణ పరిస్థితిని సమీక్షించిన ఫీల్డ్ అంపైర్లు బొన్‌గని జెలె, స్టీఫెన్ హారిస్ రెండు గంటల అనంతరం ఓ నిర్ణయానికి వచ్చారు. వాన ఇంకా కొనసాగడం, అవుట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా ఉండటంతో ఇక మ్యాచ్ నిర్వహించేందుకు అవకాశం లేదని, ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మెరుపులు చూడాలనుకున్న అభిమానులంతా చినుకులతో విసిగి నిరాశగా వెనుదిరిగారు. మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో భారత్, దక్షిణాఫ్రికాల మధ్య రెండో టి20 మ్యాచ్ జరుగుతుంది.

హర్మన్‌ప్రీత్ బృందానికి ఊరట

- ఇంగ్లండ్‌తో ఆఖరి టి20 మ్యాచ్‌లో ఐదు వికెట్లతో నెగ్గిన భారత్
- రాణించిన శ్రేయాంక, సైకా, స్మృతి



ముంబై: వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి... ఇంగ్లండ్ జట్టుకు సిరీస్‌ను అప్పగించేసిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు తేరుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఐదు వికెట్ల తేడాతో గెలిచి పరువు నిలబెట్టుకుంది. దాంతో మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని ఆశించిన హీతెర్ నైట్ నాయకత్వంలోని ఇంగ్లండ్ తుదకు సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ సరిగ్గా 20 ఓవర్లలో 126 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ హీతెర్ నైట్ (42 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా, అమీ జోన్స్ (21 బంతుల్లో 25; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. ఇంగ్లండ్ 76 పరుగులకు 8 వికెట్లు కోల్పోయిన దశలో హీతెర్ నైట్, చార్లీ డీన్ (15 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్) తొమ్మిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఇన్నింగ్స్ చివరి రెండు బంతుల్లో హీతెర్, మహికా గౌర్ (0) అవుటవ్వడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. భారత స్పిన్నర్లు సైకా ఇషాక్ (3/22), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయాంక పాటిల్ (3/19) ఇంగ్లండ్ జట్టును దెబ్బ కొట్టారు. సీమర్లు రేణుక సింగ్, అమన్‌జోత్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ మహిళల జట్టు 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసి గెలిచింది. ఆరంభంలోనే షఫాలీ వర్మ (6) నిష్క్రమించినా... ఓపెనర్ స్మృతి మంధాన (48 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా (33 బంతుల్లో 29; 4 ఫోర్లు) రెండో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. అనంతరం విజయానికి చేరువైన తరుణంలో దీప్తి శర్మ (12), స్మృతి, రిచా ఘోష్ (2) స్వల్పవ్యవధిలో నిష్క్రమించారు. ఉత్కంఠకు దారితీస్తున్న దశలో అమన్‌జోత్ (4 బంతుల్లో 13 నాటౌట్; 3 ఫోర్లు) 19వ ఓవర్లో 3 బౌండరీలు కొట్టి భారత్‌ను గెలిపించింది. ఇంగ్లండ్ ప్లేయర్ నాట్ సివర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ 14 నుంచి డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతుంది.



సిరీస్ ట్రోఫీతో హీతెర్ నైట్

భారత జట్టుకు నిరాశ

సెంచరీతో పాక్‌ను గెలిపించిన అజాన్



అజాన్

దుబాయ్: ఆసియా కప్ అండర్–19 క్రికెట్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఎనిమిది వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగులు చేసింది. ఆదర్శ్ సింగ్ (62; 4 ఫోర్లు, 1 సిక్స్), ఉదయ్ (60; 5 ఫోర్లు), సచిన్ (58; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం పాకిస్తాన్ 47 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 263 పరుగులు చేసి గెలిచింది. అజాన్ అవైస్ (105 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ సెంచరీతో పాక్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. షాజైబ్ ఖాన్ (63; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాద్ బేగ్ (68 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. భారత జట్టు సెమీఫైనల్ చేరాలంటే మంగళవారం నేపాల్‌తో జరిగే మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి.

వారియర్స్ విక్టరీ



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో బెంగాల్ వారియర్స్ రెండో విజయం సాధించింది. తమిళ్ తలైవాస్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 48–38 పాయింట్ల తేడాతో గెలిచింది. కెప్టెన్ మణీందర్ సింగ్ అత్యధికంగా 16 పాయింట్లు స్కోరు చేసి వారియర్స్ విక్టరీలో కీలకపాత్ర పోషించాడు. తమిళ్ తలైవాస్ తరఫున నరేందర్ 13 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 35–33తో దబంగ్ ఢిల్లీ జట్టును ఓడించింది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	4	3	1	0	16
బెంగాల్ వారియర్స్	3	2	0	1	13
యూపీ యోధాస్	3	2	1	0	11
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	2	1	1	0	5
జైపూర్ పింక్ పాంథర్స్	2	0	1	1	4
బెంగళూరు బుల్స్	4	0	4	0	4
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

రన్నరప్ ఆదర్శ్



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణ కుర్రాడు ఉప్పల ఆదర్శ్ శ్రీరామ్ రన్నరప్‌గా నిలిచాడు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత వీరేశ్ శరణార్థి (మహారాష్ట్ర), ఆదర్శ్ శ్రీరామ్ 9.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. వీరేశ్ విజేతగా అవతరించాడు. ఆదర్శ్ శ్రీరామ్ రన్నరప్‌గా నిలిచాడు. తమిళనాడుకు చెందిన రాఘవ్ తొమ్మిది పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. బాలికల విభాగంలో మహారాష్ట్రకు చెందిన శ్రేయ విజేతగా నిలిచింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత శ్రేయ 9.5 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నైనా గొర్లి ఏడో స్థానాన్ని పొందింది. తెలంగాణకు చెందిన కీర్తిక ఎనిమిదో స్థానంలో, దీక్షిత పదో స్థానంలో, శివాంశిక 12వ స్థానంలో నిలిచారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎంహెచ్‌వో, నెల్లూరులో 33 పారామెడికల్ పోస్టులు

నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 33
» **పోస్టుల వివరాలు:** ఓటీ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, అనెస్తీషియా టెక్నీషియన్, క్లినికల్ సైకాలజిస్ట్, బయో మెడికల్ టెక్నీషియన్, ఓటీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, నెల్లూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2023.
» **వెబ్‌సైట్:** spsnellore.ap.gov.in

పాడేరు జీజీహెచ్‌లో 256 పారామెడికల్ పోస్టులు

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో..ఒప్పంద/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 256
» **పోస్టుల వివరాలు:** రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్, స్టోర్ కీపర్, అనెస్తీషియా టెక్నీషియన్, ఆడియో విజువల్ టెక్నీషియన్, ఆడియోమెట్రీ టెక్నీషియన్, బయోమెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, చైల్డ్ సైకాలజిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, కంప్యూటర్ ప్రోగ్రామర్, డెంటల్ టెక్నీషియన్, తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీఎంహెచ్‌వో తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2023.
» **వెబ్‌సైట్:** allurisitharamaraju.ap.gov.in

విజయనగరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 23 పోస్టులు

విజయనగరం జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
» **పోస్టులు:** డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కుక్, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్, పిటి ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, విజయనగరం, విజయనగరం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2023.
» **వెబ్‌సైట్:** vizianagaram.ap.gov.in

జేఎన్‌టీయూ అనంతపురంలో పీహెచ్‌డీ ప్రవేశాలు

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్శిటీ (జేఎన్‌టీయూ).. పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఇంగ్లిష్, ఫుడ్ టెక్నాలజీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 55శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఐదేళ్ల పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ అనంతపురం, అనంతపురం చిరునామకు స్పీడ్ పోస్టు/కొరియర్ ద్వారా పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.12.2023.
» **వెబ్‌సైట్:** www.jntua.ac.in

కానిస్టేబుల్ కొలువుల పిలుపు

» సాయుధ దళాల్లో 26 వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టులు
» దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్
» కొలువు సొంతమైతే పే లెవల్-3తో ప్రారంభ వేతనం
» పదో తరగతి ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం

పదో తరగతి అర్హతతోనే యూనిఫామ్ సర్వీసులో చేరే అవకాశం స్వాగతం పలుకుతోంది! ఈ కొలువుతో ఆకర్షణీయ వేతనం, సమాజంలో గౌరవంతో పాటు దేశ భద్రతలో పాల్పంచుకునే అవకాశం లభిస్తుంది! స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కేంద్ర సాయుధ దళాల్లో జనరల్ డ్యూటీ విభాగంలో 26వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (జీడీ) నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఎస్ఎస్‌సీ జాబ్స్

మొత్తం పోస్టులు 26,146

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం– కేంద్ర హోంశాఖ పరిధిలోని ఏడు దళాల్లో మొత్తం 26,164 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనుంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్–6,174 పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ –11,025 పోస్టులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ –3,337 పోస్టులు, సశస్త్ర సీమాబల్–635 పోస్టులు, ఇండో–టిబెటిన్ బోర్డర్ పోలీస్ 3,189 పోస్టులు, అస్సాం రైఫిల్స్(రైఫిల్‌మెన్)–1,490 పోస్టులు, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్–296 పోస్టులు. అస్సాం రైఫిల్స్ విభాగంలో రైఫిల్ మెన్ హోదాలో పోస్టులు ఉన్నాయి. మహిళా అభ్యర్థులకు మొత్తం పోస్టులలో 2,799 పోస్టులను కేటాయించారు.

అర్హతలు

- 2024 జనవరి 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024 జనవరి 1 నాటికి 18–23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఇస్తారు.

పే లెవల్-3 వేతనం

తుది నియామకాలు ఖరారు చేసుకుని జనరల్ డ్యూటీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన వారికి ప్రారంభంలోనే పే లెవల్–3తో వేతనం అందిస్తారు. అంటే నెలకు రూ.21,700–రూ. 69,100తో నెల వేతన శ్రేణి అందుకోవచ్చు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులకు సంబంధించి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అవి..రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఈ మూడు దశల తర్వాత డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్‌లను కూడా నిర్వహిస్తారు.

160 మార్కులకు రాత పరీక్ష

కానిస్టేబుల్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో 160 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 20 ప్రశ్నలు–40 మార్కులు, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–40 మార్కులు, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 20 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ 20 ప్రశ్నలు–40 మార్కులకు చొప్పున మొత్తం 80 ప్రశ్నలు–160 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం ఒక గంట. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు తగ్గిస్తారు.

ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష

ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (జీడీ) పరీక్షను హిందీ, ఇంగ్లిష్‌తోపాటు 13 ప్రాంతీయ భాషల్లో (అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం, మణిపురి, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ) నిర్వహిస్తారు.

పీఎస్‌టీ/పీఈటీ

- తొలిదశ రాత పరీక్ష తర్వాత అభ్యర్థులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ)లను నిర్వహిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌కు అర్హత పొందాలంటే..రాత పరీక్షలో కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 25 శాతం మార్కులు, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు పొందాలి.
- **పీఈటీ:** ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు, ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు అయిదు కిలో మీటర్లను 24 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని ఎనిమిదిన్నర నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.
- **పీఎస్‌టీ:** రాత పరీక్ష తర్వాత ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా తర్వాత దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష, మహిళా అభ్యర్థులకు వేర్వేరు భౌతిక ప్రామాణికాలు నిర్ణయించారు. పురుష అభ్యర్థులు 170 సెంటీ మీటర్లు, మహిళా అభ్యర్థులు 157 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. పురుష అభ్యర్థులకు కనీస ఛాతి కొలత 80 సెంటీ మీటర్లు శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీ మీటర్లు విస్తరించాలి.

తుది ఎంపిక

తుది నియామకాలను ఖరారు చేసే క్రమంలో మొత్తం నాలుగు దశల్లో చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌ల్లో పొందిన మార్కులు, ఇతర రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు. మొత్తం ఈ నాలుగు దశల్లోనూ అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

పరీక్షలో రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్ అండ్ జనరల్ నాలెడ్జ్

ఇందులో స్కోర్ కోసం భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్,ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్/ హిందీలలో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న భాషను ఎంచుకోవచ్చు. అధిక శాతం మంది ఇంగ్లిష్‌నే ఎంచుకుంటున్నారు. ఈ విభాగంలో రాణించడానికి బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 31.12.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024 జనవరి 4 – 6 వరకు.
- **రాత పరీక్ష తేదీ:** 2024 ఫిబ్రవరి/మార్చిలో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ		మార్పు	ముగింపు
సెన్సెక్స్	▲	304	69,826
నిఫ్టీ	▲	68	20,969

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,404	▲	64
డోజోన్స్	36,248	▲	130
ఎఫ్‌టీఎస్ఈ 100	7,554	▲	41
డాక్స్	16,759	▲	130
షాంఘై	2,969	▲	3
నికాయ్	32,308	▼	583

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.09	106.45
€	యూరో	ఎస్‌బీఐ	88.90	91.25
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.37	58.68
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.18	56.11
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.29	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.33

ఆరోగ్య బీమా భారం తగ్గేదెలా..?




- కోపేమెంట్, డిడక్టబుల్‌తో తక్కువ ప్రీమియం
- పరిమిత కవరేజీతో బేస్ ప్లాన్
- సూపర్ టాపప్ జోడింపుతో మెరుగైన కవరేజీ
- రూమ్ షేరింగ్‌తో భారం తగ్గించుకోవచ్చు
- ఆరోగ్యం కోసం శ్రమించినా డిస్కౌంట్
- చివరి ఆప్షన్ ఇన్సూరెన్స్ పోర్టింగ్

రమణ్‌సింగ్ (68)కు ఇటీవలే హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పాలసీ రెన్యువల్ నోటీస్ వచ్చింది. చూస్తే ప్రీమియం గతేడాది కంటే గణనీయంగా పెరిగిపోయింది. ఏకంగా 30 శాతం అధికంగా చెల్లించాల్సి రావడంతో దీన్ని ఎలా అధిగమించాలా? అనే ఆలోచనలో పడ్డాడు. రమణ్‌సింగ్‌కు మాత్రమే ఈ అనుభవం పరిమితం కాదు. దాదాపు అన్ని బీమా సంస్థలు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ఇటీవలి కాలంలో పెంచేశాయి. దీంతో సగటు మధ్యతరగతి వాసులపై హెల్త్ ఇన్సూరెన్స్ రూపంలో భారం పెరిగిపోయింది. కరోనా విపత్తు తర్వాత నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు గణనీయంగా పెరగడం పాలసీదారులకు తెలిసిన అనుభవమే. దీనికి క్లెయిమ్‌లు భారీగా పెరిగిపోవడమే కారణమని బీమా సంస్థలు చెబుతున్నాయి. ఈ పరిణామాలతో వృద్ధులకు హెల్త్ కవరేజీ విషయంలో కొన్ని బీమా సంస్థలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. అధిక ప్రీమియంకు తోడు, పలు షరతులు పెడుతున్నాయి. వృద్ధులకు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం భారంగా మారుతున్న తరుణంలో దీన్ని తగ్గించుకునే మార్గాల గురించి చర్చించే కథనమే ఇది.

బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) తాజా వార్షిక నివేదిక ప్రకారం.. హెల్త్ ఇన్సూరెన్స్ ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 2020–21లో 94 శాతంగా ఉంటే, అది 2021–22 సంవత్సరానికి 109 శాతానికి పెరిగింది. ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 100 శాతానికి దిగువన ఉంటేనే బీమా సంస్థలకు లాభం ఉన్నట్టు. 100 అంతకంటే ఎక్కువ ఉన్నట్టయితే, తమకు వస్తున్న ప్రీమియానికి మించి అవి చెల్లింపులు చేస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. ''గడిచిన కొన్ని సంవత్సరాలుగా హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు పెరిగిపోయాయి. కరోనా తర్వాత అన్ని వయసుల వారి నుంచి క్లెయిమ్‌లు 10–30 శాతం వరకు ఎక్కువయ్యాయి. దీనివల్ల వృద్ధులపై భారం పెరిగిపోయింది. వీరు అధిక ప్రీమియం చెల్లించాల్సి వస్తోంది. పైగా వృద్ధుల్లో క్రమం తప్పకుండా ఆదాయం వచ్చే సదుపాయం అందరికీ ఉండదు'' అని పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్ తెలిపారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువ. దీంతో ఈ వయసులోని వారికి సహజంగానే ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు ఇటీవలి కాలంలో క్లెయిమ్‌లు పెరగడంతో బీమా సంస్థలు ప్రీమియంను మరింత పెంచాయి. ''వృద్ధులకు సహజంగా హెల్త్ రిస్క్‌లు ఎక్కువ. దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా వీరు హెల్త్ కవరేజీ ఎక్కువగా వినియోగించుకుంటూ ఉంటారు. కనుక క్లెయిమ్‌ల రిస్క్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే బీమా సంస్థలు ప్రీమియంను నిర్ధారిస్తుంటాయి. 30 ఏళ్ల వయసు వారి ప్రీమియంతో పోలిస్తే 60 ఏళ్లకు పైబడిన వారి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం 2.5 రెట్ల నుంచి 4 రెట్ల వరకు అధికంగా ఉంటుంది'' అని గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్ట్ సేల్స్ హెడ్ వివేక్ చతుర్వేది తెలిపారు. సీనియర్ సిటిజన్లలో కొందరికి బీమా సంస్థలు పాలసీలు ఇచ్చేందుకు నిరాకరిస్తుంటాయి. వారికి ముందస్తుగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో వచ్చిన ఫలితాలే దీనికి కారణమని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో తపన్ సింఘాల్ పేర్కొన్నారు.

కోపేమెంట్..



కోపేమెంట్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే, ప్రతి క్లెయిమ్‌లో పాలసీదారు తన వంతు కొంత భరించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని బీమా సంస్థలు చెల్లిస్తాయి. సాధారణంగా ఈ కోపేమెంట్ అనేది బీమా కవరేజీలో 10 శాతం నుంచి 50 శాతం వరకు ఉంటుంది. 20 శాతం కోపేమెంట్ ఎంపిక చేసుకుంటే, క్లెయిమ్ మొత్తంలో పాలసీదారు 20 శాతం, మిగిలిన 80 శాతం బీమా సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. క్లెయిమ్‌లో తన వైపు భారం తగ్గుతుంది కనుక బీమా సంస్థ ప్రీమియంలో తగ్గింపును ఇస్తుంది. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే.. కోపేమెంట్‌తో ప్రీమియంలో ఆదా అయిన మొత్తం కంటే, క్లెయిమ్ వచ్చినప్పుడు పాలసీదారు తన వంతు వాటాగా చెల్లించే మొత్తమే అధికంగా ఉంటుంది. అయినా సరే భారీ ప్రీమియం చెల్లించడం కష్టమనుకునే వారు కోపేమెంట్ ఆప్షన్‌ను పరిశీలించొచ్చు. దీనివల్ల పాలసీ ప్రీమియంలో 30–40 శాతం వరకు ఆదా చేసుకోవచ్చు. ''వృద్ధులకు అదనపు వైద్య సంరక్షణ అవసరం ఉంటుంది. కనుక వారు ఆసుపత్రిలో చేరితే ఎక్కువ రోజుల పాటు ఉండాల్సి రావచ్చు. అందుకని హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఎంపిక చేసుకునే వారు ఇన్ పేషెంట్ (ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందే వారు)లో గరిష్ఠ కవరేజీని ఆఫర్ చేసే ప్లాన్‌ను పరిశీలించాలి. వ్యాధుల వారీగా ఎవైనా మినహాయింపులు, ఉప పరిమితులు, కోపేమెంట్ ఉన్నాయేమో పరిశీలించాలి'' అని తపన్ సింఘాల్ సూచించారు.

డిడక్టబుల్..



పాలసీదారులు ప్రీమియం తగ్గించుకునేందుకు ఉన్న మార్గాల్లో మరొకటి డిడక్టబుల్ క్లాజ్. ఇది కూడా కోపేమెంట్ మాదిరే పనిచేస్తుంది. ఉదాహరణకు రూ.50,000 డిడక్టబుల్ అనే క్లాజ్ ఉందనుకుంటే.. రూ.50,000 మించిన క్లెయిమ్‌లకే బీమా సంస్థలు చెల్లింపులు చేస్తాయి. కోపేమెంట్ అలా కాదు. 10 శాతం కోపే ఉంటే రూ.50,000 క్లెయిమ్‌లో పాలసీహోల్డర్ రూ.5,000 చెల్లించాల్సి వస్తుంది. బీమా సంస్థ రూ.45,000 చెల్లిస్తుంది. కోపేమెంట్ అనేది ప్రతి క్లెయిమ్‌కు వర్తిస్తుంది. అదే డిడక్టబుల్ అనేది ఏడాది మొత్తానికి (కొన్ని బీమా సంస్థల్లో) స్థిరంగా ఉంటుంది. డిడక్టబుల్ ఎంత ఎక్కువ పెట్టుకుంటే, ప్రీమియం అంత మేర తగ్గుతుంది. క్లెయిమ్‌లలో ఆ మేర భారం పాలసీదారులపై పడుతుంది. మరొక ఉదాహరణలో.. ఆస్పత్రిలో చేరి సర్జరీ చేయించుకుంటే రూ.2,00,000 బిల్లు వచ్చింది. డిడక్టబుల్ రూ.20,000 ఉంటే, అప్పుడు పాలసీదారు ఈ మొత్తాన్ని చెల్లించాలి. ఆ తర్వాత మిగిలిన రూ.1,80,000 కోసం బీమా సంస్థ వద్ద క్లెయిమ్ చేసుకోవచ్చు. డిడక్టబుల్‌లో ఇప్పటి వరకు చెప్పుకున్నది స్వచ్ఛందమైనది.

సూపర్ టాపప్


వృద్ధాప్యంలో నామమాత్రపు కవరేజీ చాలకపోవచ్చు. మెరుగైన కవరేజీతోనే తగినంత రక్షణ లభిస్తుంది. కానీ, మెరుగైన కవరేజీ కోసం ప్రీమియం ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో రెగ్యులర్ ఇండెమ్నిటీ ప్లాన్‌ను పరిమిత కవరేజీతో తీసుకోవాలి. దీనివల్ల ప్రీమియం తగ్గించుకోవచ్చు. దీనికి అదనపు కవరేజీతో సూపర్ టాపప్ తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒకే పాలసీని అధిక కవరేజీతో తీసుకోవడంతో పోలిస్తే ప్రీమియం చాలా వరకు తగ్గుతుంది. ఉదాహరణకు రూ.5 లక్షలకు బేసిక్ ప్లాన్ తీసుకుని, దీనికి రూ.20 లక్షల సూపర్ టాపప్ చేసుకున్నారని అనుకుందాం. క్లెయిమ్ రూ.5 లక్షలు దాటినప్పుడు, అదనపు మొత్తానికి సూపర్ టాపప్ ఇచ్చిన బీమా సంస్థ నుంచి చెల్లింపులు వస్తాయి. రెగ్యులర్ ప్లాన్‌తో పోలిస్తే ఇలా చేయడం వల్ల ప్రీమియంను 30 శాతం వరకు ఆదా చేసుకోవచ్చు. ఇక్కడ టాపప్ ప్లాన్లు కూడా ఉన్నాయి. కానీ టాపప్, సూపర్ టాపప్ మధ్య చాలా వ్యత్యాసం ఉంది. టాపప్ ప్లాన్‌లో ఒక పాలసీ సంవత్సరంలో ప్రతి క్లెయిమ్‌కు విడిగా నిర్ణీత మొత్తం దాటినప్పుడే చెల్లింపులు లభిస్తాయి. సూపర్ టాపప్ ప్లాన్‌లో అలా కాదు. ఏడాది మొత్తం మీద నిర్దేశిత డిడక్టబుల్ ఒక్కటిగానే ఉంటుంది. అంటే బేస్ ప్లాన్ రూ.5 లక్షలు తీసుకున్నారు. దీనికి టాపప్ జోడించుకుంటే, ప్రతి క్లెయిమ్‌లోనూ రూ.5 లక్షలు మించినప్పుడే, రూ.5 లక్షలు మినహాయించి (డిడక్టబుల్) మిగిలినది టాపప్ నుంచి చెల్లింపులు వస్తాయి. అదే సూపర్ టాపప్‌లో.. ఒక ఏడాదిలో మూడు పర్యాయాలు ఆస్పత్రిలో చేరి (రూ.3లక్షలు, రూ.3 లక్షలు, రూ.4 లక్షలు) రూ.10 లక్షలు బిల్లు వచ్చినా, రూ.5 లక్షలు డిడక్టబుల్ పోను, మిగిలిన రూ.5 లక్షలను క్లెయిమ్ చేసుకోవచ్చు. బేస్ ప్లాన్ పరిమిత కవరేజీతో తీసుకుని, సూపర్ టాపప్ జోడించుకోలేని వారు.. చిన్న వాటికి క్లెయిమ్ చేసుకోకుండా ఉంటే మంచిది. దీనివల్ల నో క్లెయిమ్ బోనస్ రూపంలో బీమా కవరేజీని ఎలాంటి అదనపు ప్రీమియం లేకుండా నూరు శాతం వరకు పెంచుకోవచ్చు.

రూమ్ రెంట్

ఆస్పత్రిలో చేరినప్పుడు పొందే రూమ్ వసతి కూడా ప్రీమియంను నిర్ణయిస్తుంది. ఎలాంటి పరిమితులు లేని ప్లాన్‌తో పోలిస్తే సింగిల్ రూమ్, షేరింగ్ రూమ్ ఆప్షన్‌తో కూడిన పాలసీల ప్రీమియం తక్కువగా ఉంటుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు ఉంటాయి. అన్నింటిలోకి షేరింగ్ తక్కువగా ఉంటుంది. కనుక షేరింగ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవడం ద్వారా ప్రీమియం తగ్గేలా చూసుకోవచ్చు. ఒకవేళ షేరింగ్ ఎంపిక చేసుకుంటే.. ఆస్పత్రిలో చేరినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ షేరింగ్ వసతికే పరిమితం కావడం మంచిది. ఖరీదైన వసతి తీసుకుంటే ఆస్పత్రి బిల్లులో కొంత పాలసీదారు చెల్లించాల్సి వస్తుంది. ఇది కేవలం రూమ్ రెంట్ వరకే పరిమితం కాదు. ఎందుకంటే ఖరీదైన వసతిలో ఉండి పొందే వైద్యం సాధారణ షేరింగ్ రూమ్‌లో పొందే వైద్యంతో పోలిస్తే అధిక వ్యయాలతో ఉంటుంది. కనుక పాలసీ క్లాజ్‌లో ఉన్న వసతికి మించి ఖరీదైన వసతిలో ఉంటే బిల్లులో కొంత మొత్తాన్ని పాలసీదారు చెల్లించాలి.

ఫిట్‌గా ఉంటే ప్రయోజనం

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం ద్వారా ప్రీమియంలో తగ్గింపు పొందే అవకాశం ఉంది. రోజువారీ వ్యాయామం చేసే పాలసీహోల్డర్లకు బీమా సంస్థలు రివార్డు పాయింట్లు కేటాయిస్తున్నాయి. ఒక ఏడాది మొత్తం మీద ఇలా పొందిన రివార్డు పాయింట్లను, మరుసటి ఏడాది రెన్యువల్ ప్రీమియంలో తగ్గింపునకు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు రోజువారీ 10,000 అడుగులు నడవడం. లేదంటే రోజులో కనీసం 4,000 అడుగులు నడవడం వంటివి. లేదా జాగింగ్ చేయడం ద్వారా హెల్త్ రివార్డులు సంపాదించుకోవచ్చు. ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ హెల్త్ రివార్డులతో ప్రీమియంలో నూరు శాతం డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది.



పోర్టింగ్

మొబైల్ నంబర్ పోర్టబులిటీ మాదిరే, హెల్త్ ఇన్సూరెన్స్‌ను కూడా ఒక బీమా సంస్థ నుంచి మరో బీమా సంస్థకు పోర్టింగ్ పెట్టుకోవచ్చు. బీమా సంస్థ సేవలు నచ్చకపోయినా, ప్రీమియం భారం అనిపించినా.. కారణం ఏదైనా పోర్టింగ్ సదుపాయం ఉంది. పోర్టింగ్ వల్ల పూర్వపు బీమా సంస్థలో పొందిన ప్రయోజనాలు క్యారీ ఫార్వార్డ్ (బదిలీ) అవుతాయి. పోర్టింగ్ వల్ల నో క్లెయిమ్ బోనస్ ఒక్కటి నష్టపోవాల్సి రావచ్చు. పాత సంస్థలో ముందు నుంచి ఉన్న వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ పూర్తి చేసి ఉంటే, కొత్త సంస్థలో మొదటి రోజు నుంచే కవరేజీ పొందొచ్చు. పాలసీ రెన్యువల్ గడువుకు 60 రోజుల నుంచి 45 రోజుల్లోపు కొత్త సంస్థ వద్ద పోర్టింగ్ అభ్యర్థన దాఖలు చేసుకోవాలి. ప్రస్తుత పాలసీలోని కవరేజీ ఫీచర్లతో పోలిస్తే, మెరుగైన సదుపాయాలతో తక్కువ ప్రీమియంతో ఆఫర్ చేస్తున్న సంస్థకు మారిపోవడం వల్ల కొంత ఆదా చేసుకోవడానికి అవకాశం ఉంది.

వీటిని అనుసరించొచ్చు..



- హెల్త్ ఇన్సూరెన్స్‌ను చిన్న వయసులోనే తీసుకోవాలి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఆ వయసులో ఉండవు. దీంతో ప్రీమియం తక్కువగా ఉంటుంది. నేరుగా 60 ఏళ్ల తర్వాత పాలసీ తీసుకునే వారితో పోలిస్తే, ముందు నుంచే హెల్త్ కవరేజీలో ఉన్న వారికి ప్రీమియం కొంత తక్కువ ఉంటుంది. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువ మందిలో కనిపిస్తుంటాయి. వారికి రిస్క్ ఎక్కువగా ఉంటుందని అధిక ప్రీమియాన్ని కంపెనీలు చార్జ్ చేస్తుంటాయి.
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఆన్‌లైన్ ద్వారా నేరుగా బీమా సంస్థ పోర్టల్ నుంచి కొనుగోలు చేస్తే ప్రీమియం 5–10% తక్కువగా ఉంటుంది. కమీషన్లు, ఇతర వ్యయాల భారం తగ్గుతుంది కనుక బీమా సంస్థలు డిస్కౌంట్ ఇస్తాయి. పైగా ఆన్‌లైన్‌లో అన్ని బీమా సంస్థల ప్లాన్ల ఫీచర్లు, ప్రీమియంను పోల్చి చూసుకునే వెసులుబాటు పాలసీబజార్ వంటి వేదికలు కల్పిస్తున్నాయి. ఈ విధంగానూ ప్రీమియం భారం తగ్గవచ్చు.
- విడిగా ప్లాన్ తీసుకోవడానికి బదులు కుటుంబం అంతటికీ ఒక్కటే ఫ్లోటర్ పాలసీ తీసుకుంటే ప్రీమియం తగ్గుతుంది.
- అవసరం లేని కవరేజీలకు దూరంగా ఉండాలి. అవసరం లేని యాడాన్‌లను జోడించుకుంటే ప్రీమియం భారం పెరుగుతుంది.
- రూ.5 లక్షల బేసిక్ కవరేజీతో ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకుని, రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.20–50 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ జోడించుకుంటే ప్రీమియం ఆదా అవుతుంది.
- తమ పిల్లలు కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తుంటే, వారి కార్యాలయం తరఫున తల్లిదండ్రులు కవరేజీ కల్పించుకోవడం ఒక మార్గం. గ్రూప్ ప్లాన్ కావడంతో ప్రీమియం తగ్గుతుంది.
- ఇక ప్రీమియంలో ఆదా కోరుకునే వారు ఒక ఏడాదికి కాకుండా మూడేళ్లకు ఒకేసారి ప్రీమియం చెల్లించడాన్ని పరిశీలించొచ్చు. దీనివల్ల ప్రీమియంలో 10 శాతం వరకు ఆదా అవుతుంది.

కోరమండల్ ఇంటర్నేషనల్ | షేర్‌ఖాన్ | కొనొచ్చు


స్టాక్స్ వ్యూ



ప్రస్తుత ధర: రూ. 1,225 టార్గెట్: రూ. 1,430

ఎందుకంటే: ప్రపంచ ఎరువుల మార్కెట్లో సరఫరా తగ్గడంతో దిగుమతి చేసుకునే ఎరువుల ధరలు ఎగబాకేందుకు దారితీయనుంది, మరో పక్క ప్రభుత్వం అధిక సబ్సిడీలు అందిస్తుండటం కూడా ఎరువుల డిమాండ్ మరింత జోరందుకునేలా చేస్తోంది, దీంతో స్వల్పకాలంలో కంపెనీ ఆర్థిక పనితీరు పుంజుకోనుంది. సీడీఎంఓ, స్పెషాలిటీ కెమికల్‌పై దృష్టిసారించడం సరైన చర్య, దీనివల్ల ప్రధానమైన ఎరువులు/సీపీసీ వ్యాపారం నుండి పటిష్టమైన ఆదాయం లభించడంతో పాటు మధ్య, దీర్ఘకాలికంగా చూస్తే మెరుగైన వృద్ధికి దోహదం చేయగలదు. నానో డీఏపీ వంటి వినూత్నమైన ఉత్పత్తులను ప్రవేశపెట్టడం వల్ల మార్జిన్లు పుంజుకోవడంతో పాటు ఆదాయంలో కూడా అదనపు వృద్ధికి వీలు కల్పించనున్నాయి, కంపెనీ 20% ఆపరేటింగ్ మార్జిన్లను సాధించేందుకు నానో డీఏపీ తోడ్పడుతుందని యాజమాన్యం అంచనా వేస్తోంది. వ్యవసాయ రంగంలో డ్రోన్స్ వంటి భవిష్యత్తు టెక్నాలజీలు, సంబంధిత మార్కెట్లో విస్తరించేందుకు, కొత్త సర్వీసులను అందించేందుకు కొత్త ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా, కంపెనీ చేతిలో ఆర్డర్లు పటిష్ఠంగా ఉండటం కూడా రానున్న కాలంలో మెరుగైన ఆదాయాలకు అద్దం పడుతోంది.

నజారా టెక్నాలజీస్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 810 టార్గెట్: రూ. 1,080

ఎందుకంటే: రూ. 510 కోట్ల విలువైన ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ తర్వాత నజారా టెక్నాలజీస్ వద్ద 800 కోట్లకు పైగా నగదు నిల్వలు ఉన్నాయి. ఆర్‌ఎంజీ విభాగంలో నిధుల లభ్యత తగ్గిన నేపథ్యంలో దీన్ని ఎదుర్కొనేందుకు కంపెనీ వద్దనున్న పటిష్టమైన నగదు నిల్వలు దోహదం చేయనున్నాయి. పోటీ కంపెనీలకు తమ మార్కెట్ షేర్‌ను కోల్పోవాల్సి వస్తుందన్న భయాల వల్ల చాలామటుకు ప్లాట్‌ఫామ్‌లు తుది వినియోగదారుకు 28% జీఎస్‌టీని పూర్తిగా విధించడం లేదు, దీనివల్ల వాటికి నగదు కొరత మరింత తీవ్రమవుతోంది. వేల్యుయేషన్లలో భారీ దిద్దుబాటు నేపథ్యంలో నియంత్రణ సంస్థలు 2024 సంవత్సరం ద్వితీయార్థంలో పన్ను విధింపును సవరించవచ్చని భావిస్తున్నారు. దీనివల్ల స్థిరీకరణ అనేది ఆలస్యమవుతోంది. అయితే, వేతనాల్లో కొంతమేర కరెక్షన్‌కు తోడు, ఇతర కంపెనీలను కొనుగోలు చేసే విషయంలో కూడా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆర్‌ఎంజీ విభాగంలో కొనుగోళ్లు/విస్తరణకు ప్రయత్నిస్తున్న నజారాకు ఈ పరిణామాలు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. కాగా, పోటీ పెరగడంతో పాటు యూఎస్ మార్కెట్లలో మందగమనం, కొనుగోలు చేసేందుకు కంపెనీలను గుర్తించడం అలాగే కొనుగోలు చేసిన కంపెనీలను ఇంటిగ్రేట్ చేయడంలో అసమర్థత వంటి రిస్కులు కంపెనీపై ప్రభావం చూపొచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-12-2023	
విశాఖ	570–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	564–00
విజయవాడ	564–00
రిటైల్ ధర (డజను)	72.00
10-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	545–00
వరంగల్	547–00
రిటైల్ ధర	6.05

జోస్ అలుక్కాస్ 'నిత్యారా' ఆవిష్కరణ



హైదరాబాద్: జోస్ అలుక్కాస్ 'నిత్యారా' పేరుతో కొత్త డైమండ్ కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ వజ్రాభరణాల శ్రేణిని సినీ నటి కీర్తి సురేష్ ఆవిష్కరించారు. ''అత్యుత్తమ వజ్రాలు, రత్నాలతో నిపుణులైన డిజైనర్లు, ప్రావీణ్యం కలిగిన కళాకారుల 'నిత్యారా' ఆభరణాలు రూపొందించారు. చీరలతో మాత్రమే కాకుండా ఆధునిక దుస్తులతో సైతం కలిసిపోయేలా అన్ని ఆధునిక హంగులతో ఆభరణాలు తీర్చిదిద్దారు'' అని కంపెనీ తెలిపింది. ఈ కార్యక్రమంలో జోస్ ఆలుక్కాస్ ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ ఆలుక్కా, జాన్ ఆలుక్కా పాల్గొన్నారు.

18 నుంచి 22 వరకు మూడవ విడత గోల్డ్ బాండ్ స్కీమ్



న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్‌స్కీమ్ ఈ ఆర్థిక సంవత్సరం మూడవ విడత డిసెంబర్ 18 నుంచి 22వ తేదీ వరకూ అందుబాటులోకి రానుంది. ఫిబ్రవరి 12–16 తేదీల్లో నాల్గవ విడత వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందని ఆర్థికశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మొదటి విడత జూన్ 19 నుంచి 23 వరకూ (బాండ్ జారీ ధర గ్రాముకు రూ.5,926), రెండవ విడత సెప్టెంబర్ 11 నుంచి 15 వరకూ (ధర గ్రాముకు రూ.5,923) అమలయిన సంగతి తెలిసిందే.

రెండు టాపప్ ప్లాన్లు తీసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను స్వయం ఉపాధిపై ఆధారపడి ఉన్నాను. రూ.4 లక్షలకు బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉంది. అదే బీమా సంస్థ నుంచి రూ.6 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ కూడా ఉంది. అంటే నా ముగ్గురు సభ్యుల కుటుంబానికి మొత్తం రూ.10 లక్షల కవరేజీ ప్రస్తుతానికి ఉంది. రూ.10 లక్షల డిడక్టబుల్‌తో రూ.40 లక్షల సూపర్ టాపప్ ప్లాన్‌ను మరో బీమా సంస్థ ఆఫర్ చేస్తోంది. దాని ప్రీమియం చాలా తక్కువ. ఇప్పుడు రూ.40 లక్షలకు సూపర్ టాపప్ తీసుకుంటే మొత్తం కవరేజీ రూ.50 లక్షలకు పెరుగుతుందా? నేను రెండు సూపర్ టాపప్ ప్లాన్లను కలిగి ఉండొచ్చా? – తన్మోయ్ పంజా

టాపప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ అనేది డిడక్టబుల్‌కు పైన ఉన్న మొత్తానికి బీమా కవరేజీని ఇస్తుంది. డిడక్టబుల్ అంటే, అంత మొత్తాన్ని పాలసీదారు భరించాల్సి ఉంటుంది. అంతకు మించిన మొత్తానికి సూపర్ టాపప్ కవరేజీ అమల్లోకి వస్తుంది. సూపర్ టాపప్ ప్లాన్ తీసుకునేందుకు బేసిక్ కవరేజీ ఉండాలనేమీ లేదు. బేసిక్ టాపప్ ప్లాన్‌లో డిడక్టబుల్ అనేది హాస్పిటల్‌లో చేరిన ప్రతి సందర్భంలోనూ అమలవుతుంది. కానీ, సూపర్ టాపప్ ప్లాన్‌లో ఒక ఏడాది మొత్తం మీద అయిన హాస్పిటల్ ఖర్చులకు డిడక్టబుల్ అమలవుతుంది. కనుక టాపప్ ప్లాన్లతో పోలిస్తే సూపర్ టాపప్ ప్లాన్ మరింత ప్రయోజనకరం అని చెప్పుకోవాలి. ఒకే సమయంలో రెండు సూపర్ టాపప్ ప్లాన్లను కలిగి ఉండే విషయంలో ఎలాంటి నియంత్రణలు లేవు. ప్రస్తుతం ఉన్న ప్లాన్‌లో లేని మెరుగైన సదుపాయాలను కొత్త సూపర్ టాపప్ ప్లాన్ ఆఫర్ చేస్తుంటే నిస్సందేహంగా తీసుకోవచ్చు. బేసిక్ పాలసీలో లేని రక్షణను సూపర్ టాపప్ ప్లాన్ ఇస్తుంటే తీసుకోవచ్చు. బేసిక్ ప్లాన్ రూ.2 లక్షల కవరేజీని ఇస్తుంటే, రూ.2 లక్షల డిడక్టబుల్‌తో రూ.5 లక్షల సూపర్ టాపప్ ప్లాన్ ఉంటే.. ఇప్పుడు రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.10 లక్షలకు మరో సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవాలని అనుకుంటే తీసుకోవచ్చు. ఉదాహరణకు మీ ఆస్పత్రి బిల్లు రూ.18 లక్షలు అయిందనుకోండి. అప్పుడు బేసిక్ పాలసీ నుంచి రూ.2 లక్షలు, మొదటి సూపర్ టాపప్ నుంచి రూ.5 లక్షలు చెల్లింపులు లభిస్తాయి. అప్పుడు మరో రూ.11 లక్షలు మిగిలి ఉంటుంది. రెండో సూపర్ టాపప్ ప్లాన్ నుంచి రూ.10 లక్షలు చెల్లింపులు వస్తాయి. మిగిలిన రూ.లక్షను పాలసీదారుడు భరించాల్సి ఉంటుంది. అయితే, ఎక్కువ సూపర్ టాపప్ ప్లాన్లు ఉంటే బీమా ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుంది. బేసిక్ పాలసీకి అదనంగా ఒక సూపర్ టాపప్ ప్లాన్‌ను కలిగి ఉండడం సూచనీయం. మూడు బీమా సంస్థల వద్ద క్లెయిమ్ కోసం చేయాల్సిన పేపర్ పని ప్రతిబంధకంగా మారుతుంది. కనుక కవరేజీని సాధ్యమైనంత సులభంగా ఉంచుకోవాలి.

నేను 1994లో మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశాను. అందుకు సంబంధించి భౌతిక సర్టిఫికెట్ నా వద్ద ఉంది. ఈ మొత్తాన్ని ఎలా ఉపసంహరించుకోవాలి? వీటి విలువ ఎంత? – పవన్

2014లో మోర్గాన్ స్టాన్లీ భారత్ మార్కెట్ నుంచి వెళ్లిపోయింది. మోర్గాన్ స్టాన్లీ నిర్వహణలోని ఎనిమిది మ్యూచువల్ ఫండ్ పథకాలను హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్ హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్‌క్యాప్ ఫండ్‌లో విలీనం అయింది. హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ క్యాప్ ఫండ్ 2009 వరకు హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్‌గా కొనసాగింది. 15 ఏళ్ల లాకిన్ పీరియడ్ ముగిసిన అనంతరం ఇది ఓపెన్ ఎండెడ్ పథకంగా మార్పు చెందింది. ఇప్పుడు మీ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని అనుకుంటే, హెచ్‌డీఎఫ్‌సీ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని సంప్రదించాల్సి ఉంటుంది. మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్‌లో మీ పెట్టుబడులకు సంబంధించి ఆధారాలను సమర్పించాలి. అప్పుడు మీ పెట్టుబడులను వెనక్కి తీసుకునే విషయమైన వారి నుంచి తగిన సహకారం లభిస్తుంది.

క్లుప్తంగా...

లోక్ అదాలత్‌లో 1.22 లక్షల కేసుల పరిష్కారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 386 లోక్ అదాలత్ ప్రత్యేక బెంచ్‌ల ద్వారా పోలీసు శాఖకు చెందిన 1,22,146 కేసులను పరిష్కరించారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించిన వాటిలో దర్యాప్తులో ఉన్న కేసులు 7,970, పెండింగ్ కేసులు 11,180 కలిపి ఐపీసీ కేసులు 19,150 ఉన్నాయి. కాగా ఐపీసీ యేతర కేసులు 1,02,996 ఉన్నాయి. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి చొరవ చూపిన ఎన్టీఆర్, ఎస్పీ ఎస్ఆర్ నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖ పట్నం, వైఎస్సార్, చిత్తూరు జిల్లా ఎస్పీలు, సిబ్బందిని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు.

జనవరి 7న విజయవాడలో గిరిజన శంఖారావం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న గిరిజనులు సంఘటితం కావాలని, జనవరి 7న విజయవాడలో నిర్వహించే గిరిజన శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ అధ్యక్షతన గిరిజన శంఖారావం సన్నాహక సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు. జనవరి 7న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే గిరిజన శంఖారావం గోడపత్రికలు, కరపత్రాలను వడిత్యా శంకర్ నాయక్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధనకై గిరిజనులు మరింత చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్ మాట్లాడారు.

4,141 అడుగుల ఎత్తులో నీళ్లు!



బి.కొత్తకోట: సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో బ్రిటిష్ పాలనలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిర్మించిన బావిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఊటనీళ్లు ఉబికి వస్తున్నాయి. దీంతో బావి నిండి..పైకి నీళ్లు వస్తున్నాయి. ఈ దృశ్యాన్ని సందర్శకులు విశేషంగా తిలకిస్తున్నారు. 144 ఏళ్ల క్రితం హార్సిలీకొండలో నీటికోసం అప్పటి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల కలెక్టర్ డబ్ల్యూ.డీ.హార్సిలీ నిర్మించిన బావి నేటికీ చెక్కు చెదరలేదు. పటిష్టమైన రాతికట్టడంతో నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పర్యాటక ప్రదేశంగా మారింది.

బెంగళూరులో భారీ సైబర్ మోసం

యశవంతపుర: బెంగళూరులో మరో భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులమంటూ బెదిరించి ఓ పారిశ్రామికవేత్త నుంచి రూ.1.98 కోట్లు వసూలు చేశారు. కోరమంగళకు చెందిన పారిశ్రామికవేత్త ఫిర్యాదు మేరకు... ఈనెల 2వ తేదీన పారిశ్రామికవేత్తకు ఒకఫోన్ కాల్ వచ్చింది. మొదట కొరియర్ బాయ్‌గా చెప్పుకున్న వ్యక్తి మాట్లాడాడు. తరువాత పోలీసులు మాట్లాడతారంటూ చెప్పాడు. మేం ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులం, మీ పేరుతో వచ్చిన కొరియర్‌లో సింథటిక్ డ్రగ్స్ ఉన్నాయని, అవి ఎక్కడ నుంచి వచ్చాయని ఫోన్‌లోనే రకరకాలుగా ప్రశ్నలు వేస్తూ అరెస్ట్ చేస్తామని భయపెట్టారు. అనంతరం భార్యాభర్తలను బెంగళూరులోని ఒక హోటల్‌కు రప్పించారు. వారి అకౌంట్ నుంచి రూ.1.98 కోట్లను తమ ఖాతాలకు జమ చేసుకున్న అనంతరం వారిని విడిచిపెట్టారు. దీంతో వచ్చిన వారు ముంబై పోలీసులు కాదని, తాము మోసపోయామని గ్రహించిన దంపతులు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.



బాంబుతో ఆయిల్ రిగ్‌ను పేల్చిన కమాండోలు

సాగరతీరంలో సాహస విన్యాసాలు

ఆర్కే బీచ్‌లో నౌకాదళ పరాక్రమ ప్రదర్శన

ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, విశాఖపట్నం: ప్రశాంతంగా కనిపించే విశాఖ సాగరతీరం ఆదివారం సాయంత్రం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. బాంబుల వర్షం.. యుద్ధ విమానాల చక్కర్లు, శత్రుమూకల దాడులు.. యుద్ధ ట్యాంకర్ల వీర విహారంతో.. ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. శత్రుదేశం పాక్‌పై విజయానికి ప్రతీకగా ఏటా విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లో ఆదివారం నేవీడే విన్యాసాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ముందుగా నేవీ బ్యాండ్, నేవల్ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలతో ప్రారంభమైన విన్యాసాలు.. మార్కోస్ రాకతో వేడెక్కాయి. యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, వైమానిక దళాల అద్భుత ప్రదర్శనలు, యుద్ధ, నిఘా విమానాలు, హెలికాప్టర్‌ల ద్వారా నిర్వహించబడే వ్యూహాత్మక విన్యాసాలతో కూడిన ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ అద్భుతంగా సాగింది. చివరిగా.. యుద్ధ నౌకలు విద్యుత్ దీపాలంకరణతో నేవీడే విన్యాసాల్ని ముగించాయి. విన్యాసాలకు విశిష్ట అతిథులుగా మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఎంపీ డా.సత్యవతి, కలెక్టర్ డా.మల్లికార్జున, సీపీ రవిశంకర్, జేసీ విశ్వనాథన్ హాజరయ్యారు. అనంతరం.. నేవీ హౌస్‌లో తూర్పు నౌకాదళాధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ 'ఎట్ హోమ్' ఫంక్షన్ పేరుతో నిర్వహించిన తేనీటి విందులో గవర్నర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత నౌకాదళ పటిమని చాటిచెప్పే వీడియోను గవర్నర్ ఆవిష్కరించి తిలకించారు.



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు నమస్కరిస్తున్న మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్



విన్యాసాలను వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



బాంబులను జారవిడుస్తున్న యుద్ధ విమానం



జాతీయ పతాకంతో స్కై డైవ్ చేసిన కమాండో



సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించే ఆపరేషన్ ఇలా..



ఆకాశంలో యుద్ధ విమానాల సందడి

కాఫీ.. రైతులు హ్యాపీ

లాభాల పంట పండిస్తున్న చింతపల్లి కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్

- రైతులకు బోనస్ రుచి అందిస్తూ ప్రగతి బాటలో పయనం
- 2020లో రూ.4.68 కోట్లతో ప్రారంభించిన ప్రభుత్వం
- 1,500 మంది కాఫీ రైతులతో సహకార సంఘం
- రైతులకు మద్దతు ధరతోపాటు గిరిజనులకు ఉపాధి
- జి.మాడుగుల, జీకే వీధిలో మరో రూ.7.70 కోట్లతో రెండు యూనిట్ల నిర్మాణం
- వచ్చే సీజన్‌లో ప్రారంభించేలా శరవేగంగా పనులు

(చింతపల్లి నుంచి సాక్షి ప్రతినిధి యిర్రింకి ఉమామహేశ్వరరావు)



పల్పింగ్ యూనిట్‌లో కాఫీ గింజల ప్రాసెసింగ్



ప్రాసెసింగ్ అనంతరం ఆరబెట్టిన కాఫీ గింజలు

దేశంలోనే గర్వించదగ్గ స్థాయిలో నిర్మించిన ఏఎస్సార్ జిల్లా చింతపల్లిలోని కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ లాభాల పంట పండిస్తోంది. కాఫీ రైతులకు మద్దతు ధర దక్కేలా చేయడంతోపాటు అంతకు మించి బోనస్ రూపంలో ఆదాయాన్ని రుచి చూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 2020లో రూ.4.56 కోట్లతో పైలట్ ప్రాజెక్ట్‌గా దీనిని నిర్మించింది. 3 ఎకరాల విస్తీర్ణంలో ఎకో పల్పింగ్ యూనిట్‌ను నెలకొల్పింది. దీనికి అనుబంధంగా మరో రెండు ఎకరాల్లో రూ.1.68 కోట్లతో వెయ్యి మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో గోడౌన్లు నిర్మించింది. ప్రాసెస్ అయిన పార్చ్‌మెంట్ కాఫీ గింజల్ని త్వరగా ఆరబెట్టుకునేలా గతేడాది మరో రూ.45 లక్షలతో రోటరీ డ్రయ్యర్‌ను ఐటీడీఏ ఏర్పాటు చేసింది. పర్యావరణానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పల్పింగ్ యూనిట్ నిర్వహించేలా ఎకో ఫ్రెండ్లీగా నిర్మించడం విశేషం. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నేతృత్వంలో ఏజెన్సీలోని 11 మండలాలకు చెందిన కాఫీ పండ్ల (ఫ్రూట్స్)ను సేకరిస్తున్నారు. ఏటా అపెక్స్ కమిటీ నిర్ణయించిన మద్దతు ధరకు కాఫీ పండ్లను సేకరించడంతో బయటి డీలర్లు సైతం అంతకు మించిన ధర చెల్లించి కొనుగోలు చేసేలా పోటీ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. కాగా, చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ సేకరించిన కాఫీ పండ్లను ప్రాసెస్ చేసి (కాయలపై తొక్క తొలగించి) పార్చ్‌మెంట్ (కాఫీ గింజలు)గా చేస్తారు. ఇక్కడ ప్రాసెస్ చేసిన పార్చ్‌మెంట్ కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో వాటిని విక్రయించి లాభాల పంట పండిస్తున్నారు.

మరో రెండు యూనిట్లు



చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ మంచి ఫలితాలు సాధించడంతో ప్రభుత్వం మరో రెండు ఎకో పల్పింగ్ యూనిట్లు నిర్మిస్తోంది. జి.మాడుగుల, జీకే వీధిలో రూ.7 కోట్ల 70 లక్షల 32 వేలతో వీటిని నెలకొల్పుతోంది. గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఈ రెండు యూనిట్లు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 5 మెట్రిక్ టన్నుల కాఫీ గింజల ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగిన యంత్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. 2024 సీజన్ నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా కార్యాచరణ చేపట్టారు.

– ఎన్.అశోక్, అసిస్టెంట్ డైరెక్టర్, పాడేరు ఐటీడీఏ కాఫీ ప్రాజెక్ట్

పల్పింగ్ యూనిట్ ప్రగతి ఇదీ..

సంవత్సరం	సేకరించిన కాఫీ ఫ్రూట్ (టన్నులు)	డ్రై పార్చ్‌మెంట్ (టన్నులు)	డ్రై చెర్రీ (టన్నులు)	కిలో కాఫీ ఫ్రూట్ మద్దతు ధర (రూ.ల్లో)	మద్దతు ధరకు తోడు బోనస్ (కిలోకి రూ.ల్లో)
2019-20	456.392	94.361	10.100	25	6
2020-21	658.687	128.542	17.526	27	4
2021-22	1,087.253	179.747	42.749	32	8

(2022-23లో 5వేల టన్నుల సేకరణ లక్ష్యం కాగా.. కిలో ఫ్రూట్‌కు రూ.43 చొప్పున అందిస్తున్నారు)



లాభాలు సాధిస్తోంది



దళారుల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా గిరిజన రైతుల ఉన్నతికి ప్రాధాన్యత ఇస్తోంది. గిరిజన సంక్షేమ, ఐటీడీఏ, ఏపీ ట్రైకార్ అధికారుల పర్యవేక్షణలో చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌ను లాభాల బాటలో నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం సహకార సంఘంలో 1,500 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. మరో వెయ్యి మందిని చేర్చుకునేందుకు కార్యాచరణ చేపట్టాం. రైతులకు మద్దతు ధర అందించడంతోపాటు ఈ ప్రాంత గిరిజనులకు రోజువారీ పనులు కల్పించి ఉపాధి చూపిస్తున్నాం. పల్పింగ్ యూనిట్‌లో పార్చ్‌మెంట్ కాఫీ ప్రాసెస్‌కు రోజుకు కనీసం వంద మందికి పైగా పనిచేస్తారు. పగటిపూట మహిళలకు రూ.320, మగవాళ్లకు రూ.350, రాత్రి వేళ అయితే రూ.450 చొప్పున వేతనం చెల్లిస్తున్నాం.

– సెగ్గే కొండలరావు, అధ్యక్షుడు, విశాఖ ఏజెన్సీ గిరిజన కాఫీ ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం

గిరిజన రైతులకు ఏటా బోనస్



ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేసిన చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ లాభాలు సాధించడంతోపాటు కాఫీ రైతులకు ఏటా బోనస్ అందిస్తోంది. కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ హామీతో చింతపల్లి యూనిట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైబల్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ సంస్థ రూ.1.56 కోట్ల రుణం ఇచ్చింది. రుణ మొత్తాన్ని గత ఏడాది చెల్లించాం. రూ.2 కోట్లు లాభాలు సాధించాం. ప్లాంట్ నిర్వహణ వ్యయం పోగా మిగిలిన సొమ్ముతో కాఫీ ఫ్రూట్ సేకరణ చేపట్టాం.

– పీవీవీ సత్యనారాయణ, ఇన్‌చార్జ్, చింతపల్లి కాఫీ పల్పింగ్ యూనిట్

ఏపీ బాటలో కేంద్రం

- రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం
- కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల్లో చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్యను తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని దేశమంతటా ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనిపై విధి విధానాలు రూపొందించాల్సిందిగా కేంద్ర రోడ్డు రవాణా శాఖను కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం గత ఏడాది దేశవ్యాప్తంగా 4,46,768 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 4,23,158 మంది గాయపడగా.. 1,71,100 మంది మరణించారు. వారిలో గోల్డెన్ అవర్‌లో మెరుగైన చికిత్స అందకపోవడంతో దాదాపు 50వేల మంది మరణించినట్టు అంచనా. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించే దిశగా పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, వైద్య–ఆరోగ్య శాఖలను సమన్వయపరుస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. దాంతోపాటు రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించే సామాన్యులను ప్రోత్సహించేందుకు 'గుడ్ సమరిటన్' విధానంలో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు లేకపోవడంతో ఇతర విధానాలపై కేంద్ర రవాణా శాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలో ఆరు రాష్ట్రాలు అమలు చేస్తున్న నగదు రహిత వైద్య విధానంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రోడ్డు ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా నగదు రహిత వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. గోల్డెన్ అవర్‌గా పరిగణించే రోడ్డు ప్రమాదం సంభవించిన తరువాత తొలి గంటలో అత్యవసర చికిత్సతోపాటు అన్నిరకాల ట్రామా కేర్, ఇతర వైద్య సేవలను పూర్తిగా నగదు రహిత చికిత్స అందిస్తారు. ప్రమాద స్థలానికి సమీపంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా నగదు రహిత వైద్యం అందించే దిశగా విధి విధానాలను రూపొందించనుంది. నగదు రహిత విధానంపై నివేదిక ఇవ్వాలని ఏపీ రవాణా శాఖతోపాటు ఆయా రాష్ట్రాలను కూడా కోరింది. దీనిపై రెండు నెలల్లో నివేదిక సమర్పించిన తరువాత దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యసేవల విధానాన్ని అమలులోకి తీసుకురావాలని భావిస్తోంది.

పెందుర్తిలో టీడీపీ నేత రాక్షసత్వం

వివాహితపై యాసిడ్‌తో దాడి

- ఆమె ఇంట్లో బీరువా బద్దలు కొట్టి రూ.5 లక్షలు, బంగారు ఆభరణాల తస్కరణ
- టీడీపీ మాజీ ఎమ్మెల్యే బండారుకు నిందితుడు అత్యంత సన్నిహితుడు



మాజీ ఎమ్మెల్యే బండారుతో నిందితుడు నరసింగరావు (పూలదండ పట్టుకున్న వ్యక్తి, ఫైల్)

పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీ నేతల దుశ్శాసన పర్వం కొనసాగుతోంది. చింతగట్ల పంచాయతీ నందవరపువానిపాలెంలో ఒంటరిగా నివసిస్తున్న ఓ మహిళపై పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు చీపురపల్లి నరసింగరావు రాక్షసంగా దాడి చేయడంతో పాటు ఆమె వద్ద ఉన్న రూ.5 లక్షలు, బంగారు ఆభరణాలను తస్కరించాడు. తీవ్ర గాయాలతో దాదాపు నాలుగు రోజుల పాటు నిందితుడు, అతడి కుటుంబ సభ్యుల చేతిలో బందీగా ఉండి సక్రమంగా చికిత్స అందక నరకయాతన అనుభవించిన ఆ అభాగ్యురాలు.. తెగించి శనివారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు.. బాధితురాలి కథనం ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన మహిళ భర్తతో విభేదాల కారణంగా విశాఖ గోపాలపట్నం ప్రాంతంలో బ్యుటీషియన్‌గా పనిచేసేది. మూడేళ్ల కిందట నందవరపునవానిపాలెంలో చింతగట్ల పంచాయతీ టీడీపీ అధ్యక్షుడుగా ఉన్న చీపురపల్లి నరసింగరావు వద్ద ఇంటి స్థలాన్ని కొని అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంది. ఈ క్రమంలో ఇంటి స్థలం కొన్న చనువుతో ఆమె వద్దకు తరచూ నరసింగరావు వస్తూ ఆమెను లోబరుచుకున్నాడు. ఎంతో ప్రేమ నటిస్తూ ఆర్థిక అవసరాలు కూడా తీర్చుకునేవాడు. ఈ వ్యవహారంలో నరసింగరావు భార్య చిన్ని కూడా 'నువ్వు లేకపోతే నా భర్త ఉండలేడు.. మీ ఇద్దరూ కలిసి ఉండండి' అంటూ బాధితురాలిని ఒప్పించడం గమనార్హం. ఇలా సహజీవనం సాగిస్తున్న తరుణంలో నరసింగరావు ప్రవర్తనలో మార్పు రావడంతో అతడిని దూరం పెట్టింది.

యాసిడ్‌తో దాడి చేసి..

నరసింగరావుకు ఆమె దూరంగా ఉండటంతో అతడు సహించలేకపోయాడు. ఆమె ఇంటికి వెళ్లి కొడుతూ ఉండేవాడు. అలా నరసింగరావు వేధిస్తూ ఉంటుంటే.. అతడి భార్య చిన్ని వచ్చి బాధితురాలికి సర్ది చెబుతూ ఉండేది. ఈ క్రమంలో ఈ నెల 7 మధ్యాహ్నం 2.30 సమయంలో నరసింగరావు ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఆమె దుస్తులు చింపేసి యాసిడ్‌ను ఆమెపై చల్లాడు. దీంతో ఆమె ఛాతి భాగం కాలిపోయింది. అంతటితో ఆగకుండా ఆమె పొత్తికడుపు, మెడపై పిడిగుద్దులు గుద్దుతూ పేట్రేగిపోయాడు. బాధితురాలు అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో ఆమె బీరువాలోని నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించాడు. ఇంట్లో గొడవను గుర్తించిన స్థానికులు రావడంతో నిందితుడు నరసింగరావు గోడ దూకి పారిపోయినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అయితే బాధితురాలికి ఏదైనా అయితే తన మెడకు చుట్టుకుంటుందన్న భయంతో ఆమెను నరవలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. తన భార్య, కుటుంబ సభ్యులను ఆమె వద్ద కాపాలా ఉంచి అరకొర చికిత్సను అందించాడు. ఈ నాలుగు రోజుల పాటు ఆమె ఎక్కడుందో ఆమె బంధువులకు కూడా తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు. అయితే ఆస్పత్రి నుంచి బాధితురాలు బయటికొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను కేజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.



ఆటా సేవా కార్యక్రమాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తెలుగు రాష్ట్రాల్లో 20 రోజులపాటు ఆటా సేవ

సాక్షి, హైదరాబాద్: అమెరికా తెలుగు సంఘం(ఆటా) ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆటా వేడుకల కమిటీ ప్రెసిడెంట్ జయంత్ చల్లా తెలిపారు. అమెరికాలో 2024 జూన్ 7 నుంచి 9 వరకు జరగనున్న సదస్సుకు ముందు ఇక్కడ సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతీ రెండేళ్లకు ఒకసారి తెలుగు రాష్ట్రాల్లో విద్యా, వైద్యం, వ్యాపారం తదితర 15 విభాగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. నేటి(సోమవారం) నుంచి శ్రీశైలం నుంచి సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తునట్లు చెప్పారు. ముగింపు వేడుకలు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆటా సెక్రటరీ రామకృష్ణారెడ్డి ఆల, కోశాధికారి సతీశ్‌రెడ్డి, జాయింట్ ట్రెజరర్ రవీందర్ గూడూరు, మీడియా కోఆర్డినేటర్ ఈశ్వర్ బండా, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ నరసింహారెడ్డి దైసాని, కాశీ కోట, రాజ్ కక్కెర్ల, అమృత్ పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

నీటిపారుదలకు పెద్దపీట వేయాలి


ముఖ్యమంత్రి చంద్రును సన్మానిస్తున్న కమ్మరచేడుమఠం స్వామీజీ తదితరులు

కంప్లీ: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయానికి కావాల్సిన నీటిపారుదల పథకాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు డిమాండ్ చేశారు. తాలూకాలోని నందిపురలో మఠాధీశుల ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటిపారుదల చింతన్ మంతన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఎక్కువగా ఉన్నా నీటిపారుదల సౌకర్యం పొందలేక పోయారన్నారు. పక్కనే తుంగభద్ర నది ఉన్నా సద్వినియోగం కావడం లేదన్నారు. ప్రభుత్వం రైతుల శ్రేయస్సుపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు.

దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే బలం


ప్రారంభిస్తున్న బీఆర్‌సీ అధికారి శివకుమార్

హొసపేటె: దివ్యాంగులు ఆత్మసైర్యాన్ని కోల్పోకుండా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని విద్యా శాఖ బీఆర్‌సీ అధికారి శివకుమార్ తెలిపారు. ఆయన శనివారం బీఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా పాఠశాలల్లో సుమారు 500 మంది దివ్యాంగ పిల్లలు చదువుతున్నారన్నారు. దివ్యాంగ తల్లిదండ్రులు దివ్యాంగుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని కోరారు. దివ్యాంగులను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలన్నారు. వనస్ఫూర్తి వికలచేతన సంఘం నేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వసతి సౌకర్యానికి వినతి

కంప్లీ: తాలూకాలోని నెల్లుడి గ్రామ పరిధిలో సర్వే నెం–133/బీ–1లోని 4.19 సెంట్ల ప్రభుత్వ భూమిలో వసతి సదుపాయం కల్పించాలని కర్ణాటక మాదిగ రక్షణా వేదిక, కర్ణాటక జనశక్తి, భూ వసతి పోరాట సమితి పదాధికారులు తహసీల్దార్ శివరాజ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం మాదిగ రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరియప్ప గుడిమని మాట్లాడుతూ తమ పోరాటం భూ, వసతి వంచితుల కోసమని, తగిన న్యాయం చేయాలని కోరారు.

లక్ష్మీవేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

రాయచూరు రూరల్: నగరంలోని బెస్తవారిపేటలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా 24 దీపాలను వెలిగించి మహాలక్ష్మి, సరస్వతి, మహాదుర్గా దేవిలను ఆహ్వానించి షోడస, అష్టోత్తర నామంతో గాయత్రి జపంతో విశేష పూజలను నెరవేర్చినట్లు ఉప్పార సమాజం అధ్యక్షుడు ఈరణ్ణ తెలిపారు.

రక్తదానం చేసిన శునకం

- మరో కుక్కకు ప్రాణదానం


మరో శునకానికి రక్తం అందిస్తున్న శునకం

సాక్షి, బళ్లారి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మనుషులే కాదు, శునకాలు కూడా కోరుకుంటున్నాయి. అదే మాదిరిగా ఓ శునకం రక్తదానం చేసి మరో శునకం ప్రాణాన్ని కాపాడింది. కర్ణాటకలో హావేరి జిల్లా ఉల్లత్తి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తికి చెందిన శునకానికి సుస్తీ చేస్తే పశు వైద్యులకు చూపించాడు. శునకానికి రక్తహీనత ఉందని, తక్షణం రక్తం అవసరమని చెప్పారు. అదే గ్రూపు శునకం రక్తాన్ని తెప్పించి ఇస్తే చికిత్స చేస్తామని చెప్పారు. దీంతో నాగరాజు సోషల్ మీడియాలో తన కుక్క బాధను ఏకరువు పెట్టాడు. ఇది తెలుసుకొని బొమ్మనహాళ్ గ్రామానికి చెందిన రంజిత అనే మహిళ తన శునకం రక్తాన్ని ఇచ్చేందుకు ఒప్పుకొని ఆ దిశగా స్థానిక హానగల్ తాలూకాలోని అక్కిఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క రక్తాన్ని దానం చేశారు.

పత్తి ధర వెలవెల.. రైతు విలవిల


రాయచూరులోని నూతన పత్తి మార్కెట్ ప్రవేశ ద్వారం


టెండర్ కోసం వేచి ఉన్న పత్తి లోడ్ వాహనాలు

- కళ్యాణ కర్ణాటకలో పత్తి దిగుబడి ఘనం
- మార్కెట్‌లో తెల్ల బంగారానికి ధర అధమం

రాయచూరు రూరల్: తెల్ల బంగారాని(పత్తి)కి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు తల్లడిల్లిపోతున్నారు. గత ఏడాది క్వింటాల్‌కు రూ.8,500 నుంచి రూ.9000 ధర ఉండగా ఈసారి రూ.6,800 నుంచి రూ.7100 ధర పలుకుతోంది. నూతన పత్తి మార్కెట్లో ధరను ప్రకటించిన మిల్లు యజమానులు క్వింటాల్‌కు రూ.300 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అధికంగా తెలంగాణలోని కృష్ణా, మక్తల్, నారాయణపేట, మద్దూరు, ఊట్కూరు, గద్వాల, ధరూరు, నందిన్ని, బలిగేర, అయిజ, ఆంధ్రప్రదేశ్‌లోని మాధవరం తదితర ప్రాంతాల నుంచి అధికంగా పత్తి బేళ్లు వస్తున్నాయి. ప్రతి నిత్యం హైదరాబాద్–రాయచూరు రహదారిలో పత్తితో లారీలు, ట్రాక్టర్లు, మినీ లారీలు, జీపులు, క్యాబ్‌లతో రైతులు పత్తిని తీసుకురావడంతో ట్రాఫిక్ సమస్య అధికమైంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక రైతుల ముఖాల్లో కళ లేదు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ జిల్లాల్లోని నదుల్లో నీరున్నా, యాదగిరి, కలబుర్గి జిల్లాల్లో నదుల నీరందక రైతులు భూముల్లో వేసుకున్న పంటల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. రైతులు జిల్లాలో లక్షా 70 వేల ఎకరాల్లో పత్తి, 86 వేల ఎకరాల్లో కందులు సాగు చేశారు.

ఇది కరప్షన్, క్యాపిటేషన్ సర్కారు


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్లీ: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు సీసీ సర్కారు ఉన్నట్లే, సీసీ అంటే కరప్షన్, క్యాపిటేషన్ అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో పరస్పరం బురదజల్లుకోవడం చూస్తుంటే అంతా తేటతెల్లం అవుతోందన్నారు. ఈ విషయంలో తానేమీ ఎక్కువ మాట్లాడబోనన్నారు. కాంగ్రెస్‌లో అంతా సరిగ్గా లేదన్న విషయాన్ని బీకే.హరిప్రసాద్ స్పష్టంగా చెప్పారన్నారు.సర్కారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిందన్నారు. తన నియంత్రణ కోల్పోతోందన్నారు. పార్టీలో పరస్పరం బురదజల్లుకోవడం ఆగలేదన్నారు. అసమ్మతి వల్ల పాలనపై పరిణామాలు పడ్డాయన్నారు. అందుకే ఇది సీసీ సర్కారు అని ఆయన ఎద్దేవా చేశారు. ఇదే సర్కారు అభివృద్ధి అన్నారు. ప్రధాన మోదీ కేంద్రం తరఫున 5 కేజీల బియ్యం ఇస్తుంటే రాష్ట్రంలోని పాలనకు ఒక కేజీ బియ్యాన్ని కూడా దానికి అదనంగా ఇవ్వడం లేదు. దీన్నే అన్నభాగ్య పథకం అంటూ అసత్య ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బెంగళూరు ప్యాలెస్‌లో జరుగుతున్న ఈడిగ సమావేశం గురించి మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయమై హరిప్రసాద్ మాట్లాడారన్నారు. కాంగ్రెస్‌లో తనకు వ్యతిరేకంగా రాజకీయాలు చేసే వారికి గురించి మాట్లాడే సత్తా హరిప్రసాద్‌కు లేదన్నారు. అందుకే ఆయన బీజేపీని నిందిస్తున్నారన్నారు. ఈ మతలబ్‌లు చేసేది సిద్దరామయ్యేనని, మాట్లాడే శక్తి హరిప్రసాద్‌కు లేదని అన్నారు. ఆయన సర్కారుపై ఎంత మేర రేగుతారో దాన్ని బట్టి సమాధానం ఇస్తానని ప్రహ్లాద్‌జోషి కాంగ్రెస్ రాజకీయాల గురించి తనదైన శైలిలో మండిపడ్డారు.

స్వామీజీలకు రాజకీయాలు వద్దు


మాట్లాడుతున్న నిజగుణానంద స్వామీజీ

హుబ్లీ: స్వామీజీలు రాజకీయాలకు దూరంగా ఉండాలని, మఠాన్ని రాజకీయాల్లోకి లాగరాదని నిజగుణానంద స్వామీజీ హితవు పలికారు. ధార్వాడలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. డీకే శివకుమార్ సీఎం అవుతారన్న నొణవినకెరె స్వామీజీ వ్యాఖ్యలపై స్పందించిన ఆయన లింగాయతులు మాత్రమే స్వామీజీలు కాదు, మౌల్వీలు, ఫాదర్లతో పాటు ఏ మత పెద్దలు రాజకీయాల్లోకి ప్రవేశించరాదన్నారు. ధర్మం, సంస్కృతి, సంస్కారాల గురించి ప్రజలకు బోధించడమే తమ కర్తవ్యం అన్నారు. నేటి సమాజంలో సమతుల్యత లోపించిందన్నారు. మఠాధీశులు రాజకీయాల్లోకి రాకూడదనేది సత్యం అన్నారు. రాజకీయ నేతలకు స్వామీజీలు మార్గదర్శనం చేయవచ్చు కానీ స్వామీజీలు ఎప్పటికీ రాజకీయ నేతలను బుజ్జగించరాదన్నారు. స్వామీజీల సేవలను పొందినప్పుడు రాజకీయ నేతలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. రాజకీయ నేతలతో ఉన్నప్పుడు స్వామీజీలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్ని పార్టీల వారు మఠాలకు వస్తారు. వారితో స్వామీజీలు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మఠాధీశులను రాజకీయాల్లో దుర్వినియోగపరచరాదన్నారు. ఆ సోయ(ప్రజ్ఞ) నేతలకు ఉండాలన్నారు. ఏ మఠాధిపతికి ఒత్తిళ్లు ఉండరాదన్నారు.

ఈబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని దీక్ష


ఉపవాస దీక్షలో పాల్గొన్న స్వామీజీలు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితర ప్రముఖులు

గంగావతి: అన్ని సమాజాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈబీసీ)కు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్ పేర్కొన్నారు. ఆయన బస్టాండ్ సర్కిల్ వద్ద ఈడిగ సమాజం వారు ఇతర సమాజాల వారిని కలుపుకొని ఈడిగ సమాజ గురువు ప్రణవానంద స్వామి నేతృత్వంలో చేపట్టిన ఉపవాస సత్యాగ్రహాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బ్రాహ్మణ సమాజం మొదలుకొని అన్ని సమాజాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారు ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సమాజానికి ఏర్పాటైన మండలికి రూ.500 కోట్ల నిధులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈడిగ సమాజం మరో రాష్ట్ర నేత మంచేగౌడ మాట్లాడుతూ గోశాస్త్ర అధ్యయనానికి రూ.25 లక్షలను ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ సమాజ సమస్యల సాధన కోసం అందరూ కలిసికట్టుగా, ఐక్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగభూషణ శివాచార్య స్వామీజీ, మాజీ ఎమ్మెల్యేలు పరణ్ణ మునవళ్లి, కెసరట్టి వీరప్ప, మాజీ ఎంపీ సూగూరు శివరామగౌడ, రైతు ప్రశస్తి విజేత జీ.శ్రీధర్, కేఆర్‌పీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌గౌడ హేరూరు, ఆ పార్టీ మరో నేత సయ్యద్ అలీ, నాయక్ సమాజ ప్రముఖులు వీరభద్రప్ప నాయక్, హనుమంతప్ప నాయక్, లమాణి సమాజ ప్రముఖులు రామనాయక్, కసాప మాజీ అధ్యక్షులు సీహెచ్ నారినాళ్, దళిత సంఘం నేత అంబణ్ణ, గంగామత ప్రముఖులు రాజశేఖర్ ముస్టూరు, ఇతర పలు సమాజాల ప్రముఖులు పాల్గొన్నారు. కాగా ప్రణవానంద స్వామి ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపవాస సత్యాగ్రహాన్ని కొనసాగించారు.

మానవ హక్కుల్ని కాపాడతాం


ప్రతిజ్ఞ చేస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

హొసపేటె: మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయ హాలులో జిల్లా పాలనాధికారి ప్రతిజ్ఞ చేశారు. కర్ణాటక రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఆదేశాల మేరకు జిల్లాధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మానవ హక్కుల్ని కాపాడతామని తహసీల్దార్ మేఘా ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాధికారి కార్యాలయ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్ని అభివృద్ధి పరచాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: అధోపతనం వైపు పయనిస్తున్న ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి ప్రాముఖ్యతనివ్వాలని నగరసభ సభ్యుడు జయన్న వెల్లడించారు. ఆదివారం ప్రైవేట్ హోటల్‌లో భారత జ్ఞాన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జ్యోతి వెలిగించి మాట్లాడారు. ప్రభుత్వ బడుల కంటే ప్రైవేట్ పాఠశాలలు మెరుగైన స్థితిలో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలను పెంచేందుకు తోడు అభివృద్ధికి చొరవ తీసుకొనేలా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో జయతీర్థ, హఫీజుల్లా, రాకేష్, సత్యనారాయణలున్నారు.

నిజలింగప్ప జయంతి


ప్రతిమకు పూలమాల వేసిన స్థానికులు

రాయచూరు రూరల్: నగరంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి దివంగత నిజలింగప్ప 121వ జయంతిని ఆచరించారు. నిజలింగప్ప కాలనీలోని నిజలింగప్ప ప్రతిమకు సీనియర్ సిటిజన్ వీరనగౌడ పూలమాల వేసి ముఖ్యమంత్రిగా నిజలింగప్ప అందించిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా నారాయణరెడ్డి, సిద్దారెడ్డి, భీమరెడ్డి, అమరేగౌడలున్నారు.

క్రీడలతో పోటీతత్వం



మాట్లాడుతున్న ఎస్ఐ గీతాంజలి షిండే

కంప్లీ: పిల్లలు పాఠాలతో పాటు ఆటల పోటీల్లో పాల్గొనడం వల్ల పోటీ మనోభావం పెంపొందుతుందని, తద్వారా శారీరక ఎదుగుదల, ఆరోగ్య వృద్ధికి దోహదపడుతుందని ఎస్ఐ గీతాంజలి షిండే తెలిపారు. కొట్టూరు పట్టణంలోని సీబీఎస్ఈ పాఠశాలలో శుక్ర, శనివారాల్లో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడోత్సవాలను ప్రారంభించి ఆమె మాట్లాడారు. పిల్లల అభ్యసన సర్వతోముఖ అభివృద్ధికి, మానసిక ఆరోగ్యానికి క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. గెలుపు ఓటమిల కంటే క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యం అని ఆమె అన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరు బైకిస్టుల దుర్మరణం


మరణించిన యువకులు

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరు తాలూకాలో బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. సింధనూరు తాలూకా ముద్దాపుర వద్ద మల్లాపురకు చెందిన హనుమంతప్ప(23), దేవరాజ్(24)లు మస్కి నుంచి సింధనూరుకు బైక్‌పై వెళుతుండగా ముద్దాపుర కేఈబీ వద్ద వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ప్రమాదం జరిగిన వెంటనే సింధనూరు డీఎస్పీ తళవార్, సీఐ వీరారెడ్డి, దుర్గప్ప పరిశీలించి మృతదేహాలను పంచనామా కోసం సింధనూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు కనీస చట్టపరిజ్ఞానం అవసరం


జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: మహిళలకు కనీస చట్టం, న్యాయంపై అవగాహన అవసరమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత వెల్లడించారు. ఆదివారం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ మానవ హక్కుల, న్యాయవాదుల దినోత్సవాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. నేటి రోజుల్లో నేరాలు, దోపిడీలు అధికం అవుతున్నాయన్నారు. చట్టం, న్యాయంపై అవగాహనతో పాటు ఆధ్యాత్మిక విషయాలపై కూడా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు నాగరాజ్, నీలకంఠరావ్, సి.బి.పాటిల్, అశోక్ ఎస్‌జీ మఠలున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ


బాలికల విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న దృశ్యం


ఫైనల్‌లో గెలిచిన తర్వాత ట్రోఫీతో బాలుర జట్టు


హోరాహోరీగా ఆడుతున్న బాలికలు


ఉత్సాహంగా తలపడుతున్న బాలురు

హొసపేటె: నగరంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ప్రీ–గ్రాడ్యుయేషన్ కళాశాల విద్యార్థుల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీ ఫైనల్‌లో దక్షిణ కన్నడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మూడబిద్రె అళ్వాస్ ప్రీ గ్రాడ్యుయేషన్ కళాశాల బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. పోటాపోటీగా జరిగిన బాలికల సెమీ ఫైనల్‌లో దక్షిణ కన్నడ జిల్లా జట్టు 2–0 సెట్ల తేడాతో విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ జిల్లాల బాలికల జట్లు హోరాహోరీగా తలపడగా, ఎట్టకేలకు దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన మూడబిద్రె ఆళ్వాస్ ప్రీ గ్రాడ్యుయేషన్ కళాశాల జట్టు కెప్టెన్ సావిత్రి రమేష్ నేతృత్వంలో హోరాహోరీగా పోటీనిచ్చి రాష్ట్ర స్థాయి బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదే విధంగా బాలుర విభాగంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో దక్షిణ కన్నడ జిల్లా చిక్కమగళూరు జిల్లా జట్టుపై 2–0 సెట్ల తేడాతో విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణ కన్నడ జిల్లా ఆళ్వాస్ ప్రీ గ్రాడ్యుయేషన్ కళాశాల టీమ్ లీడర్ ఎస్.చరణ్ చిక్కమగళూరు జిల్లా జట్టుకు గట్టి పోటీనిచ్చారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీసీ దురుగేష్

రాయచూరు రూరల్: నగరంలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం నగరంలోని టాగూర్ కళాశాలలో శాఖా పరంగా నిర్వహించిన పోటీ పరీక్ష కేంద్రాన్ని అదనపు జిల్లాధికారి దురుగేష్ తనిఖీ చేశారు. మొత్తం 7,058 మంది అభ్యర్థులకు గాను 5,498 మంది అభ్యర్థులు హాజరు కాగా 1,560 అభ్యర్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఎస్పీ నిఖిల్ తెలిపారు.

నలుగురు పీడీఓలపై సస్పెన్షన్ వేటు


సస్పెండైన పీడీఓలు

రాయచూరు రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కూలీ కార్మికులకు ఉపాధి కల్పించకుండా నిధులు దిగమింగిన నలుగురు పీడీఓలను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం ఆయన ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. 2020–21, 2022–23ల్లో దేవదుర్గ తాలూకాలో టీపీ అసిస్టెంట్ డైరెక్టర్, ఈఓలు రూ.11 కోట్లు, 95 మంది పీడీఓలు, 6,623 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు కలిసి రూ.200 కోట్ల మేర నిధుల దుర్వినియోగంపై విచారణ చేశామన్నారు. మొదటి విడతలో జాలహళ్లి పీడీఓ పత్యప్ప రాథోడ్, గాణదాళ పీడీఓ మల్లప్ప, కొత్తదొడ్డి పీడీఓ సి.బి.పాటిల్, శావంతగేర పీడీఓ గురుస్వామిలను సస్పెండ్ చేశామన్నారు.

వాగ్గేయకారుల రచనలు అమోఘం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన యుగంలో నశించిపోతున్న వాగ్గేయకారుల రచనలను కాపాడుకోవాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. ఆదివారం కన్నడ భవనంలో కసాప ఆధ్వర్యంలో కవి బసవరాజ్ సబరద రాసిన వాగ్గేయకారులు పాడిన పాటల పుస్తకాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ వాగ్గేయకారుల పదాలతో అర్థవంతంగా పాడి ప్రజలను రంజింపచేస్తున్నారన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ భాషకు పెద్ద పీట వేయాలన్నారు. రూ.50 లక్షల మేర కన్నడ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కసాప అధ్యక్షులు రంగన్న పాటిల్, రామణ్ణ, కాళప్ప, వెంకటేష్, మహంతేష్, చెన్నబసవ, శరణేగౌడలున్నారు.

అంకసముద్రలో విదేశీ పక్షుల సందడి


అంకసముద్రకు వలస వచ్చిన వివిధ రకాల పక్షులు

హొసపేటె: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని తుంగభద్ర నది తీరాన ఉన్న అంకసముద్రలో విదేశీ పక్షులు సందడి చేశాయి. ప్రస్తుతం చలికాలం ప్రారంభం కావడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి పక్షులు వలస రావడంతో అంకసముద్రం వివిధ రకాల పక్షులతో కనువిందు చేస్తోంది. సూర్యోదయానికి ముందు ఇక్కడ వాతావరణ దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా మారింది. సుమారు 244 ఎకరాల ప్రదేశంలో ఉన్న ఈ అంకసముద్రలో ప్రతి ఏటా వివిధ ప్రాంతాల నుంచి పక్షులు వలస రావడం అనవాయితీ. చలికాలం ముగింపు అనంతరం వేసవి ప్రారంభ సమయంలో ఇక్కడకు వచ్చిన వలస పక్షులు తిరిగి తమ సొంత గూటికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహారం కోసం అన్వేషిస్తాయి. సూర్యాస్తమయం అనంతరం అంకసముద్రలో నివాసముంటాయి. నార్తర్న్ శెవలర్ గార్గేవి, ఉడ్ శాండ్ పైపర్, కామన్ ప్యాండ్ పైపర్, పేంటెడ్ స్టార్క్, స్పాట్ బిల్డ్ డక్, పెలికాన్, గ్రే హెరాన్, నైట్ హెరాన్, క్యాటర్ ఈ గ్రేట్‌తో పాటు మొత్తం 150 పైగా రకాల వివిధ అందమైన అతిథి పక్షులు ఇక్కడకు వలస వచ్చాయి. ఇక్కడ ఉన్న పక్షులను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలిరావడంతో అంకసముద్ర పరిసరాలు పర్యాటకుల సందడితో కళకళలాడుతున్నాయి.





